08-05Pg1exHMNWJQE.qxd:08-05Pg1exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

Published from Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-5-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 96 పేజీలు: 16 వెల: 6.50

: fb.com/vaartha Digital

## సమర 'సిందూర'ం..






## 'సిందూర్'కు హనుమంతుడే స్ఫూర్తి

2లో

రక్షణమంత్రి రాజ్‌నాథ్

**పహల్గాంలో 26 మందిని బలిగొన్న ఘటనకు 2 వారాల్లోనే దీటైన జవాబిచ్చింది భారత్. అర్ధరాత్రి దాయాది దేశంలోని ఉగ్ర స్థావరాలపై అత్యాధునిక క్షిపణులతో జరిపిన దాడిలో 100 మంది పైగా ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. ఆడబిడ్డ సిందూరాన్ని చెరిపేసిన ముష్కరులను అరగంట వ్యవధిలో 'ఆపరేషన్ సిందూర్' పేరుతో అంతమొందించడం అపూర్వమే అని చెప్పాలి.**




## ఆ 9 టార్గెట్లు ఇవే..

**ముజఫరాబాద్, మే 7:** పహల్గామ్ దాడి జరిగి సరిగ్గా 15 రోజులు గడిచిన తర్వాత భారతదేశం ప్రతీకారం తీర్చుకుంది. నేడు తెల్లవారు జామున 1:44 గంటల ప్రాంతంలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్, ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. బహావల్‌పూర్‌లోని మసూద్ అజార్ రహస్య స్థావరంసహా తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారతదేశం బాంబు దాడి చేసింది. ఈ క్షిపణి దాడిలో ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ మద్దతు ఉన్న లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి భారత వ్యతిరేక ఉగ్రవాద >>2

# ఉగ్రమూకలపై అగ్నివర్షం

## 100 మంది ఉగ్రవాదులు హతం

### ఎమర్జెన్సీ ప్రకటించిన పాక్



**ఇస్లామాబాద్, మే 7:** ఆపరేషన్ సింధూర్‌పేరుతో పాకిస్థాన్ లోని ఉగ్ర స్థావరాలపై భారత్‌ఆర్మీ ఎయిర్ ఫోర్స్ నేవీలు సంయుక్తంగా మెరుపు దాడులు చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటూ పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశాయి. బహావల్‌పూర్, కోట్లీ, ముజఫరాబాద్‌పై క్షిపణి దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు 100 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు సమాచారం. మరికొంతమంది తీవ్రంగా గాయపడినట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో పాకిస్తాన్ ఎమర్జెనీ ప్రకటించింది.ఎమర్జెన్సీ లో ఏమేమి చేయాలో కార్యక్రమాలను చేపడుతోంది. కొద్ది సేపటి క్రితమే ఎమర్జెన్సీ ని ప్రకటించింది. అలాగే సరిహద్దు ప్రాంతాల్లో భారత్ సైనికులపై పాక్ సేనలు తిరగబడుతున్నాయి. ఈ ఘటనలో ఇరువైపులా ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం. రాత్రి జరిగిన ఆపరేషన్ సింధూర్‌కు ప్రతీకారంగా పాకిస్తాన్ ఇప్పుడు స్పందిస్తోంది. సరిహద్దులో ఉద్రిక్తత నెలకొంది. కాగా భారత్ సేనలు పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాల్లో దాడులు చేసి వాటిని ధ్వంసం చేశారు. అయితే పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులను పాక్ ప్రభుత్వం వేరే శిబిరాలకు తరలించింది. మదర్సాలలో పెట్టారు. దీంతో పాకిస్తాన్ ప్రభుత్వం తమ మదర్సాలు, మసీదులు, ప్రార్థనా మందిలపై భారత్ దాడి చేసిందని పాకిస్తాన్ ప్రజలను రెచ్చగొడుతూ.. అక్కడ జరిగిన నష్టాన్ని ప్రపంచం ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. మెడికల్ ఎమర్జెన్సీని కూడా ప్రకటించింది. ఆపరేషన్ సింధూర్ పేరుతో >>2

## పాక్‌లోని స్థావరాలపై విరుచుకుపడిన భారత్

- అర్ధరాత్రి 23 నిముషాలు సాగిన 'ఆపరేషన్ సిందూర్'
- మొత్తం 9 ఉగ్ర క్యాంపులు ఏకకాలంలో ధ్వంసం
- క్షిపణులు, బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లతో సర్జికల్ స్ట్రైక్
- భారీ సంఖ్యలో ఉగ్రవాదులు హతం
- పహల్గాం ఘటనకు జవాబిచ్చిన భారత్ సైనికులు





ఆపరేషన్ సిందూర్ వివరాలను బుధవారం న్యూఢిల్లీలో మీడియాకి వెల్లడిస్తున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ చిత్రంలో కల్నల్ సోఫియా ఖురేషి, ఐఎఎఫ్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్

**న్యూఢిల్లీ, మే 7:** పహల్గాంలో భారత మహిళల సింధూరాన్ని చెరిపేసిన ముష్కరులను అంతంచేసి భారత్ తన ఆయుధ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పింది. కేవలం 25 నిమిషాల్లోనే 24 అత్యాధునిక క్షిపణులను ప్రయోగించి పొరుగుదేశం, శత్రుదేశం అయినా సాధారణ పౌరులకు ఏమాత్రం నష్టంలేని విధంగా భారత్ తన ఆపరేషన్ సింధూర్ ముగించింది. రాత్రి పొద్దుపోయాక 1.05 నిమిషాలకు ఒక్కసారిగా జరిగిన ఈప్రయోగాల్లో మొత్తం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యాయి. లెక్కలు చెప్పేందుకు సైతం పాక్ వణుకుతున్న వేళ సుమారు 100 మందికిపైగా ఉగ్రవాదులు ఈ దాడిలో హతం అయ్యారు. ఆడబిడ్డ సింధూరాన్ని చెరిపేసిన ముష్కరులకు మహిళా శక్తి ఎలాంటిదో భారత త్రివిధ దళాలు సంయుక్తకార్యాచరణలో చూపించాయి. ప్రధాని మోడీ >>2



## మోడీ అంతుచూస్తాం..

### ప్రతీకారం తీర్చుకుంటాం.. లష్కరే అధినేత మసూద్ అజహార్ బహిరంగ లేఖ

**భావల్పూర్(పాకిస్తాన్), మే 7:** పాక్‌ఆక్రమిత కాశ్మీర్‌తోపాటు పాకిస్థాన్‌లోని పంజాబ్‌ప్రావిన్స్ లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ఏకకాలంలో ద్వంసంచేసిన భారత్, పాకిస్తాన్‌కు కంటిమీద కునుకులేకుండాచేసింది. దీనికితోడు లష్కరే అధినేత మౌలానా మసూద్ అజహార్ >>2

## మసూద్ అజహార్ కుటుంబ సభ్యులు హతం 2



బుధవారం విశాఖలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక, ఎస్‌డిఆర్ఎఫ్., ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

## ఉగ్రదాడులపై అప్రమత్తం

### విశాఖలో మాక్‌డ్రిల్ పర్యవేక్షించిన కలెక్టర్, అధికారులు

**విశాఖపట్టణం, మే 7, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం విశాఖపట్టణం నగరంలో బుధవారం పలు చోట్ల సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ దళాలు ప్రదర్శనలు ఇచ్చాయి. బుధవారం సాయంత్రం వన్ టౌన్ పరిధిలోని రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో వేర్వేరుగా నిర్వహించిన ఆపరేషన్లలో సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక, ఎస్‌డిఆర్ఎఫ్., ఎన్‌డిఆర్ఎఫ్., పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ, సివిల్ సప్లైస్, వైద్య శాఖ, పలువురు వాలంటీర్లు భాగస్వామ్యమయ్యారు. ముందుగా రాణీబొమ్మ సెంటర్లో రెండు భవనాల్లో ఉగ్రమూకలు పొగ బాంబులతో దాడులు చేయగా స్పందించిన అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపు చేశాయి. వెనువెంటనే సంఘటనా స్థలానికి మాస్కులు ధరించి చేరుకున్న ఎన్‌డిఆర్ఎఫ్., ఎస్‌డిఆర్ఎఫ్. సహాయక సిబ్బంది ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను కాపాడారు. నిచ్చెన సాయంతో కొందరిని కిందకు దించగా, మరికొందరిని భద్రతా సిబ్బంది మెట్ల మార్గంద్వారా కిందకుదించారు. ప్రమాదంలో గాయపడిన వారిని హుటాహుటిన ప్రమాద స్థలానికి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరాలకు తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. వన్ టౌన్ పరిధిలోని క్వీన్ >>2

## ప్రతి ఉద్యోగికి సామర్థ్య శిక్షణ

### ముఖ్యమంత్రి చైర్మన్‌గా పి-4 ఫౌండేషన్

### 'ఆపరేషన్ సిందూర్'పై సమీక్ష జరిపిన చంద్రబాబు



**విజయవాడ, మే 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కెపాసిటీ బిల్డింగ్‌పై దృష్టిపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మారుతున్న పరిస్థితులు,వివిధరంగాల్లో ఆధునీక ఆవిష్కరణలు, సాంకేతికంశాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు నిరంతరం తమ సమర్ధతను పెంచుకోవాలన్నారు. గ్రామస్థాయి ఉద్యోగి నుంచి సెక్రటరీ వరకు ప్రతి ఒక్కరికీ కెపాసిటీ బల్డింగ్ కోసం శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని సిఎం అన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో శిక్షణతో సామర్థం పెంచడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని సిఎం స్పష్టంచేశారు. సచివాలయంలో ప్లానింగ్, స్వర్ణాంధ్ర విజన్, జీఎస్డీపీపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షచేశారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారి నుంచి సెక్రటరీ వరకు., కానిస్టేబుల్ నుంచి డిజిపి వరకు కెపాసిటీ బిల్డింగ్ జరగాలి అన్నారు. నేను కూడా నిత్యం కెపాసిటీ బిల్డింగ్‌పై దృష్టిపెడతానన్నారు.కొత్త విషయాలు నేర్చుకుంటా..టెక్నాలజీ గురించి తెలుసుకుంటా..సాంకేతిక ద్వారా పాలనలో ఎటువంటి మార్పులు తేవచ్చు అనేది తెలుసుకుంటా. ప్రతి ఉద్యోగి శిక్షణ పొందడం ద్వారా నైపుణ్యాలను పొందవచ్చు. ఇది పాలనలో ఫలితాలకు ఎంతో ఉపయోపడుతుంది. సేవల్లో నాణ్యత పెరుగుతుంది అని సిఎం అన్నారు.

**వచ్చే నెల కల్లా నియోజకవర్గాల విజన్ ప్లాన్**

స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యం చేరుకోవడం కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కాగా... నియోజకవర్గాల వారీగా విజన్ ప్లాన్ వచ్చే నెల నాటికి రూపొందించనున్నామని సిఎం తెలిపారు. అలాగే థీమాటిక్ రిపోర్ట్స్ జూన్‌కు, సెక్టోరల్ రోడ్ మ్యాప్ సెప్టెంబర్ >>2

## దేశాన్ని తల ఎత్తుకునేలా చేసిన ప్రధానికి సెల్యూట్



### - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ సందర్భంగా భారత బలగాలకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీసుకున్న చర్యలను పవన్ >>2

## ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మికి 'సుప్రీం'లో చుక్కెదురు

### ఓబుళాపురం కంపెనీ కేసు మరో మలుపు

### మళ్లీ విచారణ జరపాలని 'సుప్రీం' ఆదేశం



**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఓబుళాపురం మైనింగ్ కంపెనీ కేసులో కీలకమలుపు చోటు చేసుకుంది. ఐఎఎస్ ఆఫీసర్ శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా 3 నెలల్లో మరోసారి విచారించాలంటూ దిగువ కోర్టుకు సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు తీర్పును దేశ సర్వోన్నత న్యాయస్థానం పూర్తిగా పక్కన పెట్టేసింది. మూడు నెలల్లో మరోసారి దీనిపై విచారణ జరపాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. హైకోర్టు తీర్పుతో సంబంధం లేకుండా మరోసారి విచారణ చేపట్టాలని సుప్రీం స్పష్టం చేసింది. 2022వ సంవత్సరంలో ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని తెలంగాణ హైకోర్టు ఈ కేసు నుంచి డిశ్చార్జ్ చేసిన విషయం తెలిసిందే. ఆ డిశ్చార్జ్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు >>2





భారత సైన్యం జరిపిన 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ధ్వంసమైన ఉగ్రవాదుల స్థావరాలు

# ఉగ్రమూకలపై అగ్ని వర్షం

>> ఉక్కుసంకల్పంముందు ఉగ్రవాదం విచ్ఛిన్నం అయింది. గడచిన తొమ్మిదిరోజులుగా ప్రధాని త్రివిధ దళాధిపతులతోపాటు, రక్షణ,హోం, భద్రతా సలహాదారులతో జరిపిన ఎడతెగని సమావేశాలు కార్యరూపంలోకి వచ్చాయి. కేవలం అర్థగంట సమయంకూడా పట్టకుండానే తమ మొత్తం ఆపరేషన్ పూర్తిచేసి భారత త్రివిధ దళాలు తమ సత్తాఏంటో కేవలం దాయాదికే కాదు కయ్యానికి కాలు దువ్వుతున్న ఇతర ప్రపంచదేశాలకు కూడా చూపించాయి. నవవధువు హిమాంశు నర్వాల్ సింధూరాన్ని చెరిపేసిన ఉగ్రవాదులను వెంటాడి హతమారుస్తామనిచెప్పినట్లే భారత్ తన శక్తిని చాటిచెప్పింది. అందుకే ఈ దాడులకు 'ఆపరేషన్ సింధూర్' అని ప్రధాని స్వయంగాపేరుపెట్టారు. పేలుడు సమీపించిన ప్రాంతంలో ఉగ్రవాదులు భయంతో పరుగులుతీసారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్, పంజాబ్‌ప్రావిన్స్‌ల్లో ఉన్న ఉగ్రస్థావరాలను ఏకకాలంలో ధ్వంసంచేసాయి. కేవలం ఉగ్రాదుల స్థావరాలు, ఉగ్రవాదులే లక్ష్యంగా జరిగిన ఈ దాడుల్లో జైషేముహ్మద్, లష్కరే తాయిబా, హిజ్‌బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల స్థావరాలన్నీ కుప్పకూలిపోయాయి. పివోకేలోని ముజఫరాబాద్, కోట్లి, బహవల్పూర్, రావల్‌కోట; చక్స్వారీ, బీంబర్, నీలం వ్యాలీ, జీలం చక్వాలలోని ఉగ్రవాద కాంప్లెక్స్‌లపైనే ఈ దాడులునిర్వహించింది. భారత కాశ్మీర్‌ప్రాంతంలోకి చొరబాట్లను ప్రోత్సహించేందుకు రవాణా లాజిస్టిక్స్ పాయింట్లుగా ముజఫరాబాద్, భీంబర్‌లను గుర్తించిన భద్రతా దళాలు ఆపరేషన్ సింధూర్‌లో ధ్వంసంచేసాయి. శిక్షణా శిబిరాలు, గోదాములు, శిక్షణ ఇచ్చే వేదికలు, మొత్తం కూల్చివేసాయి. అయితే పాకిస్థాన్ సైనిక స్థావరాలు టార్గెట్ చేయగలిగే సత్తా ఉన్నా కూడా భారత్ వాటిజోలికి వెళ్లకుండా కేవలం ఉగ్రసంస్థలనే టార్గెట్‌గా ఎంచుకుంది. గుల్పూర్ ఉగ్రక్యాంప్ అంతర్జాతీయ సరిహద్దుకు 30 కిలోమీటర్లదూరంలో ఉంది. లష్కరేతాయిబాకు చెందినదని తేల్చారు. ఇక్కడినుంచే రాజౌరి పూంచ్‌ప్రాంతాల్లోకి చొరబడుతున్నట్లు తేలింది. ఈస్థావరంలోనే 2023, 2024 పూంచ్‌దాడుల్లో పాల్గొన్న ఉగ్రవాదులు శిక్షణపొందారని కూడా భారత్ గుర్తించింది. దాడిచేసిన తొమ్మిది కేంద్రాలు కూడా ఉగ్రవాదులకు స్వర్గధామాలుగా ఉన్నాయి. మర్కజ్ సుభాన్ అల్లాహ్ కేంద్రం భావల్‌పూర్‌లో జైషేముహ్మద్ కేంద్ర కార్యాలయం, మర్కజ్ తైబా మురిడ్కె లష్కరే తాయిబాకు స్థావరం కాగా సర్జాల్, తెహ్రా కలాన్ జైషేముహ్మద్‌కు కేంద్రంగా ఉంది. హిజ్‌బుల్ ముజాహిదీన్ సంస్థ మెహమూనా జోయా సియాల్కోట్ కేంద్రంగా పనిచేస్తోంది. అలాగే లష్కరేకకు మస్జీద్ అహ్లె హదిత్ బామాలా, కోట్లిలోని మస్జీద్ అబ్బాస్‌జైషేముహమ్మద్, అక్కడే ఉన్న మస్కర్ రహీల్ షహీద్ హిజ్‌బుల్ ముజాహిదీన్‌లు పనిచేస్తున్నాయి. ఇక పీవోకేలోని ముజఫరాబాద్‌లో లష్కరేకు భారీ ఉగ్రశిక్షణా కేంద్రంఉంది. షావైయి నల్లా శిబిరంగా పేరుపొందింది. అక్కడే జైషే సంస్థకు కూడా సైద్‌నా బిలాల్ శిబిరం కూడా నడుస్తోందనిభారత్ నిర్దిష్టమైన నివేదికలు అధ్యయనంచేసిన తర్వాతనే దాడులుచేసి సమూలంగా మట్టుబెట్టింది. ప్రధానిమోడీ ఈ ఆపరేషన్ పూర్తయ్యేంతవరకూ నిరంతరం పర్యవేక్షణచేసారు. మరోపక్క రక్షణ మంత్రి రాజ్‌నాథ్,హోంమంత్రి అమిత్‌షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌ధోభాల్‌లు సైతం దాడుల అనంతర పరిణామాలను నిత్యం పర్యవేక్షిస్తూ రాష్ట్రాలను అప్రమత్తంచేసారు.
ఓపక్క నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ తెల్లవారితే యుద్ధసమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్స్‌ను దేశంలోని 244 జిల్లాల్లో నిర్వహించే క్రమంలో ఈ దాడులు జరిగాయి. గడచిన పదిరోజులుగా భయపడుతూనే ఉన్న పాకిస్థాన్‌కు అంతుచిక్కని విధంగా దాడులు నిర్వహించి భారత్ తన సింధూర శక్తిని నిరూపించింది. దాడుల వివరాలను విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతోపాటు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషిలు సమగ్రంగా వివరించారు. దాడుల వివరాలను కూడా విడియోలు, చిత్రాలతో సరిహద్దుకుఎంతెంతదూరంలోఉన్నాయో వివరించారు.

# ఆ 9 టార్గెట్లు ఇవే..

>> సంస్థల స్థావరాలన్నీ ధ్వంసమయ్యాయని సమాచారం. ఈ ఉగ్రవాద సంస్థలకు చెందిన అనేక శిక్షణా శిబిరాలు (మర్కజ్) లాంచ్ ప్యాడ్‌లు ప్రస్తుతం పాక్ సైనిక స్థావరాలకు సమీపంలో నడుస్తున్నాయి. భారతదేశంకు వ్యతిరేకంగా ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నడుపుతున్న 9 స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని నిఘా వర్గాలు నిర్ధారించాయి.

**మర్కజ్ సుభాన్ అల్లా, బహావల్పూర్:** ఈ ఉగ్రవాద స్థావరం 2015 నుండి చురుకుగా ఉంది. ఇది జైష్‌ఎమహ్మద్ ప్రధాన కార్యాలయం అని కూడా చెబుతారు. ఈ రహస్య స్థావరం 2019 పుల్వామా దాడితో సహా జెఎం ఉగ్రవాద ప్రణాళికలతో ముడిపడి ఉంది. జెఎం చీఫ్ మోలానా మసూద్ అజార్, ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మోలానా అమ్మర్, మసూద్ అజార్ కుటుంబ సభ్యులు మర్కజ్‌లో నివసించారు. ఇక్కడి నుండే మసూద్ అజార్ భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారాలు చేస్తూ, యువత ఇస్లామిక్ జిహాద్‌లో చేరాలని ప్రసంగాలు చేసేవాడు. మర్కజ్ సుభాన్ అల్లాహ్ వద్ద తన కార్యకర్తలకు జెఇఎం క్రమం తప్పకుండా ఆయుధాలు, శారీరక, మతపరమైన శిక్షణను అందించింది.

**మర్కజ్ తైబా, మురిడ్కే:** 2000లో స్థాపించబడిన మర్కజ్ తైబా, పాకిస్తాన్‌లోని పంజాబ్‌లోని నంగల్ సహదాన్ మురిడ్కేలో ఉన్న అల్మా మేటర్, ఎల్‌ఇటి అతిపెద్ద శిక్షణా కేంద్రం. దీనిలో ఆయుధాలు, శారీరక శిక్షణా సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం 1000 మంది విద్యార్థులు ఈ మర్కజ్‌లో చేరుతారని తెలుస్తోంది. ప్రతి సంవత్సరం లష్కర్ కోసం ఉగ్రవాద సంస్థలను సిద్ధం చేస్తుంది. మర్కజ్ తైబా కాంప్లెక్స్ లోపల మసీదు, అతిథి గృహం నిర్మాణానికి ఒసామా బిన్ లాడెన్ రూ. 10 మిలియన్ డాలర్లు ఆర్థిక సహాయం చేశాడు.

**సర్జల్ /తెహ్రా కలాన్:** పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో నరోవాల్ జిల్లాలోని షకర్‌గఢ్ తహసీల్‌లో ఉన్న ఈ స్థావరం, జమ్మూ కాశ్మీర్‌లోకి ఉగ్రవాదుల చొరబాటుకు జైష్‌ఎమొహమ్మద్ (జెఎం) ప్రధాన కేంద్రం. జెఎం ఉగ్రవాదులు మహ్మద్ అద్నాన్ అలీ అలియాస్ డాక్టర్, కాషిఫ్ జాన్ ఆ ప్రదేశాన్ని క్రమం తప్పకుండా సందర్శించేవారు.

**మహ్మూనా జోయా సెంటర్, సియాల్‌కోట్:** హిజ్బుల్ ముజాహిదీన్ మహ్మూనా జోయా ఉగ్రవాద స్థావరం భుట్టా కోట్లి ప్రభుత్వ కేంద్రంలో ఉంది. దీనిని హిజ్బుల్ ముజాహిదీన్ క్యాడర్లను జమ్మూ ప్రాంతంలోకి చొరబడటానికి ఉపయోగిస్తారు.

**మర్కజ్ అహ్లే హాదీత్ బర్నాలా:** బర్నాలా నగర శివార్లలో కోటే జమీల్ రోడ్డులో ఉన్న భీంబర్, జమ్మూ కాశ్మీర్‌లోని ఎల్ఇటి ప్రధాన శిక్షణా కేంద్రం. పూంచ్ రాజౌరి రియాసి సెక్టార్‌కు ఎల్ఇటి ఉగ్రవాదులను ఆయుధాలను పంపడానికి ఉపయోగించేవారు.

**మర్కజ్ అబ్బాస్, కోట్లి:** ఇది పాకిస్తాన్‌లోని కోట్లిలో ఉన్న జెఇఎమ్ ముఖ్యమైన ఉగ్రవాద స్థావరం. జేఈఎం టాప్ కమాండర్ ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్ సన్నిహితుడు హాఫీజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీ జర్రార్ ఈ మర్కజ్‌కి నాయకత్వం వహిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులకు ప్రణాళికలు వేయడంలో, అమలు చేయడంలో ఖారీ జర్రార్ ప్రత్యక్షంగా పాల్గొన్నాడు.

**మస్కర్ రహీల్ షాహిద్, కోట్లి:** ఇది హిజ్బుల్ ముజాహిదీన్ పురాతన శిక్షణా కేంద్రం. ఇది దాదాపు 150-200 మంది హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తుంది.

**షావై నల్లా క్యాంప్, ముజఫరాబాద్:** ఆక్రమిత కశ్మీర్‌లోని చెలబుండి వంతెన సమీపంలో ఉన్న ఈ ఉగ్రవాద స్థావరం లష్కర్ అత్యంత ముఖ్యమైన శిబిరాలలో ఒకటి. అజ్మల్ కసబ్ సహా 26/11 ముంబైలో దాడి చేసిన ఉగ్రవాదులు ఈ శిబిరంలోనే ఉగ్రవాద శిక్షణ పొందారు. ఈ శిబిరం ఎల్‌ఇటి కార్యకర్తల నియామకం, నమోదు, శిక్షణ కోసం ఉపయోగిస్తారు. ఇది 2000ల సంవత్సరం నుండి నడుస్తోంది.

**మర్కజ్ సయ్యద్నా బిలాల్:** ముజఫరాబాద్‌లోని ఎర్రకోట ఎదురుగా ఉన్న ఇది ఆక్రమిత కాశ్మీర్‌లోని జైష్ ప్రధాన కేంద్రం. ఈ స్థావరాన్ని ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్‌లోకి ప్రవేశించేముందు వారికి రవాణాశిబిరంగా ఉపయోగిస్తారు. భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం నిర్వహించాయి. అదే సమయంలో ప్రధాని మోడీ ఆపరేషన్ సిందూర్‌ను నిరంతరం పర్యవేక్షించారు. ఈ దాడిలో 9 ఉగ్రవాద స్థావరాలు పూర్తిగా నాశనం అయ్యాయని సమాచారం

## ఉగ్రవాదులు హతం

>> ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కలిసి మెరుపు దాడులు చేశాయి. ఈ దాడుల్లో సుమారు 100 మం దికిపైగా ఉగ్రవాదులు హతమైనట్లు సమా చారం. భారత్ దాడితో పాకిస్థాన్‌లో అలజడి రేగింది. లాహోర్, సియాల్ కోట్ ఎయిర్ పోర్టులను మూసివేసింది. ఇస్లామాబాద్, రావల్పిండిలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటిం చింది. పాక్ అధికారులు వైద్య సిబ్బందికి సెలవులు రద్దు చేసి.. వెంటనే విధుల్లో చేరా లని ఆదేశాలు జారీ చేశారు. పాకిస్థాన్ లోని ప్రధానఎయిర్ పోర్టుల్లోనూ ఎమర్జెన్సీ ప్రకటించారు.

## మసూద్ అజహర్ కుటుంబసభ్యులు హతం

**ఇస్లామాబాద్, మే 7:** భారత్ చేపట్టిన దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబసభ్యులు హతమయ్యారు. 10 మంది కుటుంబసభ్యులు, మరో నలుగురు అనుచరులు మరణించినట్లు మసూద్ అజార్ వెల్లడించాడు. భారత్ దాడుల్లో మసూద్ అజార్ అక్క, బావ, మేనల్లుడు, అతని భార్యతో పాటు మరో ఐదుగురు మరణించినట్లు చెప్పాడు. జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం బహవల్‌పుర్ లోని జామియా మస్జీద్ సుబాన్ అల్లాహ్ ప్రాంతంలో జరిగిన దాడిలో మరణించినట్లు తెలిపాడు. భారత్ చేపట్టిన దాడుల్లో జైషే ప్రధాన కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్ అల్లాహ్‌పై భారత సైన్యం దాడి చేసింది. దీన్ని జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా గుర్తిస్తారు. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలకు ఇక్కడే ప్రణాళిక రచించారు. దీనినే మసూద్ తన ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జేషే నెంబర్2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మోలానా అమర్ ఇతరుల కుటుంబ సభ్యులు కూడా ఇక్కడే ఉంటున్నట్లు తెలుస్తోంది. సుమారు 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు సమాచారం.

## అంతుచూస్తాం..

>> కుటుంబంలోని సుమారు 14 మంది చనిపోయారు. వారిలో సోదరి, బావ, మేనల్లుడు వంటి వారితో మొత్తం 10 మంది ఉండగా మరో నలుగురు సహాయకులు కూడా మృతిచెందారని స్వయంగా మసూద్‌ప్రకటించాడు. ఈ క్రమంలోనే ఆతడు విషంకక్కుతూ లేఖ విడుదల చేసాడు. అందులో తానుకూడా చనిపోయి ఉంటే బాగుండేదని మసూద్ అజర్‌ప్రస్తావించాడు. ప్రధాని మోడీ కాశ్మీర్ అంశంలో అన్ని నియమ నిబంధనలు ఉల్లంఘించారని ఆక్రోశించాడు. భారత్‌పై తప్పక ప్రతీకారం తీర్చుకుంటామని తీవ్రస్థాయిలోహెచ్చరికలు చేసాడు. ప్రధానిమోడీపైనా, భారత్‌పైనా ప్రతీకారం తీర్చుకుంటావంటూ లేఖలో హెచ్చరించాడు. భారత్‌పై ఇక ఎంతమాత్రం జాలిచూపించ బోమని బీరాలు పలికాడు.

## ఉగ్రదాడులపై అప్రమత్తం

>> మేరీ బాలికోన్నత పాఠశాలలో ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ప్రత్యేకంగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రమూకల దాడుల నేపథ్యంలో తరగతి గదుల్లో చిక్కుకున్న విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎలా రక్షించాలో, వారు ఎలా వ్యవహరించాలో ప్రదర్శనలు ఇస్తూ అప్రమత్తం చేశాయి. అలారం మోగినప్పుడు ఏ విధంగా స్పందించాలో.. సేఫ్ జోన్ కు ఎలా చేరుకోవాలో తెలిపాయి. రోప్ ల సాయంతో భవనాలపై నుంచి కిందకు ఎలా దిగాలో చేసి చూపించాయి. ఈ క్రమంలో ఎస్.డి.ఆర్.ఎఫ్. ప్రత్యేక వాహనంలో ఉండే పరికరాల వినియోగం, వాటితో ప్రమాదంనుంచి ఎలా తప్పించుకోవచ్చో ఎస్‌డిఆర్‌ఎఫ్. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ ఐజీ రాజకుమారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ ప్రక్రియను దగ్గరుంచి పర్యవేక్షించారు.

# 'ఆపరేషన్ సిందూర్'కు హనుమంతుడే స్ఫూర్తి

### రక్షణమంత్రి రాజ్‌నాథ్

**న్యూఢిల్లీ, మే 7:** ఆపరేషన్ సిందూర్‌లో లంకా దహనం చేసిన హనుమంతుడే తమకు ఆదర్శమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్(పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినందుకు భారత సైన్యాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్‌ఓ) మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన ఆపరేషన్ సిందూర్‌కు ఆర్మీకి పూర్తి స్వేచ్ఛనిచ్చిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో భారత సాయుధ దళాలు అందరినీ గర్వపడేలా చేశాయని రక్షణ మంత్రి అన్నారు. నిన్న రాత్రి భారత సాయుధ దళాలు తమ శౌర్యం, ధైర్యాన్ని ప్రదర్శించి కొత్త చరిత్రను సృష్టించాయన్నారు. భారత సాయుధ దళాలు కచ్చితత్వం, అప్రమత్తతతో వ్యవహరించాయని నిర్దేశించిన లక్ష్యాలను సరైన సమయంలో కచ్చితత్వంతో నాశనం చేశాయన్నారు. అంతేకాకుండా, సైన్యం మానవత్వంతో వ్యవహరించిందని, పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవడంలో భారత సాయుధ దళాలు జాగ్రత్తలు తీసుకున్నాయన్నార. యావత్ దేశం తరపున సైనికులు, అధికారులను అభినందిస్తున్నట్లు చెప్పారు. సాయుధ దళాలకు మద్దతు ఇచ్చినందుకు ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అశోక వనానికి వెళ్ళేటప్పుడు హనుమంతుడు అనుసరించిన సూత్రాన్ని ఈ దాడిలో తాము అనుసరించినట్లు రాజ్‌నాథ్ చెప్పారు. తమ అమాయక ప్రజలను చంపిన వారిని మాత్రమే తాము లక్ష్యంగా చేసుకున్నట్లు రక్షణ మంత్రి అన్నారు. తన గడ్డపై జరిగిన దాడికి ప్రతిస్పందించే హక్కును భారత్‌కు ఉందని రాజ్‌నాథ్ చెప్పారు. ఈసారి కూడా, మునుపటిలాగే తగిన సమాధానం భారత్ ఇచ్చినట్లు వివరించారు. మౌలిక వసతులకు ప్రాధాన్యత సరిహద్దుల్లో మౌలికవసతులు మెరుగు పరిచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

# ప్రధాని, సైన్యానికి అండగా నిలుద్దాం!

### -మంత్రి నారా లోకేష్



**సత్యవేడు, మే 7 ప్రభాతవార్త:** ఈరోజు మనందరం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాం, అయితే మనవద్ద నమో (నరేంద్ర మోడీ) మిసైల్ ఉంది. ప్రధాని మోడీ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు, భారత సైనికులు పాకిస్థాన్ పైకి వెళ్లి స్ట్రయిక్స్ చేస్తున్నారు, ఉగ్రవాదులపై ఆపరేషన్ సింధూర్ పేరిట యుద్ధం ప్రకటించారు, రాష్ట్రమంతా ప్రధాన మంత్రి, భారత సైన్యానికి అండగా నిలబడాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా సత్యవేడులో ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్ మాట్లాడుతూ... మనందరం తొలుత భారతీయులం, మనకోసం సరిహద్దుల్లో యుద్ధం చేస్తున్న సైనికులకు సంఘీభావం తెలపాలని అన్నారు. పాదయాత్రలో మీ అందరికీ హామీ ఇచ్చా, సీనియర్లు, జూనియర్లను సమానంగా గౌరవిస్తా, పనిచేసే వారిని ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చాను, ఎప్పుడు మీ ప్రాంతానికి వచ్చినా మిమ్మల్నే ముందుగా కలుస్తానని చెప్పా. ఇచ్చిన మాట ప్రకారమే ఈరోజు ఉత్తమ కార్యకర్తలను కలిశాను. కార్యకర్తలు పార్టీ నాయకుల చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగాలి. మన పార్టీ కేడర్‌లో ఉన్న మరో జబ్బు పేరు అలక. ఇది మనపార్టీ, పార్టీలో సంస్కరణల కోసం జగన్ కంటే ఎక్కువగా నేను పార్టీలో పోరాడా. ఇది మనపార్టీ, సమస్యలు ఏవైనా ఉంటే మనం మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి. నిర్ణయాలు తీసుకునే క్రమంలో కొన్నిసార్లు సమయం పట్టవచ్చు కానీ, కార్యకర్తల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయం తీసుకోంఅన్నారు.

## ప్రతి ఉద్యోగికి సామర్థ్య శిక్షణ

>> నాటికి రూపొందుతాయని అధికారులు వివరించారు. కీలక పాలసీలైన జీరో పావర్టీ పీ4, పాపులేషన్ మేనేజ్మెంట్ అంశాలను విజన్‌లో పొందుపరుస్తారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు నెలకొల్పేందుకు 143 నియోజకవర్గాల్లో స్థలాలు గుర్తించారు. జీరోపావర్టీ పీ4 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రంలో 15,315 బంగారు కుటుంబాలను 1,118 మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. పీ4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ముఖ్యమంత్రి చైర్మన్‌గా 25 మందితో కూడిన జనరల్ బాడీ... దీనికి అనుబంధంగా ఎగ్జిక్యూటివ్ కమిటీ, ఎంపవర్డ్ టీమ్స్‌తో స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు జనాభా నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ తీసుకురానుందని సిఎం తెలిపారు., జనాభా పెరుగుదలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుంది. మహిళా ఉద్యోగులకు ఇద్దరు పిల్లల వరకు ఇచ్చే ప్రసూతి సెలవుల పరిమితిని ఎత్తివేసింది. అలాగే ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలున్నా స్థానిక సంస్థల్లో పోటీకి అర్హులుగా మినహాయింపు ఇచ్చింది. జనాభా పెరుగుదలకు ఉన్న అవకాశాలు, అడ్డంకులపై ప్రత్యేకంగా సర్వే నిర్వహించి... వాటి ఆధారంగా పాలసీ తీసుకురానుంది.

## ప్రధానికి సెల్యూట్

>> కల్యాణ్ ప్రశంసించారు. పాకిస్తాన్‌పై ప్రధాని మోడీ చర్యలు అభినందనీయమని పవన్ కల్యాణ్ సెల్యూట్ చేశారు. మరోసారి భారతదేశాన్ని తల ఎత్తుకునేలా చేసినందుకు ప్రధానికి పవన్ కల్యాణ్ సెల్యూట్ చేశారు. మరోసారి భారతదేశాన్ని తల ఎత్తుకునేలా ప్రధాని మోడీ చేశారని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు ఆనందంగా ఉందంటూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు. కాశ్మీర్ అనేది దేశంలో భాగం.1990 లో కాశ్మీర్ పండిట్ లను చంపారు. అంత్యక్రియలను చేయడానికి వచ్చిన వారిని చంపారు.సరైన సమయంలో ఆర్మీ సరైన నిర్ణయం తీసుకుందన్నారు.

# టిటిడి, పర్యాటకశాఖల మధ్య భూ బదలాయింపు

### తిరుపతి అర్బన్‌లో 35 ఎకరాలు భూ కేటాయింపు

### ప్రైవేట్ సంస్థలకు భూకేటాయింపులు ఉండవు

### టిటిడి బోర్డు అత్యవసర సమావేశంలో కీలక నిర్ణయం

**తిరుమల, మే 7ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ఏడుకొండలను కాపాడుకోవడంలో భాగంగా కొండక్రిందిభాగంలో ఎక్కడా ఎవరికీ స్థలాలు కేటాయింపులు చేయబోమని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ విషయంగా ఇప్పటికే సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. గత బోర్డులో తిరుపతి అలిపిరి ప్రాంతంలో రాష్ట్రపర్యాటక శాఖకు కేటాయించిన స్థలాలను రద్దుచేసి, వాటిని టిటిడి తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా పరస్పరం భూ బదలాయింపుల్లో తిరుపతి అర్బన్ పరిధిలో 35ఎకరాలు భూములను పర్యాటకశాఖకు కేటాయించేందుకు టిటిడి బోర్డు ఆమోదించింది. ఇందుకు అవసరమైన ప్రక్రియ వేగవంతం చేయాలని ఛైర్మన్ అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఏడు కొండల క్రింద,పరిసరాల్లో ప్రైవేటు సంస్థలకు టిటిడి భూ కేటాయింపులు ఉండ కూడదని తీర్మానం చేశారు. బుధవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. ప్రపంచప్రఖ్యాత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమల పవిత్రతను కాపాడేందుకు టిటిడి బోర్డు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. తదనుగుణంగా ఏడుకొండలకు ఆనుకుని ఉన్న భూములను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించ రాదని నిర్ణయం తీసుకున్నట్లు ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఇప్పటికే తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామంలో సర్వేనంబర్ 604లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక సంస్థకు (ఎపిటిఎ) చెందిన 24.68ఎకరాల భూమిని టిటిడికి బదలాయించాలని గతంలో బోర్డు నిర్ణయం తీసుకుంది. ఆస్థలానికి బదులుగా తిరుపతి అర్బన్‌లో సర్వేనంబర్ 588ఏ లో ఉన్న టిటిడికి చెందిన 24.68ఎకరాల స్థలాన్ని పర్యాటక సంస్థకు బదలాయింపులకు బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే తిరుపతి రూరల్‌లోని సర్వేనంబర్ 604లో పర్యాటకసంస్థకు చెందిన మరో 10.32 ఎకరాల స్థలాన్ని టిటిడికి బదలాయించడం, దానికి బదులుగా తిరుపతి అర్బన్‌లో సర్వేనంబర్ 588ఏ లో టిటిడికి చెందిన 10.32 ఎకరాల స్థలాన్ని పర్యాటకసంస్థకు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది.

## వారం - వర్జ్యం

తేది : 08-05-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
ఏకాదశి మ.12.31
ఉత్తరఫల్గుణి రా.9.07
వర్జ్యం ఉ.6.35 - ఉ.8.23
దు.మ.3.04-3.55
శుభసమయం: ఉ..5.15-5.55
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. వాహనాలు, గృహం కొనుగోలు చేస్తారు.

**వృషభం :** వ్యాపారాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. ఉద్యోగాలలో హోదాలు, పదోన్నతులు పొందుతారు.

**మిథునం:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది.

**కర్కాటకం :** సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**సింహం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కన్య :** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకొంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**తుల :** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో కొంత సామాన్యంగా ఉంటాయి. వస్తులాభం.

**వృశ్చికం:** ఉద్యోగాలలో సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. కొత్త మిత్రులు పరిచయమై సాయం అందిస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**మకరం:** కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. వాహన సౌఖ్యం.

**కుంభం:** వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మీనం:** పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వాహన యోగం. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'సుప్రీం'లో చుక్కెదురు

>> నిర్ణయాన్ని తాజాగా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అనంతపురం జిల్లా ఓబుళాపురం మైనింగ్ కేసులో మంగళవారం హైదరాబాద్ లోని సిబిఐ కోర్టు తుది తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులకు సిబిఐ కోర్టు శిక్ష విధించింది. ప్రధాన నిందితులైన గాలి జనార్ధనరెడ్డితో పాటు బివి శ్రీనివాసరెడ్డి, విడి రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల చొప్పున జరిమానా విధించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన విడి రాజగోపాల్‌కు అవినీతి నిరోధక చట్టం కింద అదనంగా మరో 4 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది.
నిందితులు జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 6 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు పేర్కొంది. ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్‌కు 2 లక్షల రూపాయల జరిమానా విధించింది. వేర్వేరు సెక్షన్ల కింద వేర్వేరుగా ఏడు సంవత్సరాలు శిక్షలు పడినప్పటికీ ఏకకాలంలో వీటిని అనుభవించాలని తీర్పులో తెలిపింది. ఇప్పటికే జైలులో అనుభవించిన శిక్ష సమయాన్ని మినహాయింపునిచ్చింది. ఇది ఇలా ఉండగా ఇదే కేసులో 2004-09 మధ్య గనులశాఖ మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషిగా తేల్చుతూ కోర్టు తీర్పు ఇచ్చింది. సబితతో పాటు విశ్రాంత ఐఎఎస్ కృపానందంను నిర్దోషిగా సిబిఐ కోర్టు తేల్చింది. కేసు విచారణ దశలోనే ఏ5గా ఉన్న లింగారెడ్డి మృతి చెందారు. అదేవిధంగా ఏ6గా ఉన్న శ్రీలక్ష్మిని 2022లో తెలంగాణ హైకోర్టు ఈ కేసునుంచి డిశ్చార్జి చేసింది. తాజాగా డిశ్చార్జ్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ, మరోసారి విచారణ జరపాలంటూ దిగువ కోర్టుకు ఆదేశించింది.

## రాష్ట్రంలో మరో రెండు రోజులు వర్షాలు

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో బుధవారం పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసాయి.మరో వైపు పలు ప్రాంతాల్లో సగటు ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల వరకు నమోదయ్యాయి.భిన్న వాతావరణ పరిస్థితుల్లో గురువారం రాష్ట్రంలో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు 40-50కిమీ వేగంతో ఈదురుగాలులు.. వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. మరోవైపు రేపు గరిష్ట ఉష్ణోగ్రతలు $40-42^0$ మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని, ..శుక్రవారం నుంచి ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగే అవకాశం.. ఉందని తెలిపారు. శుక్రవారం15 మండలాల్లో తీవ్ర వడగాలులు, 28 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల నాటికి అంబేద్కర్ కోనసీమ జిల్లా మధ్యకొంపలులో 86మిమీ, రామచంద్రపురంలో 73.5మిమీ, కొత్తపేటలో 64.5మిమీ, శ్రీకాకుళం జిల్లా నివగాంలో 52మిమీ, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 48.7మిమీ, కాకినాడ జిల్లా పెద్దాపురంలో 44 మిమీ, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలో 42.5మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు. బుధవారం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురంలో 40.7 ది, నంద్యాల జిల్లా గుల్లదుర్తి, కర్నూలు జిల్లా నేమకల్లులో 40.6 ది, పల్నాడు జిల్లా కాకానిలో 40.2 ది చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. ఈదురుగాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదన్నారు.

## శ్రీహరికోట తీరప్రాంతం చుట్టూ రక్షణ కవచం

**శ్రీహరికోట (తడ), మే 7 ప్రభాతవార్త :** ఇండియా, పాకిస్థాన్ మధ్య యుద్ధమేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోటకు రక్షణ పెంచారు. ఇందుకు సంబంధించి తిరుపతి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సిఐఎస్ఎఫ్ అధికారులతో సమావేశమయ్యారు. మరోవైపు షార్ తీరప్రాంత రక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సముద్ర తీరంలో నిఘా పెంచి కాపు కాస్తున్నారు. షార్ లోపలికి అపరిచిత వ్యక్తులు ప్రవేశించకుండా నిఘా పెంచారు. ఇదిలావుంటే ఈ నెల 18న శ్రీహరికోట నుంచి కీలకమైన రీశాట్ ఉపగ్రహం ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కారణంగా కూడా శ్రీహరికోటలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

## కృష్ణాజిల్లాలోని సముద్ర తీరంలో హై అలర్ట్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణాజిల్లాలోని సముద్ర తీరంలో హై అలర్ట్ చేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.పాక్ భారత్ మధ్య పరస్పర దాడుల నేపథ్యంలో కేంద్రం హై అలర్ట్ ప్రకటించింది. సముద్ర మార్గం గుండా ఉగ్రవాదులు జిల్లాలోకి రాకుండా బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జిల్లాలో 110 కిలో మీటర్ల సముద్ర తీరం ఉంది. జిల్లా పరిధిలో మూడు మెరైన్ పోలీస్ స్టేషన్లు. పాలకాయతిప్ప (కోడూరు మండలం), గిలకలదిండి (మచిలీపట్నం), ఒర్లగొందితిప్ప (కృత్తివెన్ను మండలం) మెరైన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 150 మంది సిబ్బంది ఉన్నారు. ప్రతి సముద్ర తీర గ్రామంలో మెరైన్ పోలీసులతో పాటు రెండు డ్రోన్ కెమెరాలతో పహారా కాస్తున్నారు. తీర గ్రామాల ప్రజలను మెరైన్ పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. మచిలీపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వినియోగంలో లేని మెరైన్ బోట్లును సంసిద్ధం చేస్తున్నారు.

08-05Pg3exHMNWJQETCLP.qxd:08-05Pg3exHMNWJQETCLP.qxd 1/1/02 6:54 AM Page 1



# వైద్య విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

## ఎపిఎంసి ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు



**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ పట్టాలతో వైద్య వృత్తిలో ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలిదగ్గుమాటి శ్రీహరిరావు అన్నారు. మూడు దశాబ్దాలుగా వైద్య వృత్తిలో సేవలు అందిస్తున్నాను. అందుకు ప్రతిగా ప్రభుత్వం నాకు ఏపీఎంసీ ఛైర్మన్ గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్యఆరోగ్య శాఖామాత్యులు సత్యకుమార్ యాదవ్ లకు ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీఎంసీ ఛైర్మన్ గా డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు బుధవారం డాక్టర్ ఎన్టీయార్ వైద్య విశ్వ విద్యాలయం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు మాట్లాడుతూ వైద్యులకు, రోగులకు మధ్య వారధిలా పనిచేస్తానని, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళతానని తెలిపారు. రెగ్యులేటరీ అథారిటీగా మెడికల్ కౌన్సిల్ ఉంటుందన్నారు. హ్యూమన్ రైట్స్, మహిళా కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలపై తక్షణమే స్పందిస్తామని హామి ఇచ్చారు. వారు ఫిర్యాదు చేసిన వారిపై ముందుగా హెచ్చరికలు చేస్తామని, అయినా తీరుమార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన వారు మన రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు.

అయితే ఇతర రాష్ట్రాల్లో కొన్ని వెసులుబాట్లు కల్పించారని, మన రాష్ట్రంలో కూడా ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. అలాగే 70 సంవత్సరాలు దాటిన వైద్యులకు క్రెడిట్ అవర్స్ లో సడలింపులు ఉండేలా నిబంధనలు సడలించనున్నామన్నారు.

రిజిస్ట్రేషన్లు ఇకపై ఆన్ లైన్ విధానంలో స్లాట్ బుకింగ్ పద్దతిలో కొనసాగించనున్నామన్నారు.

# ఉగ్రవాదాన్ని నిరంతరం క్రియాశీలకంగా ఎదుర్కోవాలి



# అల్లూరి మనకు ఆదర్శం

## అల్లూరి చిత్రపటానికి సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ సమగ్రతను దెబ్బకొట్టాలనుకునే ఉగ్రవాదాన్ని నిరంతరం క్రియాశీలకంగా ఎదుర్కోవాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు.మన జాతి ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడు ఎంతటి త్యాగానికైనా ఉప క్రమించాలన్నారు.స్వాతంత్ర్యం కోసం,మన్యం జనం మాన ప్రాణాల పరిరక్షణకు అమరజీవి అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగం మరువలేనిదన్నారు.బుధవారం తన వ్యక్తిగత కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపూలమాల వేసి నివాళులర్పించారు.దేశం కంటే ఏదీ ముఖ్యం కాదన్నారు.దేశ సమగ్రత భద్రతకు మనం అంతా సంఘటితంగా నిలవాలన్నారు.భారత్ అన్ని విధాలుగా అఖండ శక్తిగా అవతరించిందన్నారు.ఈ శక్తి ఎదుర్కోవడం ఎవ్వరి వలన కాదన్నారు.పాకిస్తాన్ మన సహనానికి పరీక్షపెట్టిందన్నారు.ప్రధాని నరేంద్రమోడీ ఆలోచనకు అనుగుణంగా ఆపరేషన్ సింధూర విజయవంతం కావడం హర్షణీయమన్నారు.దేశ సమగ్రత పరిరక్షణలో ప్రధానికి తామంతా అండగా ఉంటామన్నారు.

# అకాల వర్షాలకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలో భారీ నష్టం

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** అకాల వర్షాలకు ఏపీలో ఎన్టీఆర్,కృష్ణా జిల్లాలు వణికాయి.అనుహ్యంగా మాగాణి,వాణిజ్య,ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి.ఈ వానలు ఈ ప్రాంత రైతాంగానికి ఆశనిపాతం లాంటివి.పిడుగులు, భీకర గాలులతో భారీ చెట్లు, విద్యుత్తు స్తంభాలు, రేకుల షెడ్లు, బోర్డులు విరిగిపడ్డాయి. గెలల మీద ఉన్న అరటి, అరకొరగా మిగిలిన మామిడి, కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, వరి పంటలు నేలపాలయ్యాయి. ఆరబోసుకున్న వరి, మొక్కజొన్న, పసుపు తడసిపోయాయి. ఆయిల్‌పామ్,మామిడి,డ్రాగన్ ఫ్రూట్స్,జామ తోటలు దెబ్బతిన్నాయి.గత రాత్రి వర్షం బీభత్సాన్ని ఎన్టీఆర్,కృష్ణా జిల్లాలు చవి చూసాయి. విజయవాడతో పాటు తిరువూరు, చందర్లపాడు, గంపలగూడెం, ఎ.కొండూరు తదితర మండలాల్లో ఈదురుగాలులు, పిడుగులతో వాన కురిసింది. విద్యుత్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పొలాల్లో పిడుగులు పడి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రోడ్లకు అడ్డంగా చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడడంతో ట్రాఫిక్, విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. పాకలు, రేకుల షెడ్లలో ఉండే ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఎ.కొండూరు మండలం గోపాలపురంలో ఈదురుగాలలకు ఇబ్రహీంపట్నంజగదల్పూర్ జాతీయ రహదారిపై భారీ వృక్షం విరిగిపడడంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. చందర్లపాడు మండలం తోటరావులపాడులోని ఓ ఆలయంలో ధ్వజ స్తంభం విరిగిపడింది. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం ఈలప్రోలు గ్రామంలోని కొత్తూరు మస్తానరావు పొలాల్లో మంగళవారం రాత్రి పిడుగు పడి ఓ తాటి చెట్టు దగ్ధమైంది. ఆ సమయంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. పరిసరాల్లో గడ్డివాములు ఉండటంతో రైతులు ఆందోళన చెందారు. అయితే వాటికి ఎటువంటి మంటలు వ్యాపించకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. ఈ క్రమంలో మంటలు ఉవ్వెత్తున లేచి పడటాన్ని స్థానికులు తమ చరవాణుల్లో చిత్రీకరించి వైరల్ చేశారు.

భారీ గాలులకు ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లచందర్లపాడు, చందర్లపాడు కొడవటికల్లు గ్రామాల మధ్య రహదారిపై భారీ చెట్లు విరిగి పడిపోయాయి. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లటంతో వారు సకాలంలో స్పందించారు. ప్రొక్లెయిన్‌తో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించారు. తోటరావులపాడులోని విఘ్నేశ్వరాలయంలో ధ్వజస్తంభం నేలవాలింది. కొద్దిపాటి వర్షం కురవడంతో పొలాల్లో ఆరబోసిన మిర్చి, పసుపుకొమ్ములు, మొక్కజొన్నలు తడవకుండా కాపాడుకోవడానికి అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు.

# న్యాయస్థానం మాట వినకపోతే జైలుకు వెళ్లాలి

## - గుంటూరులో పేదల గుడిసెలు కూల్చేసిన కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు
## - డిప్యూటీ కలెక్టర్ తాతా మోహనరావుపై ఆగ్రహం

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా గుంటూరు జిల్లా లోని అడవితక్కెళ్ళపాడు గ్రామంలో గుడిసెలు కూల్చివేసిన కేసులో కోర్టు ధిక ్కరణ కేసు ఎదుర్కొంటున్న ప్రస్తుత డిప్యూటీ కలెక్టర్ తాతా మోహనరావుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు విధించిన రెండు నెలల జైలు శిక్షకు బదులు స్థాయి తగ్గించుకొని తహసీల్దార్‌గా పనిచేయడానికి అండర్‌టేకింగ్ ఇవ్వాలని ధర్మాసనం చేసిన సూచనకు మొగ్గు చూపకపోవడం పట్ల జస్టిస్ బిఆర్ గవాయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మోహనరావు దాఖలు చేసిన ఎస్ఎల్‌పీపై నిన్న జస్టిస్ ఏజీ మసీహ్‌తో కలిసి విచారించిన ఆయన...పిటీషనర్ తమ మాట వినకపోతే శిక్షించకుండా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. తహసీల్దార్ స్థాయిలో పనిచేయడానికి అంగీకరిస్తూ అండర్‌టేకింగ్ లెటర్ సమర్పించాలన్న కోర్టు సూచనను పరిగణనలోకి తీసుకోకపోవడం, కోర్టు ఉత్తర్వుల పట్ల ఆయన వైఖరిని స్పష్టం చేస్తోంది. మేం ఆయన కెరీర్‌ను కాపాడాలనుకున్నాం. ఆయన దాన్ని తిరస్కరిస్తే మేమేం చేయలేం. దీన్ని బట్టి ఇదివరకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు విషయంలో ఆయన ఎలా వ్యవహరించి ఉంటారో స్పష్టమవుతోంది.

అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.తమపై ఉదారత చూపాలని పిర్యాది సుప్రీంకోర్టుకు విన్నవించారు.దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ మీరు 80 మంది పోలీసులను తీసుకెళ్ళి ఇళ్ళను కూల్చినపుడు దేవుడు గుర్తుకురాలేదా? ఇప్పటికైనా మీ పిల్లల గురించి ఆలోచించుకోండి. జైలుకెళ్ళకుండా మిమ్మల్ని రక్షించడానికి ప్రయత్నిస్తున్నాం. ఒకవేళ వెళ్ళాలనుకుంటే వెళ్ళి రెండు నెలలు అక్కడ ఉండండి. అప్పుడు మీ ఉద్యోగం కూడ పోతుంది. మీరు ఒక అడుగు తగ్గి(తహసీల్దార్ పోస్టులో)పనిచేయడానికి సిద్ధమైతే చెప్పండి.

ఇదే మీకిస్తున్న చివరి అవకాశం.ఇందులో శిక్ష నుండి తప్పించుకోలేరు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు గుడిసెల జోలికి వెళ్ళొద్దని హైకోర్టు చెప్పాక కూడ ఇలా చేయడం ఏ మాత్రం సమంజసం కాదు. ఎంతటివారైనా చట్టం కంటే గొప్ప కాదు. హైకోర్టు ఉత్తర్వుల పట్ల ఇలా ధిక్కారపూర్వకంగా వ్యవహరించినందుకు మిమ్మల్ని శిక్షించకుండా వదిలిపెట్టం అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు.

# అల్లూరి సీతారామరాజు పోరాట చరిత్రను భావి తరాలకు తెలియచెప్పాలి :పవన్ కళ్యాణ్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట చరిత్రను భావి తరాలకు తెలియచెప్పాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.ఆ మేరకు ఆయన తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు.మన చుట్టూ ఉన్న సమాజంలో నిరుపేదలు, అణగారిన వర్గాలు, పీడిత జనంపట్ల ఎంత బాధ్యతగా నిలిచి అండగా ఉండాలో ̒మన్యం వీరుడు̓ అల్లూరి సీతారామరాజు గారి జీవితాన్ని గురించి తెలుసుకొంటే అర్థం అవుతుంది. తాను విశ్వసించిన పంథాలో బ్రిటిష్ పాలకులపై సాయుధ పోరాటం చేసిన ఆ వీరుడి వర్ధంతి నేడు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు గారికి హృదయపూర్వకంగా అంజలి ఘటిస్తున్నాను. మన్యంలోని గిరిజనులలో చైతన్యం నింపి, అన్యాయాలను ఎదిరించే ధైర్యాన్ని ఇచ్చిన యోధుడాయన. నేను మన్యం ప్రాంతంలో పర్యటనలకు వెళ్ళిన ప్రతి సందర్భంలో అల్లూరి సీతారామరాజు గారు గురించి వివరించే పోరాట గాథలు స్ఫూరణకు వస్తాయి. మన్యం వీరుడి పోరాట పటిమను, అందుకుగల నేపథ్యాన్ని, ఆ చరిత్రను భావి తరాలకు తెలియయాలన్నారు.

# ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలపై దాడి అనివార్య చర్య

## - పార్టీ ముఖ్య నాయకులతో మాజీ సిఎం వైఎస్ జగన్



**విజయవాడ,మే7,ప్రభాత వార్తప్రతి నిధి:**ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలపై దాడి అనివార్య చర్యఅని మాజీ సీఎం వైయస్ జగన్ అన్నారు.వైకాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో మాజీ సీఎం వైయస్ జగన్ వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటు నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లతో సమావేశమైన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ సమావేశానికి ముందు పార్టీ ముఖ్యనేతలతో శ్రీ వైయస్ జగన్ కాసేపు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావించిన శ్రీ వైయస్ జగన్ ఏమన్నారంటే.. భారత్‌లో రక్తపాతం సృష్టిస్తున్న ఉగ్రవాదుల, వారి శిబిరాలు, స్థావరాలపై చర్యలు అనివార్యం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్రవాదుల దాడుల నుంచి తన పౌరులను రక్షించుకోడం అన్నది దేశానికి అత్యంత ముఖ్యమైన కర్తవ్యం. కశ్మీర్‌లోని పహల్గావ్‌లో ఉన్న బైసరన్ వ్యాలీకి పర్యాటకులుగా వెళ్లిన అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడి మానవత్వంపై జరిగిన దాడి. అలాంటి ఉగ్ర చర్యలపై భారత రక్షణ దళాలు గట్టిగా స్పందించాయి. ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య. భారత రక్షణ బలగాలకు యావత్‌దేశం అండగా నిలుస్తుంది. దేశ పౌరుల భద్రత ధ్యేయంగా రక్షణ బలగాలు తీసుకుంటున్న చర్యలకు దేశమంతా మద్దతుగా నిలుస్తోంది.

# ఆపరేషన్ సింధూర హర్షణీయం

## - పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



**విజయవాడ,మే 7,ప్రభాతవార్తప్రతినిధి:** పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో ప్రతి దాడులు చేయడం హర్షణీయమని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. ఇది దేశానికి గర్వకారణమని పేర్కొంటూ.. భారత సైన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ̒జై హింద్.. జై భారత్̓ అంటూ షర్మిలా రెడ్డి 'ఎక్స్'' వేదికగా పోస్టు చేశారు.ఈ సమయంలో భారతీయులంతా సంఘటితంగా ఉండాలన్నారు.కలిసి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇక పోరాటం ఇప్పుడే ప్రారంభమైందంటూ దక్షిణాది నటుడు రజనీకాంత్ ట్వీట్ చేసారు. పాకిస్తాన్‌పై పోరాటం ఇప్పుడే ప్రారంభమైందని లక్ష్యం పూర్తయ్యేవరకూ ఆగదని తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ పేర్కొన్నారు. దేశం మొత్తం మీతోనే ఉందని.. జైహింద్ అంటూ రజనీకాంత్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. అలాగే జై హింద్ కీ సేనా.. భారత్ మాతాకీ జై.. అంటూ రితేశ్ దేశ్‌ముఖ్ ట్వీట్ చేశారు. కాగా న్యాయం జరిగిందని, భారత్ మాతా కీ జై అంటూ సినీ నటి ఖుష్బూ ట్వీట్ చేశారు.

# సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు నోటిఫికేషన్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** డిఎంఇ పరిధిలోని ఆసుపత్రుల సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 128 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు వాకిన్ రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ సూర్యకఈనెల 16న ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓల్డ్ జిజిహెచ్ క్యాంపస్, హనుమాన్ పేట, విజయవాడ డిఎంఇ కార్యాలయంలో వాకిన్ రిక్రూట్మెంట్‌డైరెక్ట్ రిక్రూట్మెంట్ మరియు లేటరల్ ఎంట్రీ ద్వారా పోస్టుల భర్తీ సి.టి సర్జరీలో 13, కార్డియాలజీలో 15, ఎండోక్రినాలజీలో 4, మెడికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజీలో 6, మెడికల్ అంకాలజీలో 15, నియోనేటాలజీలో 1, నెఫ్రాలజీలో 17, న్యూరో సర్జరీలో 19, న్యూరాలజీలో 11, పెడియాట్రిక్ సర్జరీలో 3, ప్లాస్టిక్ సర్జరీలో 3, సర్జికల్ అంకాలజీలో 12, యురాలజీలో 8, వాస్క్యులర్ సర్జరీలో 1 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు వాకిన్ రిక్రూట్మెంట్ జరుగుతుంది.

# చంద్రబాబు ఆదేశం.. పిడుగుపాటు బాధితులకు సత్వర సాయం

## - యుద్ధప్రాతిపదికన 9 మందికి రూ.4లక్షల చొప్పున విడుదల

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులు,పిడుగుపాటుతో మరణించిన వారి కుటుంబాలకు తక్షణమే సాయం అందించాలన్న సిఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టింది. తిరుపతి,శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు,ప్రకాశం,బాటప్ల జిల్లాల్లో పిడుగుపాటుతో చనిపోయిన 9 మంఆదికి సంబంధించి వారి కుటుంబాలకు,ఒక్కొక్కరికి రూ.4లక్షల చొప్పున పరిహారాన్ని విపత్తుల నిర్వహణశాఖ మంగళవారం విడుదల చేసింది. వీరిలో ఏడుగురి కుటుంబాలకు వెంటనే చెక్కులు పంపిణీ చేశారు. బాపట్ల జిల్లాలో రెండు కుటుంబాలకు బుధవారం గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి చేతుల మీదుగా అందించనున్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పెట్టుబడి సాయం పంపిణీలో కొంత జాప్యం జరుగనుంది. పంట నష్టం గణనపై తక్షణమే ఆదేశాలు ఇచ్చినా...నిబంధనల ప్రకారం నష్టాన్ని లెక్కించేందుకు కనీసం పది రోజులైనా కావాలని వ్యవసాయశాఖ పేర్కొంటోంది. గతంలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలంటే కనీసం 20 రోజులు పట్టేదని...ఇప్పుడు ఇంకా ముందే పూర్తి చేసామన్నారు.

# ఉగ్రవాదం అంతమే అంతిమ లక్ష్యం : మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** అందమైన ప్రదేశాలను చూసి ఆస్వాదించేందుకు, ఆహ్లాదమైన వాతావరణంలో గడిపేందుకు వెళ్లిన అమాయకులైన పర్యాటకులను అన్యాయంగా పొట్టనపెట్టుకున్న ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్యే "ఆపరేషన్ సిందూర్" అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.. పహల్గామ్ దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. భారత సాయుధ బలగాలు ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడి చేసి గట్టి సమాధానమిచ్చాయని, తీవ్రవాదంపై భారత ఉక్కు సంకల్పానికి ఇది ఒక నిదర్శనం అని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి వందనం అని పేర్కొన్నారు. కశ్మీర్ లోని అనంత్ నాగ్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయలో ఉగ్రమూకల విచక్షణ రహిత కాల్పులతో పహల్గాంలో అన్యాయంగా ఎంతో మంది భారతీయ స్త్రీల నుదటన సింధూరం లేకుండా చేసిన బాధిత పర్యాటకుల ఆత్మలకు ఈ దాడితో శాంతి చేకూరుతుందని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ దాడి పర్యాటకులపై కాదు, భారత్ పై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు.. అమాయకులైన పర్యాటకులను బలిగొన్న ఘటన హృదయ విదారకమైనదని, దేశ సమగ్రతకు, ఐక్యతకు చిచ్చుపెట్టాలని చూస్తే సహించబోమని తెలిపారు. చేసిన పాపానికి పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు..యావత్ భారత దేశం ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించాల్సిన సమయం ఇదని... భారత సైన్యానికి అండగా నిలవాల్సిన తరుణమని పిలుపు నిచ్చారు... భారతదేశ ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నంచేయలేదని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు.. అందరూ ఏకతాటిపై నిలిచి ఉగ్రవాదాన్ని తిప్పికొట్టాలని, సార్వభౌమత్వాన్ని కాపాడుకుందాం.. ఉగ్రవాదుల దాడుల నుంచి దేశ పౌరులను రక్షించుకుందామన్నారు.

# హాజ్ అవకాశం దేవుడిచ్చిన వరం

## మౌలానా ఇలియాస్ సాహెబ్

**శ్రీకాళహస్తి,మే 7 ప్రభాత వార్త** ముస్లింలు ఆచరించే ఐదు సూత్రాల్లో హాజ్ ఒకటని ఇది దేవుడిచ్చిన అవకాశం అని హాజ్‌యాత్ర చేసిన వారు పునీతులని ఆంధ్ర ప్రదేశ్ హాజ్ కమిటి సభ్యులు మౌలానా ఇలియాస్ సాహెబ్ అన్నారు. బుధవారం తిరుపతి జిల్లా నుంచి ఈ ఏడాది హాజ్‌కు వెళ్ళు వారికి ఇలియాస్ సాహెబ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ ఏడాది తిరుపతి జిల్లా నుంచి సుమారు 60 మంది హాజ్‌యాత్రకు వెళుతున్నారు. 40 రోజుల పాటు సాగే ఈ హాజ్ యాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆర్థిక స్థోమత కల్గిన ప్రతి ఒక్కరు బక్రీద్ మాసంలో హాజ్ నిర్వహించాలని మానవుడు ఆచరించాల్సిన ఐదు సూత్రాల్లో ఒకటని వివరించారు. దేశంలో ఎంతో మంది లక్షాదికారులు,కోటీశ్వరులు ముస్లింలు ఉన్నారని కానీ అందకి హాజ్ చేసే అవకాశం లేదన్నారు అల్లాహ్ కరుణ ఎవరికి ఉంటుందో వారికే అవకాశం దక్కుతుందన్నారు. ఎవరైతే హాజ్ చేస్తారో వారు 'పునీతులని' వివరించారు.



హాజ్ యాత్రకు వెళ్ళు వారితో రాష్ట్ర హాజ్‌కమిటి సభ్యులు మౌలానా ఇలియాస్ సాహెబ్

40రోజుల పాటు దేవుని మార్గంలో: ప్రపంచ నలుమూలల నుంచి లక్షలాది మంది ముస్లింలు హాజ్‌యాత్రకు మక్కా,మదీనాలకు వెళతారని 40 రోజుల పాటు తమ కుటుంబాలను, తమ ప్రాంతాలను వదలి ఖానే కాబా,మస్‌జిద్‌ఏ నబవ్విలో గడపటం జరుగుతుందన్నారు. అక్కడ నిత్యం అల్లాహ్ ఆరాధనలో గడపటంతో తాము గతంలో చేసిన పాపాల నివృత్తికి అవకాశం ఉంటుందన్నారు.ఇతర వ్యాపకాలు లేకుండా అల్లాహ్ ఆరాధనలో గడపటంతో మనలో ఏకాగ్రత శక్తి పెరుగుతుందన్నారు. హాజ్ చేసినత రువాత ఆచరించాల్సిన నియమనిబంధనలను మౌలానా ఇలియాస్ సాహెబ్ వివరించారు. అబద్ధమాడకూడదు,ఐదువేళల్లో జమాత్‌తో క్రమం తప్పకుండా నమాజు ఆచరించటం, పరనిందను మానటం,పరోపకారానికి అవకాశం ఇవ్వటం బందువుల పట్ల దయాహృదయంతో వ్యవహారించటం నిత్యం మరణం అన్వేషణలో సత్యమార్గాన్ని నడవటం అనే అంశాలను ఆచరించాలని ఇలియాస్ సాహెబ్ వివరించారు. హాజ్ చేసిన వారిని పవిత్రులుగా భావిస్తారని వారిని 'హాజీలని' పిలుస్తారని ఇలియాస్‌సాహెబ్ వివరించారు.ఈ ఏడాది హాజ్ యాత్రకు శ్రీకాళహస్తి నుంచి తొమ్మిది మంది, నాయుడుపేట నుంచి ఐదుగురు,వెరసి తిరుపతి జిల్లా నుంచి 60 మంది వెళుతున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,కర్నాటకల నుంచి హాజ్ యాత్రకు వెళుతున్నారు.

# ఎక్స్ సర్వీస్‌మెన్‌ల భూమిని నిషేధిత భూముల జాబితాలో కొనసాగించడం సబబు కాదు

# హైకోర్టు కీలక తీర్పు

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:**ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ప్రభుత్వం ఇచ్చే అసైన్‌మెంట్ భూమిపై ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.వారికి కేటాయించిన ఎక్స్ సర్వీస్‌మెన్ క్రయ విక్రయాలు చేసేందుకు రూల్స్ అనుమతిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం ఆ భూమిని నిషేధిత భూముల జాబితా (22ఏ)లో కొనసాగించడం సబబు కాదని హైకోర్టు తీర్పు చెప్పింది.తీర్పు వివరాలు బుధవారం న్యాయవాదుల సమాచార పత్రం ద్వారా అందుబాటులోకి వచ్చాయి. నిషేధిత భూముల జాబితా నుంచి తన భూమిని తొలగించాలన్న పిటిషనర్ అభ్యర్థనను తిరుపతి జిల్లా కలెక్టర్ తిరస్కరించడాన్ని ఆక్షేపించింది. కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేసింది. పిటిషనర్ భూమిని నిషేధిత భూముల జాబితా నుంచి తక్షణమే తొలగించాలంటూ జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ తీర్పు వెలువరించారు. ఎక్స్ సర్వీసెమెన్ కోటా కింద అసైన్మెంట్ కింద ఇచ్చిన భూమిని పదేళ్ల తర్వాత అమ్మేందుకు 1993లో జిఓ 1117 జారీ చేసిందని తెలిపారు. పిటిషనర్‌కు సంబంధించిన వ్యవహారంలో తహశీల్దార్ రిపోర్టు, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సర్క్యులర్‌ను కలెక్టర్ పట్టించుకోలేదని తప్పుపట్టారు. దేశం కోసం సేవలు అందించిన మాజీ సైనికులకు పదేళ్ల తర్వాత భూమిని అమ్ముకునే హక్కు ఉందన్నారు. తమ్మిశెట్టి బోదయ్య మద్రాసు రెజిమెంట్లో 15 ఏళ్లు పనిచేశారు. 1994లో అప్పటి నెల్లూరు జిల్లా, దొరవారిసత్రం మండలం, పూలతోట గ్రామంలో 3.5 ఎకరాల భూమిని ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద బోదయ్యకు ఇచ్చారు.

# ఆపరేషన్ సిందూర్ పై తప్పుడు ప్రచారం జరకుండా చూడాలి

## అధికారుల సమావేశంలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర్ అనంతర సివిల్ డిఫెన్స్ కార్యాచరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. సమీక్షకు సిఎస్, డీజీపీలతో పాటు టూరిజం, ఎండోమెంట్, డిజాస్టర్ మేనేజ్మెంట్, హెల్త్, ఆర్ అండ్ బి తో పాటు పలు శాఖల అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రైల్వే, ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, సిఐఎస్ఎఫ్ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.̒ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తీసుకుంటున్న భద్రతా చర్యలు, సన్నద్ధతపైనా... అలాగే మాక్ డ్రిల్స్ నిర్వహణ, ప్రస్తుత పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించడంపైనా చర్చించారు. ఊహించని ఘటనలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలను అప్రమత్తం చేయడం వంటి అంశాలపై మాట్లాడారు. ఈ సమీక్షలో ఆయా విభాగాలు తమ సన్నద్ధతను సమావేశంలో వివరించాయి. అనంతరం సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ̒ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అన్ని స్థాయిల్లో అధికారులు, సంస్థలు సిద్ధంగా ఉండాలి. కేంద్రం సైతం రాష్ట్ర ప్రభుత్వాల సన్నద్ధతపై పలు సూచనలు చేసింది. వాటిని పూర్తిగా అమలు చేయాలి. ఇలాంటి సమయంలో అన్ని శాఖలు అత్యంత సమన్వయంతో పనిచేయాలి. ప్రజలు ఆందోళన చెందకుండా చూడాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. ఇలాంటి సమయంలో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా చూడాలి. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే... అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. తీర ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. టీటీడీ వంటి చోట్ల ప్రత్యేక రక్షణ చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలి. 24 గంటలు అన్ని శాఖల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాల్ని అని సిఎం సూచించారు.



# ఐపిఎస్ అధికారి ఎబివెంకటేశ్వరరావుకు హైకోర్టులో ఊరట

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** విశ్రాంత సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టులో ఊరట లభించింది. నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో ఆయనపై ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసుతో పాటు ఛార్జిషీట్‌ను కొట్టివేసింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో దేశ, రాష్ట్ర భద్రతా వ్యవహారాల్లో నిబంధనల్ని అతిక్రమించారంటూ నిఘా విభాగం డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన ఏబీవీ వెంకటేశ్వరావుపై అభియోగాలు మోపింది. జాతీయ, రాష్ట్ర భద్రతకు ముప్పు కలిగించేలా ఓ విదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థకు పోలీసు సెక్యూరిటీ ప్రోటోకాల్ వ్యవస్థ వివరాలను అప్పగించారని పేర్కొంది.

# ఆపరేషన్ సింధూర హర్షణీయం - హోం మంత్రి అనిత

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** భారత సైన్యం పాకిస్తాన్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంపై హోంమంత్రి వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. " ఎక్స్" వేదికగా అనిత ఒక పోస్టులో ఆపరేషన్ సిందూర్ భారత దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని ప్రపంచ పటముపై మరోసారి నిలిపిందని కొనియాడారు. పహల్గామ్ దాడికి భారతదేశం సాహసోపేతంగా తగిన ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఉగ్రవాదానికి శాశ్వతంగా ముగింపు వచ్చే వరకు భారతదేశం తన ఆపరేషన్‌లను కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. పాకిస్తాన్ ఇకనైనా చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం నిలిపివేయాలని, దేశ రక్షణలో ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న కట్టుదిట్టమైన విధానం అభినందనీయమని వంగలపూడి అనిత అన్నారు.

## మన్యంలో ఎన్‌కౌంటర్, ఇద్దరు మావోయిస్టులు మృతి

### - రెండు తుపాకులు స్వాధీనం

**పాడేరుచ్రింతూరు,మే7, ప్రభాతవార్త** పాడేరు, అల్లూరి జిల్లా పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగటంతో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్టు తెలుస్తోంది. ఈ ఎన్ క్నౌటర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఏజెన్సీలో కొనసాగుతున్న కూంబింగ్ మావోయిస్టు కీలక నేత జగన్ అలియాస్ పండన్న మృతి మావోయిస్టు జగన్‌పై రూ.20 లక్షల రివార్డ్ మరో మావోయిస్టు రమేష్ మృతీ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎన్కౌంటర్ జరిగిన ప్రదేశానికి పోలీస్ బలగాలు తప్పా ఎవరు వెళ్ళలేని పరిస్థితి ఏ ప్రదేశంలో యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. ఎన్కౌంటర్‌లో మృతి చెందిన ఇద్దరా..? లేదా ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది గురువారం పోలీస్ లు వెల్లడించాల్చి ఉంది.

# దేశాన్ని కాలుష్య రహితంగా తీర్చి దిద్దడమే లక్ష్యం

### పోర్ట్‌లు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శంతన్

**విశాఖపట్నం, మే 7, ప్రభాత వార్త :** పధాన మంత్రి ఆశయం మేరకు భారతదేశాన్ని కాలుష్య రహితంగా తీర్చి దిద్దడమే లక్ష్యం అని పోర్ట్ లు, షిప్పింగ్, జలమార్గాల శాఖామంత్రి శంతన్ ఠాకూర్ అన్నారు. విశాఖపట్నం పోర్టు ను బుధవారం ఆయన సందర్శించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎం. అంగముత్తు మంత్రి శంతన్ ఠాకూర్‌కు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోర్టులోని వివిధ కార్యాచరణ ప్రాంతాలను సందర్శించారు. వీపీఏ చేపట్టిన ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. వీపీఏ అధికారులతో సమీక్ష సమావేశాలకు అధ్యక్షత వహించారు. మరియు కీలకమైన వాటాదారులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. వీపీఏ మౌలిక సదుపాయాల సౌకర్యాలు, కీలక పనితీరు సూచికలు, రైలు మరియు రోడ్డు కనెక్టివిటీ, ఆధునీకరణ ప్రయత్నాలు, తోటల పెంపకం మరియు సౌరశక్తి ప్రాజెక్టులతో సహా పర్యావరణ కార్యక్రమాలు, ఫిషింగ్ హార్బర్ యొక్క అప్‌గ్రేడేషన్ మరియు దుమ్ము అణిచివేత వ్యవస్థల అమలును హైలైట్ చేస్తూ ఛైర్‌పర్సన్ వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమాచార సాంకేతిక (ఐటీ) చొరవలు మరియు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీ.ఎస్.ఆర్.) ద్వారా కమ్యూనిటీ ఔట్రీచ్ ప్రయత్నాలను కూడా పంచుకున్నారు, వీటిలో నైపుణ్య శిక్షణ, గిరిజన యువతకు విద్యా కార్యక్రమాలు మరియు ప్రసిద్ధ సంస్థలలో ప్లేస్‌మెంట్ మద్దతు ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి వీపీఏ బృంద స్ఫూర్తి, అభివృద్ధి చొరవలను ప్రశంసించారు. వీపీఏ తూర్పు తీరంలో పొడవైన తీరప్రాంతాన్ని కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని వ్యూహాత్మక ఓడరేవు అయినందున మరియు క్రూయిజ్ టూరిజంను సులభతరం చేయడానికి షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్, షిప్ రీసైక్లింగ్‌లో అవకాశాలను అన్వేషించాలని అథారిటీని ప్రోత్సహించారు.

# తిరుమల సమాచారం

## అశ్వవాహనంపై మలయప్ప వేంచేపు

### - కన్నుల పండువగా పద్మావతి పరిణయం

**తిరుమల,మే 7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో నారాయణవనంలోని ఆకాశరాజు కుమార్తె పద్మావతిని వివాహమాడిన ఘట్టం నిదర్శనంగా తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు పద్మావతి పరిణయోత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండవరోజు బుధవారం సాయంత్రం నిత్యకైం కర్యాలు ముగించుకున్న మలయప్పస్వామి అశ్వవాహనం అధిరోహించగా, శ్రీదేవిభూదేవి పల్లకీపై మరోవైపు నారాయణగిరి ఉద్యాన వనంలోని కల్యాణవేదికపైకి మంగళ వాయిద్యాలనడుమ వేంచేపుచేశారు. కల్యాణవేదిక వద్ద ఆగమోక్తంగా కల్యాణఘట్టాన్ని జరిపించారు. కొలువు,ఎదుర్కోలు, పూలబంతులాట ,నూతన వస్త్రాలు ధరింపజేయడం వంటివి అర్చకులు జరిపించడంతో భక్తులు కన్నులపండువగా వీక్షించి ముగ్దులయ్యారు. అన్నమాచార్య కళాకారులు ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.అక్కడ నుండి మంగళ వాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విఎస్‌ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరీక్షా ఫలితాలు

### - మన పిల్లలు మట్టిలో మాణిక్యాలు: మంత్రులు డోలా వీరాంజనేయ స్వామి, గుమ్మిడి సంధ్యారాణి



:ప్రతిభావంతమైన విద్యార్థులకు ప్రశాంసపత్రాలు అందిస్తున్న మంత్రులు డాక్టర్ డోలా వీరాంజనేయ స్వామి, గుమ్మిడి సంధ్యారాణి..

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థుల ప్రతిభకు పట్టం కట్టి వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపడుతున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయ స్వామి తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం ఏర్పాటు చేసిన పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయ స్వామి, గిరిజన సంక్షేమం మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలు, వసతి గృహాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు నగదు ప్రోత్సాహకాలు అందించటం ఇదే తొలిసారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఫలితాలు రావలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. పేద విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి, మరియు మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ లు పత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు, తదిర మౌలిక ఏర్పాట్లు కొరకు రూ. 143 కోట్లు ఖర్చుచేసామన్నారు. నీట్ లో ఉచిత కోచింగ్ సెంటర్లను ఈ ఏడాది నుంచి 10 కి పెంచుతున్నామన్నారు. తద్వారా ఎక్కువ మంది ఐఐటీ, నీట్ తదితర విద్యా సంస్థల్లో ఎక్కువ సీట్లు దక్కే అవకాశం ఉందన్నారు.ప్రతిభ ఎవరి సొంతం కాదని, సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకులాలు, వసతి గృహాల విద్యార్థుల వల్ల ఆయా సంస్థలకు మంచి పేరు వచ్చిందన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సీనియర్ ఇంటర్ లో 94 శాతం మార్కులు రావడం విద్యార్థుల, అధ్యాపకులు కృషికి నిదర్శనమన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు రెండు నెలలకు ఒకసారి కాస్మోటిక్ కిట్స్, నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తామన్నారు. గురుకులాల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్యుల్ని నియమిస్తామన్నారు. సంరక్షకులు లేని విద్యార్థులకు వేసవి సెలవుల్లోనూ హాస్టళ్లలో వసతి కల్పిస్తున్నామన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపట్ల టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.



## కపిలేశ్వర ఆలయంలో పత్రపుష్పయాగం

**తిరుమల,మే 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రసిద్ధ శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12వతేదీ సోమవారం పత్రపుష్పయాగం నిర్వహిస్తున్నారు. లోకక్షేమం కాంక్షిస్తూ ఆలయంలో అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారులు, భక్తుల కారణంగా ఏవైనా లోపాలు జరిగిఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం నిర్వహించడంపరిపాటి. ఇందుకు 11వతేదీ ఆదివారం సాయంత్రం అంకురార్పణజరుగుతుంది.

12వతేదీ ఉదయం 7.30గంటల నుండి 9.30గంటల మధ్య కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవకలశ స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పంచామృతాభిషేకం, చెరకురసం, కొబ్బరినీళ్ళు, విబూది, పసుపు,చందనంతో అభిషేకం చేస్తారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు పత్రపుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తారు.

## పాకిస్థాన్ ఉగ్రదాడికి భారత్ దీటుగా సమాధానం :విహెచ్‌పి నేతలు

**తిరుమల,మే 7ప్రభాతవార్తప్రతినిధి:** భారత్‌లో కాశ్మీర్ ఒకభాగమని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు 28మందిని పొట్టనుపెట్టుకోవడం దారుణమని, దానికి ప్రతీకారంగా భారత్ దాడులు ధీటుగా చేసిందని విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు అలోక్‌కుమార్ తెలిపారు. కాశ్మీర్‌ప్రజలు శాంతివాతావరణాన్ని కోరుకున్నారన్నారు. పాకిస్థాన్ దుశ్చర్యలను ప్రధాని మోదీ,హోంమంత్రి అమిత్‌షా ఖండించి, ధీటుగా సమాధానమివ్వడంతో పాకిస్థాన్‌కు భయం పట్టుకుందన్నారు. భారత్ అగ్రగామి దేశంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. బుధవారం ఉదయం ఆయన విహెచ్‌పి నేతలు రాఘవులు, తనికెళ్ల రవికుమార్, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయఅధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దాతల ప్రోత్సాహం దిశగా టిటిడి !



**తిరుమల,మే 7ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం దాతలను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ సిద్ధంచేసింది. భక్తులకు సేవలందించడమేగాక ప్రజలకు అవసరమైన వైద్యం.విద్య పరంగా మెరుగైన సేవలందించేందుకు టిటిడి ఇప్పటికే చొరవచూపుతోంది. ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానం అమలుచేస్తున్న పలు రకాల ట్రస్టులు, పథకాలను దాతల విరాళాలతోనే నిర్వహిస్తున్నారు. ఎస్వీఅన్నప్రసాదం, ఎస్వీప్రాణదానం, విద్యాదానం, గోసంరక్షణట్రస్ట్, వేదపరిరక్షణట్రస్ట్,ఎస్వీసర్వశ్రేయట్రస్ట్, బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్,కాటేజీ దాతల పథకం,ఎస్వీబిసి వంటి అనేక రకాల పథకాలు టిటిడి నిర్వహిస్తోంది.ఈ విభాగాలన్నిటికీ ఒక డిప్యూటీ ఇఒను నియమించి పర్యవేక్షిస్తోంది. వీటిల్లో ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు ఇప్పటికే దేశవిదేశాల్లోని కోటీశ్వరులైన, ధనవంతులైన భక్తులు దాతలుగా వేలకోట్లరూపాయలు విరాళాలుగా ఇచ్చారు. ప్రాణదానం ట్రస్ట్‌కు విరాళాలు అందుతున్నాయి. ఇదివరకు టిటిడి దాతల నుంచి నగదు రూపంలో (డిడిలు, చెక్కులరూపంలో)మాత్రమే విరాళాలు సేకరిస్తోంది. ఇలా పెద్దమొత్తంలో విరాళాలిచ్చిన దాతలకు టిటిడి పలు రకాల ప్రయోజనాలను కల్పిస్తోంది. తిరుమలకు వచ్చిన దాతలకు ఏడాదిలో వసతి, శ్రీవారి దర్శనంలో ప్రత్యేక సౌకర్యాలు కేటాయిస్తుంది. ఇప్పుడు లక్షరూపాయలు విరాళాలిచ్చిన దాతలకు ప్రయోజనాలు వర్తింపజేసేలా చూస్తున్నారు. ఇప్పటికే పలురకాల ట్రస్టులు, పథకాలకు వేలమంది దాతలు ఉన్నారు. ఈ దాతలను మరింతగా ప్రోత్సహించి గోసంరక్షణతోబాటు ప్రాణదానట్రస్ట్‌ను, ఆరోగ్యవరప్రసాదినిని మరింత బలోపేతం చేసి పటిష్టంగా అమలుచేయడానికి చూస్తున్నారు. దాతలు తమ విరాళాలను ఈ హుండీ ద్వారా,ఆన్‌లైన్‌లో, కియోస్క్ యంత్రాల ద్వారా విరాళాలివ్వడం మరింత సౌలభ్యం చేశారు.

# బిసిల అభ్యున్నతే లక్ష్యంగా చంద్రబాబు పాలన: మంత్రి సవిత



**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి జగన్ ఓర్వలేకపోతున్నాడని, కళ్లల్లో నిప్పులు పోసుకుంటూ రాష్ట్రంపైనా, కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. జగన్ పాపాలు పండే రోజులు దగ్గరపడ్డాయని, త్వరలోనే గాలి జనార్ధన్ రెడ్డి గతే పడుతుందని అన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రారంభించిన కుట్టు శిక్షణ కార్యక్రమంపై తన పత్రికలో జగన్ తప్పుడు రాస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ప్రజామోదం పొందిన కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం మానుకోకుంటే, ప్రజల ఛీత్కారానికి గురై ఉన్న 11 సీట్లు కూడా రావని అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక గుర్తింపుతో పాటు ఆర్థికాభివృద్ధి కల్పించడమే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. అన్న ఎన్టీఆర్ నుంచి నేటి సీఎం చంద్రబాబు వరకు బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మహిళలను ఆర్థిక భరోసా కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. లక్షా రెండు వేల మందికి పైగా మహిళలకు కుట్టు మిషన్ ఉచితంగా అందజేసి, నిష్ణాతులతో 360 గంటల పాటు ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. మూడు లక్షలకు పైగా మహిళలు ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులైన లక్షా 2 వేల మందిని లబ్ధిదారులు ఎంపిక చేశామని తెలిపారు. మహిళలకు మంచి చేయడాన్ని జగన్ రెడ్డి తట్టుకోలేకపోతున్నాడని మండిపడ్డారు. ప్రస్తుతానికి రాష్ట్ర వ్యాప్తంగా 720 శిక్షణా కేంద్రాల్లో మహిళలకు టైలరింగ్ లో శిక్షణ అందజేస్తున్నామన్నారు.

# శరవేగంగా హంద్రీనీవా కాలువ పనులు

### మంత్రి పయ్యావుల కేశవ్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, మే 7 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కోసం అన్ని ఏర్పాట్లు వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు, గ్రామ సభకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హంద్రీనీవా కాలువ వెడల్పు చేసే పనులన్నింటిని పరిశీలించడానికి ఈనెల 9వ తేదీన వజ్రకరూరు మండలం కొనకొండ్ల ఛాయపురం మధ్యనున్న కెనాల్ ప్రాంతాన్ని సందర్శించనున్నారన్నారు. కాలువ వెడల్పు పనులు ఎంత మేరకు జరిగింది, పనుల పూర్తికి ఇంకా ఎన్ని రోజులు పడుతుంది అనేదానిపై సమీక్ష నిర్వహించనున్నారన్నారు. ఇప్పటికే దాదాపు 50 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ముఖ్యమంత్రి పదేపదే చెప్తున్నారని, జూలై 10వ తేదీ డెడ్ లైన్ పెట్టారని, పదవ తేదీలోపల పనులు పూర్తి కావాలన్నారు. ఇది చరిత్రలో ఏ ప్రభుత్వంలోనూ జరిగినటువంటి పనులని, గతంలో ఎప్పుడో ముఖ్యమంత్రులు వచ్చి ఎప్పుడో బడ్జెట్ పెట్టి ఆ తర్వాత శంకుస్థాపనలు పెట్టి అనంతరం ఎప్పటికో పనులు ప్రారంభమయ్యేవన్నారు.

## ఆర్టీజీఎస్ లాంటి వ్యస్థలు ప్రభుత్వాలకు అవసరం

### స్విట్జర్లాండ్ రాయబారి మాయా టిస్సాఫీ



**విజయవాడ మే7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ వ్యవస్థ అద్భుతమని ప్రభుత్వాలకు ఇలాంటి వ్యవస్థల అవసరం ఎంతో ఉందని స్విట్జర్లాండ్ రాయబారి మాయా టిస్సాఫీ అన్నారు. బుధవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్‌ను స్విట్జర్లాండ్ రాయబారి ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆర్టీజీస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రఖర్ జైన్ స్వాగతం పలికి వారికి ఆర్టీజీఎస్ పనితీరు గురించి వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలనే సదాశయంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్న ఆలోచనల నుంచి ఆర్టీజీఎస్ వ్యవస్థ రూపుదిద్దుకొందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఈ సంస్థ ఒక వారధిలా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చేరేలా ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ శాఖలు ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేలా ప్రజలకు తక్షణ సేవలు అందించేందుకు కావాల్సిన సాంకేతిక తోడ్పాటును ఈ సంస్థ అందజేస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా అందించడానికి వీలుగా మనమిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ సేవలకోసం ప్రజలెవ్వరూ కూడా ప్రభుత్వ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా కేవలం తమ సెల్ ఫోన్ లోని వాట్సాప్ ద్వారానే ప్రభుత్వ సేవలు పొందే సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుత 290 వరకు వివిధ రకాల సేవలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కల్పిస్తున్నామని రాబోయే రోజుల్లో వెయ్యి రకాల సేవలు ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తామని వివరించారు. ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అర్జీలు పెట్టుకునే సదుపాయం కూడా కల్పించామన్నారు. ప్రజలకు సేవలు అందించడమే కాకుండా ఆ సేవలపైన ప్రజల్లో సంతృప్తి చెందారా లేదా అనేది కూడా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి వాటికనుగుణంగా ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుపరుస్తున్నామన్నారు.

# నేటి నుండి కోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి వారి బ్రహ్మోత్సవాలు

**రాపూరు (నెల్లూరు), మే 7, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుండి ప్రారంభమైనున్నాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబందించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయినాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు, తాగునీటికి ప్రత్యేకంగా కుళాయిలు ఏర్పాటు వంటివి పూర్తి చేశారు. దీంతో పాటు ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ఆలంకరించారు. ఉత్సవాలలో బాగంగా స్వామి,అమ్మవారి ఉత్సవ మూర్తులను గోనుపల్లిలోని స్వామి వారి ఆలయం నుండి పల్లకిలు మోసుకుంటూ గోల్లబోయిన స్వామి వారి ఆలయం వద్దకు తీసుకెల్తారు. అక్కడ స్వామి వారు తోలిదర్శనం గోల్లబోయిన స్వామికి ఇచ్చిన అనంతరం బోయిల గోవింద నామస్మరణల మద్య స్వామి వారు ఉభయదేవేరులతో కోనకు చేరుకుంటారు. కోన ముఖద్వారం వద్ద స్వామి,అమ్మవార్లకు ఆలయ అర్చక స్వాములు ఘన స్వాగతం పలికి స్వామి వారిని ఆలయం వద్దకు తీసుకెల్తారు. మద్యాహ్నం 12.30లకు స్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం(అభిషేకం), నిర్వహిస్తారు.

## ఉగ్రవాదులతో చేతులు కలిపిన పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలి - దేవాదాయ మంత్రి ఆనం

**అనంతసాగరం (నెల్లూరు), మే 7, ప్రభాతవార్త :** ఉగ్రవాదులతో చేతులు కలిపి మన భారతదేశాన్ని దెబ్బతీస్తున్న పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైదని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామన్త్రరి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సోమశిలలో జలాశయంనుంచి పెన్నా డెల్టాకు నీటిని విడుదల చేసేందుకు వచ్చిన మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రపంచంలో అగ్రదేశాల సరసన నిలుస్తున్న భారతదేశాన్ని దెబ్బతీయాలని పాకిస్తాన్ ఉగ్రవాదులతో చేతులు కలిపి కాశ్మీర్‌లోని పహలా ంగంలో ఉగ్రదాడికి పాల్పడిందన్నారు. ఈ దాడిలో 28మంద్రి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన మూల్యం చెల్లించుకునే సమయం ఆసన్నమైందన్నారు. భారతీయులంతా దేశ భద్రత కోసం సంఘటితం కావాలన్నారు. మంగళవారం అర్ధరాత్రి పాకిస్తాన్ భూగంపై ఉన్న ఉగ్రవాదులను ఆపరేషన్ సింధూర్‌పేరుతో భారత సైన్యం అంతమొందించడం భారతదేశాన్ని సగౌరవంగా తలెత్తుకునేలా చేసిందన్నారు. ఉగ్రవాదం అంతమయ్యేవరకు ఇది కొనసాగుతుందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనదేశమని, ఆర్థికంగా అన్ని రంగాల్లో బలపడుతున్న భారత్‌ను ధైర్యంగా ఎదుర్కోలేక ఉగ్రదాడులను పాకిస్తాన్ ప్రోత్సహిస్తుందన్నారు. దేశ ప్రజలందరూ దేశ రక్షణకోసం భరత ప్రనభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రజలందరూ అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**అనంతసాగరం (నెల్లూరు), మే 7, ప్రభాతవార్త :** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సోమశిల జలాశయం నుంచి 2వ పంట రబీకి నీటిని విడుదల చేశారు. తొలుత గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి నార్త్‌ఫీడర్ కెనాల్ ద్వారా 300క్యూసెక్కులు, పెన్నాడెల్టాకు 500ల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2వ పంటకు 3.60లక్షల ఎకరాలకు 44టిఎంసిలు, తెలుగు గంగ ప్రాజెక్ట్ కింద 1.60లక్షల ఎకరాలకు 16టిఎంసిలు నీటిని విడుదల చేశారు. గత ఐదేళ్ళ కాలంలో 2వ పంటకు నీటిని విడుదల చేయడంలో ప్రాంతాల మధ్య, రైతుల మధ్య తరచూ గొడవలు జరిగేవని ఎన్‌డిఎ కూటమి అధికారం చేపట్టిన తర్వాత సమగ్ర సాగునీటి యాజమాన్య వ్యవస్థ నీటి నిల్వ సామర్థ్యం, సరఫరాలో క్రమశిక్షణ పాటించడం వలన జిల్లాలో సోమశిల, కండలేరు జలాశయాల్లో సుమారు 100 టిఎంసిల నీటిని నిల్వ చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు సూచనల మేరకు జిల్లాలో రెండో పంటకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

## కల్లూరు గ్రామంలో విషాదం - కెనాల్ లో బట్టలు ఉతకడానికి వెళ్లి ముగ్గురు మృతి

**యల్లనూరు, మే 7 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం యల్లనూరు మండలం కల్లూరు గ్రామం వద్ద ఉన్న పులివెందుల బ్రాంచ్ కెనాల్ లో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ముగ్గురు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కల్లూరు గ్రామానికి చెందిన నాగలక్షుమ్మ (60) బట్టలు ఉతుకేందుకు కాలువ వద్దకు వెళ్లింది. ఆమెతో పాటు మనవడు జాషువా (7), మనవరాలు లిడియా (9) కాలువ వద్దకు వెళ్లారు. నాగలక్షుమ్మ బట్టలు ఉతుకు తుండగా మనవడు, మనవరాలు కాలువలో ఆడుకునేందుకు దిగి ప్రమాదవశాత్తు మునిగిపోతుండగా వారిని కాపాడేందుకు వెళ్లిన నాగలక్షుమ్మ కూడా కాలువలో మునిగి మృతి చెందింది.

## తిరుమల వాసికి పాకిస్థాన్ నుండి బెదిరింపు ఫోన్‌కాల్ -దీటుగా సమాధానమిచ్చిన వ్యక్తి

**తిరుమల,మే 7ప్రభాతవార్తప్రతినిధి:** ఓ వైపు పాకిస్థాన్‌పై భారత్ ప్రతీకార చర్యలు తీసుకుంటుండగా ఇదే సమయంలో పాకిస్థాన్ నుండి తిరుమలవాసికి ఓ బెదిరింపు ఫోన్‌కాల్ రావడం మరింత ఉత్కంఠగా మారింది. అంతేగాక పాకిస్థాన్ నుండి వచ్చిన ఫోన్‌కాల్‌లో తిరుమల వాసితో కుటుంబవివరాలు చెప్పడం, బాంబువేసి కుటుంబసభ్యులను పేల్చేస్తామని బెదిరించడం ఇప్పుడు భద్రతను మరింత కట్టుదిట్టంచేసే దిశగా తీసుకెళుతోంది. తిరుమల పోలీసుల ప్రాథమిక వివరాల మేరకు...తిరుమలలో నివాసముంటున్న పగడాల త్రిలోక్‌కుమార్‌కు బుధవారం ఉదయం పాకిస్థాన్ నంబర్ నుండి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. ఆ కాల్ రిసీవ్‌చేసుకున్న అతనికి ,అతని కుటుంబసభ్యుల పేర్లు కూడా వరుసగా చెప్పడంమరింత అనుమానం కలిగించింది. జాగ్రత్తగా ఉండండి, మీరేమి చేస్తున్నారో తెలుసునంటూ బెదిరించాడు. అతనికి హిందీ భాష తెలియడంతో కొంతసేపటికి తేరుకుని పాకిస్థానీయుడికి ధీటుగా సమాధానం చెప్పాడు. ఆ తరువాత వెంటనే 100కు ఫోన్‌చేసి పోలీసులకు పాకిస్థాన్ నుండి వచ్చిన ఫోన్‌కాల్, ఫోన్‌నంబర్ ,సంభాషించిన విషయాలు తెలిపాడు. తిరుమల పోలీసు అధికారులు కూడా అఘమేగాలపై త్రిలోక్‌కుమార్‌ను కలసి సమాచారం సేకరించారు. తిరుమలవాసికి ఈ క్లిష్టసమయంలో వచ్చిన సుమారు ఒకనిమిషం సమయం ఫోన్‌కాల్‌తో తిరుపతి, తిరుమల భద్రతను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరంఉందనేది పోలీసు ,భద్రత విబాగం ఉన్నతాధికారులు వ్యూహం రచించాల్సి ఉంది.

# సరిహద్దుల్లో ఆగని కాల్పులు



**శ్రీనగర్, మే 7:** భారత వైమానిక దాడుల తర్వాత నియంత్రణరేఖ, అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి పాకిస్థాన్ భారీగా కాల్పులు జరుపుతోంది. ముఖ్యంగా సరిహద్దు గ్రామాలు, ప్రజల ఇళ్లపై మోర్టార్లు, ఫిరంగులను ప్రయోగించింది. పాక్ కాల్పుల్లో సరిహద్దు గ్రామాలకు చెందిన 12 మంది ప్రాణాలు కోల్పోగా 42మంది గాయపడినట్లు పూంచ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పర్వైజ్ అహ్మద్ వెల్లడించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు చెప్పారు. పాక్ కాల్పులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. భారత్ ఎదురుదాడిలో పాకిస్థాన్ సైనిక పోస్టులు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. భారత మెరుపు దాడులకు ఏం చేయాలో పాలుపోని పాకిస్థాన్ జమ్ముకశ్మీర్‌లో పెద్ద ఎత్తున కాల్పులు జరుపుతోంది. మోర్టార్లు, ఫిరంగులతో సరిహద్దు గ్రామాలపై దాడులకు దిగింది. పాకిస్థాన్ రేంజర్లు రాత్రి నుంచి నిరంతరాయంగా జరుపుతున్న కాల్పులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. అయితే పాక్ రేంజర్లు పూంచ్ జిల్లాలో భారత సరిహద్దు గ్రామాలను, ప్రజల ఇళ్లను

## ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్థాన్‌కు వణుకు

లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరుపుతున్నారు. ఫలితంగా అమాయకులైన పౌరులు ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

పూంచ్‌తోపాటు రాజౌరి, కుప్వారా జిల్లాలోని యురి, కర్నాహ్, తంగ్దర్ సెక్టార్లలోనూ పాక్ భారీ ఎత్తున కాల్పులు జరు పుతోంది. భారత్ భీకరకంగా ఎదురుకాల్పులకు దిగడంతో పాక్‌వైపు ఆర్మీ పోస్టులు ధ్వంసమై నట్లు తెలుస్తోంది. పొరుగుదేశంలో భారీగానే నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తపరిస్థితుల నేపథ్యంలో జమ్మూ ప్రాంతంలోని ఐదు సరిహద్దు జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలనుమూసివేశారు. జమ్ము, సాంబ, కథువ, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో విద్యాసంస్థలు బుధవారం మూసివేస్తున్నట్లు డివిజినల్ కమిషనర్ రమేష్ కుమార్ చెప్పారు. పాకిస్థాన్ కాల్పుల్లో సరిహద్దు గ్రామాల్లో ఇళ్లు, దుకాణాలు, అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. పాక్ కాల్పుల నుంచి తప్పించుకునేందుకు సరిహద్దు గ్రామాల ప్రజలు భూగర్భ బంకర్లలో ఆశ్రయం పొందుతున్నారు. మరికొంత మంది సురక్షిత ప్రాంతాలకు వలసపోతున్నారు. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పంజాబ్‌లోనూ అప్రమత్తత ప్రకటించారు.

ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు జిల్లాలైన ఫిరోజ్‌పూర్, పఠాన్ కోట్, ఫజిల్కా, అమృత్ సర్, గురుదాస్‌పూర్‌లో నేడు అన్ని విద్యాసంస్థలను మూసివేశారు. పఠాన్‌కోట్ జిల్లాలో 72 గంటలపాటు విద్యాసంస్థలను మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్ సహా 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. శ్రీనగర్ విమానాశ్రయాన్ని భారత వాయుసేన ఆధీనంలోకి సుకుంది. లేహ్, జమ్ము, అమృత్‌సర్, పఠాన్‌కోట్, చండీగఢ్, జోధ్‌పూర్, జైసల్మేర్, షిమ్లా, ధర్మశాల జామ్‌నగర్ విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. భారత విమానయాన సంస్థలు దాదాపు 200కుపైగా విమానాలను రద్దు చేశాయి. ఒక్క ఇండిగోనే 165పైగా విమానాలను రద్దు చేసింది. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్, కొన్ని విదేశీ విమానయాన సంస్థలు వేర్వేరు విమానాశ్రయాలకు తమ విమానాలను రద్దు చేశాయి.

# 'ఆపరేషన్ సింధూర్'

## ప్రధానిమోడీ పెట్టినపేరే!



**న్యూఢిల్లీ, మే 7:** పహల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారంతో రగిలిపోయిన భారత్ తానేంటో చూపించింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట విరుచుకుపడింది. అయితే భారత్ మెరుపు దాడులకు ఆపరేషన్ సింధూర్ అనే పేరును ఎవరు పెట్టారని దానిపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్న వేళ అధికారిక వర్గాలు స్పందించాయి. ఆపరేషన్ సింధూర్ పేరును సూచించింది ప్రధాని మోడీ అని అధికారిక వర్గాలు చెప్పాయి. అంతకుముందు కూడా మోడీనే స్వయంగా పెట్టినట్లు కథనాలు వెలువడ్డాయి. మన మహిళలు భర్తలను కోల్పోయారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని భారత్ ఎక్కడున్నా వదిలిపెట్టదు అనేలా మన ప్రతిస్పందన కచ్చితంగా కనిపించాలి అని మోడీ అధికారులకు స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని ప్రముఖ బైసరన్ లోయలో ఉన్న పర్యటకులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా అక్కడ ఉన్న జంటల్లో పురుషులను వేరు చేశారు. ఆ తర్వాత వారిని మతం అడిగి మరీ కాల్చి చంపారు. అయితే ఉగ్రవాదులు చేసిన జంటల్లో అప్పటికి ఆరు రోజుల క్రితమే పెళ్లైన నవవధూవరులు వినయ్ నర్వాల్, హిమాన్షి కూడా ఉన్నారు. భారత నేవీ అధికారి అయిన వినయ్‌నర్వాల్‌ను ముష్కరులు కాల్చి చంపేశారు. తన కాళ్ల పారాణి ఆరకముందే హిమాన్షి జీవితంలో చీకటి అలుముకుంది. దీంతో వినయ్ మృతదేహం వద్ద కూర్చుని గుండెలవిసేలా ఆమె రోదించింది. అందుకు సంబంధించిన ఫొటో దేశాన్ని కుదిపేసింది. అయితే హిందూ మహిళలు తమ వివాహ స్థితిని సూచించడానికి నుదిటిన సింధూరం పెట్టుకుంటారు. పెళ్లి మండపంపై వరుడు, వధువుకు తొలిసారి సింధూరం పెడతాడు. కానీ హిమాన్షి అలా జరిగిన ఆరు రోజులకే భర్తను, తన ఐదో తనాన్ని కోల్పోయింది. అలా 26మంది మహిళల సిందూరాన్ని దూరం ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకే భారత సైన్యం చేపట్టిన దాడికి ప్రధాని మోడీ ఆపరేషన్ సింధూర్ అని పెట్టినట్లు తెలుస్తోంది. అయితే మంగళవారం అర్ధరాత్రి 1:44 గంటలకు ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేపట్టింది. భారత ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ బలగాలు సంయుక్తంగా దాడిని నిర్వహించాయి. మిస్సైళ్లతో లక్ష్యాలపై విరుచుకుపడ్డాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తోపాటు పాకిస్థాన్‌లోని ఉగ్ర మౌలిక సదుపాయాలను ధ్వంసంచేశాయి. భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్రపన్నినట్లు భావిస్తున్న తొమ్మిది స్థావరాలపై దాడులు చేపట్టాయి. పూర్తి కచ్చితత్వంతో దాడులు చేసినట్లు పేర్కొన్నాయి. ఉద్రిక్త పరిస్థితులకు తావులేకుండా పాక్ సైనికసదుపాయాలపై ఎక్కడాదాడులు చేపట్టలేదని వెల్లడించాయి.



## సిబిఐ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, మే 7:** కేంద్ర ప్రభుత్వం సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని పొడిగించింది. మరో ఏడాది పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సిబిఐ కొత్త డైరెక్టర్ నియామకం కోసం సమావేశం జరిగిన తర్వాతనే కేంద్రనిర్ణయం వెలువడింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ కన్నా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం సిబిఐ డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని పొడిగించగా.. ఈ మేరకు డీవోపీటీ ఆదేశాలు జారీ చేసింది. ప్రవీణ్ సూద్ 25 మే 2023న రెండేళ్ల పాటు సిబిఐ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఈ పదవిలో మే 2026 వరకు కొనసాగుతారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఎంపిక కమిటీ సమావేశంలో ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రవీణ్ సూద్ 1986 బ్యాచ్‌కు చెందిన కర్నాటక కేడర్ ఐపీఎస్ అధికారి.

# 'తొమ్మిది ఉగ్ర స్థావరాలను ధ్వంసంచేసాం'

**విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్**



విక్రమ్ మిస్రీ



సోఫియా ఖురేషి



వ్యోమికా సింగ్

**న్యూఢిల్లీ, మే 7:** విదేశాంగశాఖ, రక్షణశాఖ సంయుక్త మీడియా సమావేశం నిర్వహించింది. ఉగ్ర ఘటనలపై మీడియా సమావేశంలో వీడియో ప్రదర్శించింది. ఈ మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాతో మాట్లాడారు. పక్కా ప్లానింగ్‌తో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టాం అని వెల్లడించారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరాటం భారత్ హక్కుగా పేర్కొన్నారు. కరుడుగట్టిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీకి ట్రైనింగ్ ఇచ్చిన శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. పహల్గాం ఘటనలో 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఉగ్ర మూకలకు పాకిస్థాన్ అండగా నిలుస్తోంది. పహల్గాం ఉగ్రదాడి వెనక టిఆర్ఎఫ్ ఉంది. టిఆర్ఎఫ్‌కు పాకిస్థాన్ అండదండలున్నాయి. లష్కరే తొయిబా, జైషే మహ్మద్‌పై ఇప్పటికే నిషేధం ఉంది. ఉగ్ర సంస్థలపై నిషేధం దృష్ట్యా టీఆర్ఎఫ్ పేరుతో కార్యకలాపాలు. టీఆర్ఎఫ్ వెనక ఉన్నది లష్కరే తొయిబా, జైషే మహ్మద్ ఉగ్ర సంస్థలే. జమ్ముకశ్మీర్‌ను అతలాకుతలం చేయడమే లక్ష్యంగా పహల్గాం దాడి. కొంతకాలంగా కశ్మీర్‌లో పర్యాటకం వృద్ధి చెందుతోంది. జమ్ముకశ్మీర్ అభివృద్ధిని అడ్డుకునేందుకే పహల్గాం దాడి. పహల్గాంలో అతి క్రూరంగా ఉగ్రదాడి జరిగింది. కుటుంబసభ్యుల కళ్ల ముందే కిరాతకంగా చంపారు. టిఆర్ఎఫ్ గురించి ఇప్పటికే ఐరాసకు ఫిర్యాదు చేశాం. ప్రత్యక్ష సాక్షుల వివరాల ఆధారంగా నిందితులను గుర్తించాం. ఉగ్రవాదాన్ని పెంచి పోషించే పాక్ చరిత్ర ప్రపంచానికి తెలిసిందే. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఇప్పటికే అనేక చర్యలు చేపట్టాం. అని విక్రమ్ మిస్రీ వెల్లడించారు. 21 స్థావరాలను గుర్తించాం. 9 కేంద్రాలను టార్గెట్ చేశాం. అనంతరం, ఆపరేషన్ సింధూర్ జరిపిన తీరును కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వివరించారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి మృతులకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. గత 30ఏళ్లుగా పాకిస్థాన్ టెర్రరిస్టులను సౌకర్యాలు కల్పిస్తోంది. ఆ దేశంతో పాటు పీఓకేలోనూ టెర్రరిస్ట్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇంటెలిజెన్స్ సమాచారం సాయంతో మొత్తం 21 స్థావరాలనుగుర్తించాం. అందులో 9 ఉగ్రశిబిరాలను లక్ష్యంగా చేసుకున్నాం.

మేము కేవలం ఉగ్ర శిబిరాలపైనే దాడులు చేశాం. పాకిస్థాన్ పౌరులకు హాని చేయకుండా రీతిలో వీటిని నిర్వహించాం. ఆర్మీ శిబిరాలను లక్ష్యంగా చేసుకోలేదు. మే6, 7 అర్ధరాత్రి 1.05-1.30 గంటల మధ్య ఆపరేషన్ సింధూర్ జరిగింది. భారత్ టార్గెట్ చేసిన వాటిల్లో లాహోర్‌కు 40కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో లష్కరే తోయిబా కూడా ఉంది. ఇక్కడ 26/11 ముంబయి దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ ట్రైనింగ్ తీసుకున్నారని కర్నల్ సోఫియా ఖురేషి తెలిపారు. అధికారులు ఈ ఆపరేషన్ సింధూర్ దాడుల తీరును వివరిస్తుండగా, దాడులు వీడియో ప్రజెంటేషన్‌ను మీడియాకు ప్రదర్శించారు. సమావేశానికి ముందు గతంలో భారత్ జరిపిన దాడుల వీడియోలను ప్రదర్శించారు. ఇంకా ప్రత్యేకంగా చరిత్రలో తొలిసారి మహిళా మిలిటరీ అధికారులతో ఆపరేషన్ వివరాలని వెల్లడించడం విశేషం.

# త్రివిధ దళాలకు కేబినెట్ ప్రశంసలు

**న్యూఢిల్లీ, మే 7:** భారత త్రివిధ దళాలకు ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం అభినందనలు తెలిపింది. పాకిస్థాన్ పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై సాయుధ దళాలు నిర్వహించిన దాడి గురించి వివరించడానికి కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆ సమావేశం గురించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు దిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని కమిటీ రూమ్‌లో ప్రభుత్వం అఖిల పక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన కొన్ని గంటల తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ భేటీ అయ్యింది. సైన్యం నిర్వహించిన ఆపరేషన్‌ను కేబినెట్ ప్రశంసించింది. ఇది మనందరికీ గర్వకారణమైన క్షణమని ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. భద్రతాబలగాలు చేసిన కచ్చితమైన దాడిగా ఆపరేషన్ సిందూర్‌ను అభివర్ణించారని సమాచారం. ఆ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ దేశాన్ని నడిపిన తీరును సభ్యులు కొనియాడారట. ఈ సమావేశంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐటీఐ అప్‌గ్రేడేషన్ కోసం 60వేల కోట్ల రూపాయల జాతీయ పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీకి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ సరిహద్దుల్లో పరిస్థితి గురించి ప్రధానికి వివరించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై సైన్యం మెరుపుదాడులునిర్వహించింది. అత్యంత కచ్చితత్వంతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీం"లోని 9 ఉగ్ర శిబిరాలపై దాడులు జరిపింది. మరోవైపు, కేబినెట్ మీట్ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ప్రధాని మోడీ కలిశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారివీరు సమావేశం అయ్యారు. దీంతో ఈభేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్రపతితో మోడీ సమావే టశమైన విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయం సోషల్ మీడియాలో వెల్లడించింది. అందుకు సంబంధించిన చిత్రాలను కూడా షేర్ చేసింది.

# ఆపరేషన్ సింధూర్‌పై భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు

**న్యూఢిల్లీ, మే 7:** పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్ర స్థావ రాలపై జరిగిన మెరుపుదాడులపై ప్రపంచ దేశాలు స్పందించాయి. భారత్‌పాక్‌ల ఘర్షణ త్వరగా ముగుస్తుందని అమెరికా ఆకాంక్షించింది. భారత్ దాడి చేయడం విచారకరమంటూ చైనా వ్యాఖ్యానించింది. భారత్, పాకిస్థాన్ రెండూ తమ పొరుగుదేశాలని తెలిపింది. రెండు దేశాల మధ్య ఘర్షణను ప్రపంచం భరించలేదని ఐక్య రాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. భారత వైమానిక దాడులకు సంబంధించిన నివేదికల గురించి తమకు తెలిసిందని అమెరికా ప్రకటించింది. భారత్‌పాకిస్థాన్ మధ్య నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. దాడులు జరిగిన వెంటనే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోకు ఫోన్ చేశారు. అత్యంత కచ్చితత్వంతో దాడులు జరిపామని, పాక్ పౌరులు, ఆర్థిక, సైనిక స్థావరాల జోలికి వెళ్లలేదని దోవల్ పేర్కొన్నట్లు వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. భారత్‌పాక్ మధ్య ఘర్షణలు అతిత్వరగా ముగిసిపోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షించారు.

అటు భారత్, పాకిస్థాన్ జాతీయ భద్రతా సలహాదారులతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మాట్లాడారు. ఇరు దేశాలు కమ్యూనికేషన్ మార్గాలను తెరిచి ఉంచాలని, ఉద్రిక్తతలను నివారించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన చెందుతున్నామని చైనా తెలిపింది. భారత్, పాకిస్థాన్ రెండూ తమ పొరుగుదేశాలని, అన్ని రకాలుగా ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొంది. భారత్ చేసిన దాడులు విచారకరమని తెలిపింది. శాంతి, స్థిరత్వం కోసం భారత్‌పాక్ చొరవ చూపాలని, పరిస్థితిని సంక్లిష్టం చేయకుండా సంయమనం పాటించాలని కోరింది.

మరోవైపు, భారత మెరుపుదాడులతో పెరిగిన ఘర్షణలపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. భారత్, పాకిస్థాన్‌లు సైనిక సంయమనం పాటిం చాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ కోరారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య సైనిక ఘర్షణను ప్రపంచం భరించలేదన్నారు. ఆత్మరక్షణ నిమిత్తం దాడి చేసే హక్కు భారత్‌కు ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

అమాయకులపై దాడి చేసి దాక్కోవడం కుదరదనే విషయాన్ని ఉగ్రవాదులు తెలుసుకో వాలని హెచ్చరించారు. ఆత్మరక్షణ కోసం భారత్ చ తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. భారత్‌పాక్ మధ్యఘర్షణలను ప్రపంచం భరించలేదని యూఎఇ ఉప ప్రధానమంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అన్నారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని సూచించారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు.

# పహల్గాం అమరులకు ఆత్మశాంతి

## ఘటనలో కుటుంబసభ్యులను కోల్పోయిన బాధితులు




**న్యూఢిల్లీ, మే 7:** పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడికి దిగిన భారత ప్రభుత్వం, ఆర్మీపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. అదే సమయంలో ప్రధాని మోడీ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ పహల్గాం దాడి బాధిత కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. ఉగ్రవాది దాడిలో మరణించిన శుభం ద్వివేది, సంతోష్ జగ్‌దలే కుటుంబసభ్యులు మోడీకి ధన్యవాదాలు తెలిపారు. తమకున్యాయం జరిగిందని చెప్పారు. నా భర్త మరణానికి ప్రతీకారం తీర్చుకున్నందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు. నా కుటుంబం మొత్తం ఆయనపై నమ్మకం పెట్టుకున్నాం. ఆయన పాక్‌కు సమాధానం ఇచ్చిన విధానం మా నమ్మకాన్ని సజీవంగా ఉంచింది. ఇదే నా భర్తకు నిజమైన నివాళి. నా భర్త ఈరోజు ఎక్కడ ఉన్నా, ప్రశాంతంగా ఉంటారు అని శుభం ద్వివేది సతీమణి తెలిపారు. కుటుంబం మొత్తం ఎంతో సంతోషంగా ఉందని శుభంద్వివేది తండ్రి సంజయ్ ద్వివేది అన్నారు. భారత సైన్యం తీసుకున్న చర్య దేశ ప్రభుత్వంపై విశ్వాసాన్ని కలిగించిందనిఅన్నారు. నేను నిరంతరం వార్తలు చూస్తూనే ఉన్నా. ఈ సందర్భంగా భారత ఆర్మీకి సెల్యూట్ చేస్తున్నా. ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు. దేశ ప్రజల బాధను విని పాక్ ఉగ్ర స్థావరాలపై ఎటాక్ చేసినందుకు కృతజ్ఞతలు. ఉగ్రవాదులపై దాడి చేస్తున్నట్లు వార్తలను విన్నప్పటినుంచి మా కుటుంబం మొత్తం ఎంతో సంతోషంగా ఉంది అని చెప్పారు. బాధితులకు న్యాయం జరిగిందని శుభమ్ ద్వివేది బంధువు మనోజ్ ద్వివేది అన్నారు. ఏప్రిల్ 22న మా శుభమ్‌ప్రాణాలు కోల్పోయినప్పుడు దేశంలో ఒక విప్లవం రాబోతోందని చెప్పాం. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రధాని మోడీ కఠినమైన చర్యలు తీసుకుంటారని మాకు కచ్చితంగా తెలుసు. సైన్యం ఈరోజు ఇచ్చిన నిజమైన నివాళికి నేను ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మనోజ్ చెప్పారు. తండ్రి చనిపోయిన బాధలో కూడా ఇప్పుడు ఆనందపడుతున్నాం. ప్రధాని మోడీ తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటారని మాకు తెలుసు. ఈ ఆపరేషన్‌కు పెట్టిన పేరే అందుకు నిదర్శనం. ఉగ్రవాదుల వల్ల సోదరీమణులు తమ సింధూరం కోల్పోయినందున వారికి గుర్తుగా ఈ దాడులకు నామకరణం చేశారు. ఆనందంతో కూడిన కన్నీళ్లు ఆగవు" అని సంతోష్ జగ్‌దలే కుమార్తె అశ్విరి తెలిపారు.

ఆపరేషన్ సింధూర్ పేరు వినగానే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. భారతీయ కుమార్తెల సింధూరం తుడిచిపెట్టిన ఉగ్రవాదులకు ఇదే సరైన సమాధానం. అందుకు ప్రభుత్వానికి, మోడీకి నా హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ మీడియాతో మాట్లాడారు సంతోష్ జగ్‌దలే సతీమణి. మరోవైపు పహల్గాం దాడిలో మరణించిన వారి కుటుంబసభ్యులకు ఉపశ మనం కలిగిందని కేరళకు చెందిన ఎన్ రామచంద్రన్ కుమార్తె ఆరాధి తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంతోపాటు భారత సైన్యానికి బిగ్ సెల్యూట్ చేశారు.

# గతంలో సైనిక ఆపరేషన్లు ఎలా జరిగాయంటే?

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సైన్యం మంగళవారం అర్థరాత్రి దాటిన తరువాత ఆపరేషన్ సింధూర్ పేరిట మెరుపు దాడులుచేసి నేలమట్టం చేయడం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపింది. కేవలం 25 నిమిషాల వ్యవధిలో పలు ఉగ్రవాద స్థావరాలను సైన్యం ధ్వంసంచేసింది.కాగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ తరహాలో గతంలోనూ అనేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించడం గమనార్హం.

ఇందులో ముఖ్య మైనది 2019లో జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వా మాలో సిఆర్‌పిఎఫ్ బలగాలు ప్రయాణిస్తున్న బస్సుపై జరిగిన ఆత్మాహుతి దాడి తరువాత చేబట్టిన ఆపరేషన్ బులందర్ ఎంతో కీలకమై నది. 2019 ఫిబ్రవరిలో ఆపరేషన్ బులందర్ పేరిట సైన్యం పాకిస్తాన్ లోని బాలకోట్‌లో గల జైష్ ఏ మహమ్మద్ ఉగ్రవాద శిబిరాలపై వైమా నిక దాడులు నిర్వహించింది.

1971 తరువాత పాక్‌లో భారత్ వైమానిక దాడులు చేయడం ఇదే మొదటిసారి. ఈ దాడుల్లో భారీగా ఉగ్రవాదులు మరణించగా ఈ సమయంలోనే వైమానిక దళ పైలట్ అభినందన్ వర్ధమాన్ పాక్ సైనికులకు పట్టు బడ్డాడు. అయితే అమెరికాజోక్యంతో వారం రోజుల తరువాత ఆయనను పాక్ భారత్‌కు అప్పగించింది. దీనికి ముందు 2016లో జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా యూరీలో గల మిలటరీ బేస్‌పై ఉగ్రవాదులు దాడియేసి 19 మంది సైనికులను చంపారు. దీనికి ప్రతిగా వారంరోజుల వ్యవధిలోనే భారత సైన్యం నియంత్రణ రేఖను దాటి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో గల ఉగ్రవాద శిబిరాలను యూరి సర్జికల్ స్ట్రైక్స్ పేరిట ధ్వంసం చేసింది.

ఈ దాడుల్లో భారత సైన్యానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అంతకు ముందు 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం సమయంలో చేబట్టిన ఆపరేషన్ విజయ్, సఫేద్ సాగర్‌లు అప్పట్లో ప్రపంచ దేశాలను ఆకర్షిం చాయి.ఆ సమయంలోనే పాక్ అధ్యక్షుడుగా వున్న సైన్యాధ్యక్షుడు ముషరఫ్ ఈ ఘటన తరువాత పదవీచ్యుతడయ్యాడు.

**కార్గిల్ కొండలను పాక్ ఆక్రమించగా ఆపరేషన్ మేఘ్‌దూత్‌తో తిప్పికొట్టిన ఇందిరా గాంధీ**

ఇందిరాగాంధీ హయాంలో చేబట్టిన ఆపరేషన్ మేఘ్‌దూత్ పాక్‌లో వణుకుపుట్టించింది. అప్పట్లో కార్గిల్ కొండలు నిరాయుధీకరణ ఒప్పందంలో భాగంగా పాక్, భారత సైనికులు ఎవరు వెళ్లేందుకు వీల్లేకుండా వుంది. అయితే పాక్ సైనికులు పర్యాటకుల ముసుగులో ఈ కొండలను ఆపరేషన్ అబాబీల్‌లో భాగంగా ఆక్రమించగా దీనికి ప్రతిగా నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఆపరేషన్ మేఘ్‌దూత్ పేరిట భారీ సైనిక ఆపరేషన్ చేబట్టారు. భారత సైన్యం ధాటికి పాక్ సైన్యంలో చాలా మంది చనిపోగా అప్పటి నుంచి కార్గిల్ కొండలు భారత సైన్యం ఆధీనంలోనే వున్నాయి. ఆపరేషన్ మేఘ్‌దూత్ చేబట్టిన కొన్నినెలలకే ఇందిరాగాంధీ ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయారు. అంతకు ముందు 1971 యుద్ధంలో ఆపరేషన్ కాక్టస్ లిల్లీ ద్వారా భారత సైన్యం మేఘనా నదిని దాటి ప్రస్తుత బంగ్లాదేశ్ రాజధాని ఢాకాను చుట్టుముట్టి పాక్ సైన్యం లక్ష మందిని బంధించింది.



ఇదే సమయంలో ఆపరేషన్ ట్రైడెంట్, ఆపరేషన్ పైథాన్ పేరిట నౌకాదళ ఆపరేషన్లు తొ లిసారిగా యాంటి షిప్ మిసైళ్లను వాడి కరాచిలోని పాక్ నౌకలను, ఇంధన నిల్వలను ధ్వంసం చేసింది.

అంతకు ముందు 1965 యుద్ధం సమయంలో పాక్ ని యంత్రణ రేఖను దాటినపుడు భారత సైన్యం ఆపరేషన్ రిడిల్ ద్వారా లాహోర్, కసూర్ లక్ష్యంగా దాడులు చేసింది.

**కాశ్మీర్ కోసం భారత్..పాక్ తొలియుద్ధం**

ఇదిలావుండగా భారత్, పాక్ స్వాతంత్రం పొందిన కొన్ని నెలలకే ఇరు దేశాల మధ్య ఘర్షణ ఏర్పడింది. కాశ్మీర్‌ను ఆక్రమించేందుకు పాక్ మద్దతు వున్న ట్రైబల్ మిలీషియా దళాలు రాగా ఆ సమయంలో కాశ్మీర్ మహారాజు భారత్‌లో చేరడానికి సంసిద్ధత వ్యక్తం చేశాడు. దీంతో కాశ్మీర్‌ను రక్షించేందుకు భారత సైన్యం పాక్ సైన్యంపై దాడికి దిగింది, ఈ యుద్ధం దాదాపు ఏడాది పాటు సాగింది. చివరకు ఐరాస జోక్యంతో ఇరుదేశాలు కాల్పుల విరమణ పాటించాయి.

ఈసమయంలోనే కాశ్మీర్ మూడింట రెండు వంతుల భాగం భారత్ పరంగా ఒక భాగం పాక్ ఆక్రమణలో వుండిపోయింది. ఈ ప్రాంతానే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌గా వుండి పోయింది. దీనినే పాక్‌లో ఆజాద్ కాశ్మీర్‌గా పిలుస్తారు. కాగా ఇందులో నుంచి కొంత భాగాన్ని పాక్ చైనా పరంచేసింది. ఇలా భారత సైన్యం దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు, ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ఎప్పటి కప్పుడు తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తూనే వుంది. ఆపరేషన్ సింధూర్ ఈ కోవలోనిదే.

# పివోకేలో హతులైన ఉగ్రవాదులకు పాక్ ఆర్మీ అంత్యక్రియలు

**న్యూఢిల్లీ:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలు, శిక్షణ కేంద్రాలను భారత్ ధ్వంసం చేసింది. 'ఆపరేషన్ సిందూర్'తో చేపట్టిన ఈ సైనిక చర్యలో సుమారు వంద మంది ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. భారత్ దాడి తర్వాత పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో హతమైన పలువురు ఉగ్రవాదులకు అంత్యక్రియలు నిర్వహించారు. లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) కమాండర్ హఫీజ్ అబ్దుల్ రవూఫ్ ఈ ప్రార్థనలకు నేతృత్వం వహించాడు. నిషేధిత జమాత్ ఉద్‌దవా (జేయూడీ) సభ్యులతోపాటు పాకిస్థాన్ ఆర్మీ, పోలీస్, పౌర అధికారులు ఈ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మురిద్కేలో పాకిస్థాన్ జెండాలు కప్పిన శవపేటికలను పాక్ ఆర్మీ సిబ్బంది మోశారు. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన ఘటనపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. బుధవారం తెల్లవారుజామున 1 గంట నుంచి సుమారు అరగంట పాటు పాకిస్థాన్, పీవోకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది.

## భారతదేశాన్ని కాలుష్యరహితంగా

# తీర్చి దిద్దడమే లక్ష్యం

### పోర్ట్ లు, షిప్పింగ్, జలమార్గాల శాఖామంత్రి శంతన్

**విశాఖపట్నం, మే 7, ప్రభాత వార్త :**

ప్రధాన మంత్రి ఆశయం మేరకు భారతదేశాన్ని కాలుష్య రహితంగా తీర్చి దిద్దడమే లక్ష్యం అని పోర్ట్ లు, షిప్పింగ్, జలమార్గాల శాఖామంత్రి శంతన్ ఠాకూర్ అన్నారు. విశాఖపట్నం పోర్టు ను బుధవారం ఆయన సందర్శించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) చైర్‌పర్సన్ డాక్టర్ ఎం. అంగముత్తు మంత్రి శంతన్ ఠాకూర్‌కు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోర్టులోని వివిధ కార్యాచరణ ప్రాంతాలను సందర్శించారు. వీపీఏ చేపట్టిన ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. వీపీఏ అధికారులతో సమీక్ష సమావేశాలకు అధ్యక్షత వహించారు. మరియు కీలకమైన వాటాదారులతో ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. వీపీఏ మౌలిక సదుపాయాల సౌకర్యాలు, కీలక పనితీరు సూచికలు, రైలు మరియు రోడ్డు కనెక్టివిటీ, ఆధునీకరణ ప్రయత్నాలు, తోటల పెంపకం మరియు సౌరశక్తి ప్రాజెక్టులతో సహా పర్యావరణ కార్యక్రమాలు, ఫిషింగ్ హార్బర్ యొక్క అప్‌గ్రేడేషన్ మరియు దుమ్ము అణిచివేత వ్యవస్థల అమలును హైలైట్ చేస్తూ ఛైర్‌పర్సన్ వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమాచార సాంకేతిక (ఐటీ) చొరవలు మరియు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీ.ఎస్.ఆర్.) ద్వారా కమ్యూనిటీ ఔట్రీచ్ ప్రయత్నాలను కూడా పంచుకున్నారు, వీటిలో నైపుణ్య శిక్షణ, గిరిజన యువతకు విద్యా కార్యక్రమాలు మరియు ప్రసిద్ధ సంస్థలలో ప్లేస్‌మెంట్ మద్దతు ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి వీపీఏ బృంద స్ఫూర్తి, అభివృద్ధి చొరవలను ప్రశంసించారు. వీపీఏ తూర్పు తీరంలో పొడవైన తీరప్రాంతాన్ని కలిగి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని వ్యూహాత్మక ఓడరేవు అయినందున మరియు క్రూయిజ్ టూరిజంను సులభతరం చేయడానికి షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్, షిప్ రీసైక్లింగ్‌లో అవకాశాలను అన్వేషించాలని అథారిటీని ప్రోత్సహించారు. పోర్ట్ యొక్క మొత్తం వృద్ధి మరియు అభివృద్ధి కోసం సూచనలను ముందుకు తీసుకెళ్తామని ఛైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. భారతదేశాన్ని కాలుష్య రహితంగా చేయాలనే ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా, వాటాదారుల సమావేశాన్ని సమీక్షించిన తరువాత, కార్యకలాపాల యొక్క బ్యాక్-ఎండ్ మరియు ఫ్రంట్ ఎండ్‌లో పర్యావరణ పరిరక్షణ చొరవలను ఉపయోగించుకునే అవకాశాలను అన్వేషించాలని కోరారు. అనంతరం రాష్ట్ర మంత్రి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను సందర్శించారు. మరియు డీసీఐ లో చేపట్టిన ప్రాజెక్టులను సమీక్షించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ స్పాన్సర్ చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద సీఎస్ఆర్ చొరవలో భాగంగా, ఆర్క్ వెల్డింగ్ మరియు ఇన్వెంటరీ క్లర్క్ రంగంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 60 మంది గిరిజన యువతకు రాష్ట్ర మంత్రి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కోర్సు పూర్తి సర్టిఫికెట్ , ప్లేస్‌మెంట్ సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. గిరిజన యువతకు సాధికారత కల్పించడం ద్వారా సీఎస్ఆర్ నిధుల ద్వారా స్పాన్సర్ చేసినందుకు అల్లూరి జిల్లా కలెక్టర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌టిఎస్ డిప్యూటీ ఛైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్. స్వామి, విభాగాధిపతులు మరియు విపా సీనియర్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# ఎన్‌టిపిసిలో సివిల్ మాక్ డ్రిల్

### అత్యవసర సమయాల్లో స్పందన పై అవగాహన




**అనకాపల్లి, మే 7, ప్రభాత వార్త :**

అత్యవసర సమయాల్లో కార్మికులు, పౌరులు ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించి, వారిని సమాయత్తపరిచేందుకు దేశవ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం ఎన్టిపిసి పరవాడ నందు సివిల్ మార్క్ డ్రిల్ నిర్వహించారు. ఈ డ్రిల్‌లో భాగంగా ఎన్టీపీసీ పరవాడ సంకల్ప్ భవన్ నందు సాయంత్రం 4 గంటలకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి జనరల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్ జన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పరిశ్రమలలో ఈ సివిల్ మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కార్మికులంతా అప్రమత్తతో ఉండాలని, అధికారులు సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖ సంబంధించి అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, రెవెన్యూ శాఖకు సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారి షేక్ ఆయిషా, వైద్య శాఖ అధికారి శాంతి ప్రభ మాట్లాడుతూ వారి శాఖలకు సంబంధించి పూర్తి సహకారం అందిస్తామని, అత్యవసర సమయంలో సమన్వయంతో పనిచేసి ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సి.ఐ.ఎస్.ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్ సింగ్, అసిస్టెంట్ కమాండ్ రాజ్ కుమార్, జి డి.ఇన్స్పెక్టర్ అప్పలస్వామి, ఫైర్ ఇన్స్పెక్టర్ శుభంకర్ సర్కార్, రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా యుద్ధ వాతావరణం క్రియేట్ చేసారు. సైరన్ మోతలు, కరెంటు నిలిపివేత, పౌరుల తరలింపు, యుద్ధం జరిగితే ఎలా తమను తాము రక్షించుకోవాలనే విషయంపై కార్మికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కసరత్తులో భాగంగా సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించారు. వైమానిక దాడి హెచ్చరిక సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు (బ్లాక్ అవుట్) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స కోసం ఉంచుకోవాల్సిన అత్యవసర వస్తువులు, మందుల గురించి వివరించారు. శత్రుదాడుల సమయంలో పౌరులు, విద్యార్థులకు స్వీయ రక్షణలో శిక్షణ ఇవ్వడం, క్రాష్ బ్లాక్ అవుట్ చర్యలను అమలు చేయడం, కీలకమైన మౌలిక సదుపాయాలను ముందస్తుగా లభ్యపెట్టడం, యుద్ధ సమయంలో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లే ప్రణాళికలను నవీకరించడం, రిహార్సల్ చేయడం ఈ డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సేఫ్టీ తుషార్ (ఎన్.టి.పీ.సీ.), అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, మోహన్ రావు, డీఎస్పీ పరవాడ విష్ణు స్వరూప్, ఇన్స్పెక్టర్ పరవాడ మల్లికార్జునరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి అయేషా, జిల్లా వైద్య శాఖ అధికారి శాంతి ప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరమణ, సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ రాజ్ కుమార్, ఇన్స్పెక్టర్స్ అప్పలస్వామి, సుభాన్కర్ సర్కార్, రాజేష్ కుమార్. మరియు ఎన్టిపిసి సిబ్బంది, సిఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీస్ శాఖ స్వాత్ టీం పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రశంసలు పొందిన

## తగరపువలస వాసి చెట్టి అశోక్ చక్రవర్తి...




**భీమునిపట్నం మే 7 ప్రభాతవార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన జన్మదినాన్ని పురస్కరించుకొని కొందరు వ్యవస్థాపకుల బృందం ముఖ్యమంత్రి కార్యాలయం, ఆంధ్ర రాష్ట్ర సచివాలయంను సందర్శించి ముఖ్యమంత్రి కేన్వాస్ పెయింటింగ్ ను బహుమతి గా ఇవ్వడం జరిగింది. ఎనిమిది అడుగుల వెడల్పు, నాలుగు అడుగుల పొడుగు గల్గిన ఈ పెయింటింగ్ నారా చంద్రబాబు నాయుడు రాజకీయజీవితం లో ఎనిమిది ముఖ్య ఘట్టాలని ప్రతిబింబిస్తుంటుంది. ఈ కార్యక్రమానికి కన్వీనర్ గా భీమిలికి చెందిన చెట్టి అశోక్ చక్రవర్తి, ఫౌండర్, ఎక్సానిక్స్, ఉండటం విశేషం. ఈ కార్యక్రమం లో భాగస్వాములైన ఇతర బృందం లో ఆర్.ఎస్. విన్నీ పాత్రో, కోఫౌండర్, సీఈఓ, రికార్డెస్ట్, రాజా రమేష్, చైర్మన్ వెగ్గ అపోస్ల్ ప్రైవేట్ లిమిటెడ్,కే. వెంకటేశ్వరులు, సీఈఓ-ఎస్సీఎపి విశ్వనాథం ఎదురు, మ్యానేజింగ్ డైరెక్టర్, విశ్వనాథ్ సంస్థ తమిళనాడు నుండి చిత్రకారులు ఆనంద్ టి.ఏ, దినేష్ కుమారన్ తదితరులు ఉన్నారు. వారిలో చిత్రకారులు ఇద్దరు మాత్రమే ప్రత్యేకంగా నారా చంద్రబాబునాయుడు యుక్త వయసునుండీ నేటిముఖ్యమంత్రి గా రాష్ట్ర అభివృద్ధికై తనతో తానే పోటీ పడ్తున్నట్టు ప్రతిబింబించేలా ప్రత్యేక కేన్వాస్ పెయింటింగ్ ని చిత్రికరించి బహుమతి గా ఇవ్వడం జరిగింది.ఈ పెయింటింగ్ ను తిలకించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రకారులని, ఇతర బృందాన్ని ఆయన ప్రశంసించారు.

## చిన్నాపురం గ్రామంలో తల్లి , ఇద్దరు కుమారులు అదృశ్యం




**పద్మనాభం, మే 7, ప్రభాతవార్త:**

మండలంలో చిన్నాపురం గ్రామంలో నుండి తల్లి,ఇద్దరు కుమారులు గత నెలలో అదృశ్యమైనట్లు పద్మనాభం సి.ఐ.సి.హెచ్. శ్రీధర్ చెప్పారు. దీనికి సంబందించి సి.ఐ.తెలిపిన వివరాలు ప్రకారం ఇదే గ్రామానికి చెందిన కోన లక్ష్మి తన భర్త నారాయణతో గత నెల రెండవ తేదీన గొడవపడి సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇద్దరు కుమారులు విష్ణువర్ధన్(12), దుర్గాప్రసాదు (8)లను తీసుకొని ఊరు విడిచి వెల్లి నేటి వరకు గ్రామం రాలేదు. దీంతో భర్త నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సి.ఐ.చెప్పారు.

## సంపత్ వినాయగర్ హుండీ లెక్కింపు



**విశాఖపట్నం, మే 7, ప్రభాత వార్త :**

శ్రీ సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. 20 రోజులకు గాను రూ. 13,50,693/- అక్షరాల 13 లక్షల 50 వేల 693 రూపాయలు, వెండి-000-192 గ్రాములు 700 మిల్లీ గ్రాములు, యుఎస్ఏ డాలర్ లు -19, శ్రీలంక రూపాయల 300/- వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి కె. శిరీష్ అండ్ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అయినా టీ.ఆర్. చోళన్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపునకు శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీ దారులు గా కె. గాయత్రి వచ్చారు. దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డీ.ఎస్.ప్రసాద్ భక్తులు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల యందు

## మార్పులు చేర్పులకు

# అవకాశం

### జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి



**అనకాపల్లి, మే 7, ప్రభాత వార్త :**

రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు మే నెల 7 వ తరీఖు నుంచి రేషను కార్డులలో మార్పులు చేర్పులు నిమిత్తము అనుమతి మంజూరు చేసినట్లు పౌర సరఫరాల శాఖ అమాత్యులు ప్రకటించారని సంయుక్త కలెక్టర్ ఎం జాహ్నవి ఒక ప్రకటనలో తెలిపారు. క్యూ ఆర్ కోడ్ సహిత క్రొత్త రేషన్ కార్డుల మంజూరు చేయబడునని తెలియజేసారు. రాష్ట్ర వ్యాప్తముగా రేషన్ కార్డుల యందు ఏడు (7) సేవలు మరియు కాల పరిమితి కొరకు ప్రభుత్వము అనుమతి ఇచ్చినదని తెలిపారు. క్రొత్త బియ్యం కార్డు జారీ, బియ్యం కార్డు యందు కుటుంబ సభ్యుని చేర్పు, బియ్యం కార్డు యందు సభ్యుని తొలగింపు, బియ్యం కార్డు సరెండర్, బియ్యం కార్డు యందు చిరునామా మార్పు, బియ్యం కార్డు యందు తప్పు ఆధార్ సంఖ్య సరిచేయుట వంటి సేవలు పొందవచ్చునని తెలిపారు. కావున మే నెల 7వ తేదీ నుంచి బియ్యం కార్డు దారులు తమ కార్డు యందు తగిన మార్పులు కొరకు తమ సమీపములో గల గ్రామ సచియాలము / వార్డ్ సచివాలయముల యందు పై సేవల నిమిత్తము సంప్రదించి సద్వినియోగము చేసుకోనవలనని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలియజేసినట్లు ఆమె తెలిపారు.

## వారాడ - వేచలం రోడ్డు నిర్మాణానికి 3 కోట్లు మంజూరు



**అనకాపల్లి, మే 7, ప్రభాత వార్త :**

దేవరాపల్లి మండలంలోని వారాడ - వేచలం గ్రామాల మధ్య తారు రోడ్డు నిర్మాణానికి 3 కోట్ల రూపాయలు నాబార్డ్ నిధులు మంజూరు అయ్యాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఎం. అలమండ గ్రామంలో పర్యటించి రోడ్డు విస్తరణ పై ప్రజలతో చర్చించారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా గ్రామంలోని గౌరీ పరమేశ్వరుల ఆలయం నుంచి సినిమా హాల్ వరకు సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. దీనికి అవసరమైన స్థలం ఇచ్చి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో గ్రామస్తులకు పిలుపునిచ్చారు.

## అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



**అనకాపల్లి, మే 7, ప్రభాత వార్త :**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ జంక్షన్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారత స్వాతంత్రం పోరాటానికి తన ధైర్యం, త్యాగాలతో కొత్త శక్తి ఇచ్చిన మన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు గారి చరిత్ర ను బావి తరాలు వారు తెలుసుకోవాలని తెలుపుతూ ఘన నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, పోలరపు త్రినాథ్, సబ్బవరపు గణేష్ , పెనుమత్స కృష్ణంరాజు, గణపతిరాజు రాజా, పొలిమేర ఆనంద్, ఆకుల నానాజీ, పైల గోపి, కొమ్మోజు రామకృష్ణ, కాయల ప్రసన్న, పొలిమేర భరణి, ఎస్. భానుచందర్ (అఖి), షేక్ రియాజ్, మణికంఠ, మొల్లి శ్రీను, మళ్ళ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ అనివార్యం




**విశాఖపట్నం, మే 7, ప్రభాత వార్త :**

పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో భారత సైనిక దళాలు మంగళవారం అర్ధ రాత్రి దాటాక ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టడం సరైన చర్యని వై . యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె. కె. రాజు అన్నారు.భారత సైనిక దళాలు సాధించిన ఈ విజయం పట్ల హర్షం ప్రకటించారు.ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలపై సైనిక దాడి అనివార్యమని దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్రవాదుల దాడుల నుంచి మన పౌరులను రక్షించుకోడం ముఖ్యమన్నారు. కాశ్మీర్లోని పహల్గాంలో ఉన్న బైసరన్ వ్యాలీకి పర్యాటకులుగా వెల్లిన అమాయక పౌరులపై ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషం అన్నారు.దేశం యావత్తు సైనిక బలగాలకు అండగా ఉండాలని కె. కె. రాజు కోరారు.

## విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి, మే 7, ప్రభాత వార్త :**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి, అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతికి అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. అల్లూరి చేసిన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ జ్యోతి అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, డిఆర్ఓ వై.సత్యనారాయణ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.ఆర్.సి సుబ్బలక్ష్మి, సిపిఓ బి.రామారావు, డి.ఎల్.డి.ఓ మంజులవాని, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగ శిరీష, ఇన్చార్జి ఏవో వాసు నాయుడు, సెక్షన్ సూపరిండెంట్స్, కలెక్టరేట్ లోని వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## “ఎన్టీఆర్ ట్రస్ట్ థలసీమియా రన్ ‘వాయిదా’

**విశాఖపట్నం, మే 7, ప్రభాత వార్త :**

ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా, మే 8న విశాఖపట్నంలో జరగాల్సిన “థలసీమియా రన్” వాయిదా వేయడం జరిగిందని ఎన్టీఆర్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. పార్టిసిపెంట్స్ సేఫ్టీ, ఆరోగ్యం మా మొదటి ప్రాధాన్యత. ఈ కార్యక్రమానికి కొత్త తేదీ త్వరలో ప్రకటించబడుతుందని, మీ మద్దతుకు మేము హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. త్వరలో కలిసి పరుగెత్తుదామని పేర్కొన్నారు.

# ఉగ్రదాడులపై అప్రమత్తం చేస్తూ

# విశాఖలో సివిల్ మాక్ డ్రిల్

(7వ పేజీ నుంచి తరువాయి)



చూపించాయి. ఈ క్రమంలో ఎస్.డి.ఆర్.ఎఫ్. ప్రత్యేక వాహనంలో ఉండే పరికరాల వినియోగం, వాటితో ప్రమాదం నుంచి ఎలా తప్పించుకోవచ్చో ఎస్.డి.ఆర్.ఎఫ్. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్.డి.ఆర్.ఎఫ్. ఐజీ రాజకుమారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ప్రక్రియను దగ్గరుంచి పర్యవేక్షించారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాల పనితీరు, వాహనంలో ఉండే వివిధ రకాల పరికరాల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు.

**పలు చోట్ల బ్లాక్ అవుట్ డ్రిల్ కార్యక్రమాలు**

నగరంలోని ఒన్ టౌన్ రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాల, విశాఖపట్టణం పోర్ట్ ట్రస్ట్ పరిధిలో బుధవారం సాయంత్రం సివిల్ మాక్ నిర్వహించిన రక్షణ బృందాలు అదే రోజు రాత్రి కొన్నిచోట్ల బ్లాక్ అవుట్ డ్రిల్స్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేశాయి. ఉగ్రమూకలు అనుకోని రీతిలో చీకటిని సృష్టించి ప్రజలపై దాడులు చేసేందుకు పన్నాగం పన్నిన క్రమంలో రక్షక దళాలు ఎలా స్పందించాలి, ప్రజలు ఏ విధంగా వ్యవహరించాలి అనే కోణంలో ఒన్ టౌన్ ప్రాంతంలో, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ లో బుధవారం రాత్రి బ్లాక్ అవుట్ నిర్వహించాయి. విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉగ్రమూకలు దాడులకు తెగబడితే ఏ విధంగా స్పందించాలి.. వ్యవహరించాలి అనే విషయంపై రక్షక దళాలు ప్రజలను అప్రమత్తం చేశాయి.

**ప్రతి వార్డు సచివాలయ పరిధిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తాం జిల్లా కలెక్టర్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాబోయే కొద్ది రోజుల్లో నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని, ఉగ్రదాడులపై ప్రజలను అప్రమత్తం చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఒన్ టౌన్ పరిధిలో బుధవారం సాయంత్రం జరిగిన మాక్ డ్రిల్ సమయంలో మీడియాతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై స్పందించారు. అనుకోని రీతిలో ప్రమాదం వాటిల్లితే ప్రజలు ఎలా స్పందించాలో ముందునుంచే అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. దానిలో భాగంగా నగరంలో పలు చోట్ల సాధారణ సివిల్ మాక్ డ్రిల్స్ తో పాటు, బ్లాక్ అవుటు మాక్ డ్రిల్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. నిజమైన ఘట్టంలో ఏ విధంగా అధికారిక బృందాలు, వైద్య బృందాలు వ్యవహరిస్తాయో తెలుపుతూ ప్రదర్శనలు ఇస్తున్నామని చెప్పారు. అగ్నిమాపక వాహనాలను, అంబులెన్స్ లను, ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీములు, ఎమెర్జెన్సీ సహాయక వాహనాలు, తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, రక్షణ చర్యల్లో వినియోగించే అన్ని రకాల పరికరాలను ప్రదర్శనలో ఉంచామని కలెక్టర్ వివరించారు. భవిష్యత్తులో అనుకోని ఘటనలు ఏమైనా జరిగినట్లయితే వాటిని సమర్ధంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు జిల్లా కలెక్టర్ సమాధానమిచ్చారు.

### ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా

## బాధ్యతలు స్వీకరించిన వనజ



**విశాఖపట్నం, మే 07, ప్రభాత వార్త :**

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆపరేషన్ విభాగం డైరెక్టర్ గా టి వి సూర్యప్రకాష్, ప్రాజెక్టు విభాగం డైరెక్టర్ గా టి వనజ లను నియమిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి రెండేళ్ళపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఏపీ ఈపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ గా టి వనజ బుధవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1984లో ఏపీఎస్ఈబి కేటీపీఎస్ లో అసిస్టెంట్ ఇంజనీర్ గా చేరిన వనజ వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాలో 2022 లో పదవీ విరమణ చేసారు. 37 ఏళ్ళపాటు విద్యుత్ సంస్థలలోని అన్ని విభాగాలలో సేవలందించగా అందులో 17 ఏళ్ళు జిఎం, సిజిఎం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వంటి వివిధ హోదాలలో కొనసాగారు. 2024 లో ఐదు నెలలు ఏపీసీపీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ గా విధులు నిర్వర్తించారు. ఈపీడీసీఎల్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అతి కీలకమైన పదవిలో నియమించిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థ లలో పని చేసిన అనుభవంతో ఈపీడీసీఎల్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ప్రాజెక్ట్స్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన వనజ ను సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అభినందించారు. సంస్థ సీజీఎం లు, ఉద్యోగులు, పలు యూనియన్, ఉద్యోగ సంఘాల నాయకులు వనజ ను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# విశాఖ - భువనేశ్వర్‌కు విమానం

### ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు కృషి

(7వ పేజీ నుంచి తరువాయి)

స్వామి వంటి ఆధ్యాత్మిక దేవాలయం , కోణార్క్ సూర్య దేవాలయం, ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. భువనేశ్వర్ వెళ్లాలంటే ట్రైన్ లో వెళ్లాలి. విమానంలో వెళ్లాలంటే కలకత్తా వెళ్లి అక్కడి నుంచి భువనేశ్వర్ రావాలి. ఇరు రాష్ట్రాల మధ్య పర్యాటక అభివృద్ధి, స్నేహ సంబంధాలు బలపడటానికి ఈ విమానం ఎంతో దోహదపడుతుందని గవర్నర్ హరిబాబు తెలిపారు. హరిబాబు చేసిన కృషికి అపాటా ధన్యవాదాలు తెలిపింది. గతంలోనే హరిబాబు ఏపీ - ఒరిస్సా మధ్య పర్యాటకం మరియు వాణిజ్యాన్ని మెరుగుపరచడానికి ఈ సేవను ప్రారంభించాలని ఒక లేఖ కూడా రాశారు. ఇపుడు గవర్నర్ హోదాలో దీనిని సాధించారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
గురువారం 08 మే 2025


# భారతదేశాన్ని కాలుష్య రహితంగా తీర్చి దిద్దడమే లక్ష్యం

పోర్ట్ లు, షిప్పింగ్, జలమార్గాల శాఖామంత్రి శంతన్





వివరాలు 6లో..







## ఉగ్రదాడులపై అప్రమత్తం చేస్తూ

# విశాఖలో సివిల్ మాక్ డ్రిల్

### ఒన్ టౌన్ రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో రక్షణ విన్యాసాలు
### మాక్ డ్రిల్ ను పర్యవేక్షించిన ఎస్.డి.ఆర్.ఎఫ్. ఐజీ, జిల్లా కలెక్టర్, జేసీ ఇతర అధికారులు
### ప్రతి వార్డు సచివాలయం పరిధిలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తాం : జిల్లా కలెక్టర్

**విశాఖపట్టణం, మే 07 ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణగా జిల్లా అధికార యంత్రాంగం విశాఖపట్టణం నగరంలో బుధవారం పలు చోట్ల సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ దళాలు ప్రదర్శనలు ఇచ్చాయి. బుధవారం సాయంత్రం ఒన్ టౌన్ పరిధిలోని రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో వేర్వేరుగా నిర్వహించిన ఆపరేషన్లలో సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక, ఎస్.డి.ఆర్.ఎఫ్., ఎన్.డి.ఆర్.ఎఫ్., పోలీసు, జీవీఎంసీ, రెవెన్యూ, సివిల్ సప్లైస్, వైద్య శాఖ, పలువురు వాలంటీర్లు భాగస్వామ్యమయ్యారు. ముందుగా రాణీబొమ్మ సెంటర్లో రెండు భవనాల్లో ఉగ్రమూకలు పొగ బాంబులతో దాడులు చేయగా స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశాయి. వెనువెంటనే సంఘటనా స్థలానికి మాస్క్ లు ధరించి చేరుకున్న ఎన్.డి.ఆర్.ఎఫ్., ఎస్.డి.ఆర్.ఎఫ్. సహాయక సిబ్బంది ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను కాపాడారు. నిచ్చెన సాయంతో కొందరిని కిందకు దించగా, మరికొందరిని భద్రతా సిబ్బంది మెట్ల మార్గం ద్వారా కిందకుదించారు. ప్రమాదంలో గాయపడిన వారిని హుటాహుటిన ప్రమాద స్థలానికి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరాలకు తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. ఒన్ టౌన్ పరిధిలోని క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు ప్రత్యేకంగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఉగ్రమూకల దాడుల నేపథ్యంలో తరగతి గదుల్లో చిక్కుకున్న విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎలా రక్షించాలో, వారు ఎలా వ్యవహరించాలో ప్రదర్శనలు ఇస్తూ అప్రమత్తం చేశాయి. అలారం మోగినప్పుడు ఏ విధంగా స్పందించాలో.. సేఫ్ జోన్ కు ఎలా చేరుకోవాలో తెలిపాయి. రోప్ ల సాయంతో భవనాలపై నుంచి కిందకు ఎలా దిగాలో చేసి

తరువాయి 6లో..



## ఆర్టిసి ఆవరణలో..
# బాంబుల మోత

అప్రమత్తమైన అన్ని శాఖలు

పోలీస్, ఫైర్, వైద్య సేవలకు ప్రశంసలు

9 లో



6 లో

## ఎన్టిపిసిలో సివిల్ మాక్ డ్రిల్

అత్యవసర సమయాల్లో స్పందన పై అవగాహన

# విశాఖ - భువనేశ్వర్‌కు విమానం

### ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు కృషి





**విశాఖపట్నం, మే 7, ప్రభాత వార్త :**

విశాఖ వాసులకు నిజంగా ఇది శుభవార్త. విశాఖ మాజీ ఎంపీ, ప్రస్తుత ఒరిస్సా గవర్నర్ కె. హరి బాబు తన పలుకుబడి ఉపయోగించి విశాఖ , భువనేశ్వర్ మధ్య విమాన సర్వీసును పునరుద్ధరించారు. వాస్తవానికి చాలా కాలం క్రితం విశాఖ - భువనేశ్వర్ మధ్య విమాన సర్వీసు ఉండేది. అది రద్దు అయి చాలాకాలం అవుతుంది. ఈ నేపథ్యంలో ఇండిగో మరియు ఒరిస్సా ముఖ్యమంత్రిని ఈ కనెక్షన్ కోసం ఒప్పించి విశాఖపట్నంకు కొత్త విమానాన్ని సులభతరం చేశారు. దీనివలన ఇటు పర్యాటకులు, అటు ఇరు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఒడిస్సా రాజధాని భువనేశ్వర్ చుట్టుపక్కల పూరి జగన్నాథ్

..మిగతా 6లో

# రహదారుల ప్రణాళికపై సమీక్ష జరిపిన ఎమ్మెల్యే గంటా, ప్రణవ్

**విశాఖపట్నం, మే 7, ప్రభాత వార్త :**

వి ఎం ఆర్ డి ఏ ప్రతిపాదించిన బృహత్ ప్రణాళిక రహదారులను క్షేత్ర స్థాయిలో భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు తో కలిసి వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ పరిశీలించారు. బుధవారం ఉదయం భీమిలి శాసనసభ నియోజకవర్గం పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ ను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా ఏ రోడ్లు విస్తరించాలి, ఎక్కడెక్కడ ఎలైన్మెంట్లను మార్చాలి తదితర అంశాలను చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఆర్ డి పి ఆమోదం పొందిన రహదారులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అడవివరం , భీమిలి బీచ్ రోడ్డు, పాత అడవివరం జంక్షన్, సత్తరువు జంక్షన్, ఆనందపురం జంక్షన్, పెద్దిపాలెం జంక్షన్, దొరతోట జంక్షన్, నేరళ్లవలస జంక్షన్ ల మీదుగా క్షేత్ర స్థాయిలో పర్యటన జరిగింది. జాయింట్ కమిషనర్ కె రమేశ్, ఎస్టేట్ అధికారి దయానిధి, ముఖ్య ప్రణాళిక అధికారిణి శిల్ప అధికారులు సిబ్బంది, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ జీవ సమాధి ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



**విశాఖపట్నం, మే 7, ప్రభాత వార్త :**

అగ్రహారం వీధి, చెంగళరావుపేట లో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 332వ సజీవ జీవ సమాధి ఆరాధన మహోత్సవములు సందర్భంగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్వామి వారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్వామివారి దర్శించుకున్నాననీ , మరలా ఆలయానికి రావడం సంతోషంగా ఉందని అన్నారు. స్వామివారి కృపా కటాక్షములతో ప్రజలందరూ బాగుండాలని అదేవిధంగా త్వరలో స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు ఆలయ అభివృద్ధితో పాటు ఆర్చి నిర్మాణానికి సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ నగర విశ్వబ్రాహ్మణ సంఘం , విశాఖ నగర స్వర్ణకార సంఘం, విశాఖ నగర విశ్వబ్రాహ్మణ ఫైవ్ మెన్ కమిటీ ,పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ , శ్రీ గాయత్రీ విశ్వకర్మ యువజన సేవా సంఘం సభ్యులు, స్థానిక కార్పొరేటర్ నరసింహ చారి దంపతులు, మాజీ కార్పొరేటర్ లు, టిడిపి ,బీజేపీ, జనసేన శ్రేణులు, భక్తులు పాల్గొన్నారు...



## బ్రిటిష్ వారిని ఎదిరించిన అల్లూరి త్యాగం
# చిరస్మరణీయం

జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్

- వార్త 9లో..

## అయ్యప్ప మహోత్సవంలో
# పాల్గొన్న స్పీకర్ అయ్యన్న



**నర్సీపట్నం, మే 7, ప్రభాత వార్త :**

నర్సీపట్నంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ యంత్ర పునఃప్రతిష్ఠ మహోత్సవం లో భాగంగా 2వ రోజు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వామి వారికి అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి చింతకాయల పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మంగళవారం, బుధవారం కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయని, 8వ తేదీ గురువారం తెల్లవారుజామున 5 గంటల నుండి అయ్యప్ప స్వామికి విశేష పూజలు జరుగునున్నట్లు తెలిపారు. ఉదయం 6.54 గంటలకు శ్రీ అయ్యప్ప స్వామి మరియు అమ్మవారి నూతన విగ్రహాలు ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ ప్రతిష్ట కార్యక్రమం లో భక్తిశ్రద్ధలతో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి స్టేడియంలో భారీ అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



# మన్యంలో ఎన్ కౌంటర్

### పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు
### ఇద్దరు మావోయిస్టులు మృతి రెండు తుపాకీలు స్వాధీనం

**పాడేరు/చింతూరు,మే7, ప్రభాతవార్త:**

అల్లూరి జిల్లా పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగటంతో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్టు తెలుస్తోంది.ఈ ఎన్ కౌంటర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఏజెన్సీలో కొనసాగుతున్న కూంబింగ్ మావోయిస్టు కీలక నేత జగన్ అలియాస్ పండన్న మృతి మావోయిస్టు జగన్‌పై రూ.20 లక్షల రివార్డ్ మరో మావోయిస్టు రమేష్ మృతీ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఎన్కౌంటర్ జరిగిన ప్రదేశానికి పోలీస్ బలగాలు తప్పా ఎవరు వెళ్ళలేని పరిస్థితి ఏ ప్రదేశంలో యుద్ధ వాతావరణం నెలకొని ఉంది.ఎన్కౌంటర్ లో మృతి చెందిన ఇద్దరా?లేదా ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది గురువారం పోలీస్ లు వెల్లడించాల్సి ఉంది.సంఘటనా ప్రదేశంలో రెండు 147 వేపన్స్ లభ్యమైనట్లు తెలుస్తోంది.

# 13న జెడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

## జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి

విశాఖపట్టణం, మే 07 ప్రభాతవార్త

జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ అధ్యక్షతన ఈనెల 13 న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్పర్సన్ జె. సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని వి. సి హాలులో, జడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10.00 నుంచి 12.00 గంటల వరకు జరుగుతాయని, సంబంధిత ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10.00 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు 11.00 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12.00 గంటలకు జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, సంబంధించిన ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని ప్రకటన ద్వారా కోరారు.

## ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి

# తిరుక్కళ్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభం



విశాఖపట్నం మే 7. ప్రభాతవార్త

అల్లిపురం వెంకటేశ్వర మెట్టపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి తిరుక్కళ్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.శ్రీ స్వామి వారికి పంచామృతాభిషేకం, స్నపనం, తిరుమంజనసేవ, నూతనవస్త్రాలంకరణ్ చేసారు. కళ్యాణం సందర్బంగా మహిళలు పసుపు కొమ్ములు దంచారు. గురువారం స్వామి వారి తిరుక్కళ్యాణ మహోత్సవాన్ని రాత్రి 7.30గంటలకు వేడుకగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి. వి. రమాబాయి తెలిపారు. ఈనెల 13వ తేదీ వరకు ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయని స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగానే దేవస్థానంలో 1116రూపాయలు చెల్లించి తగు రసీదు పొందాలని కోరారు. ఈ వేడుకలు సందర్బంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి కళ్యాణంలో పాల్గొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించవలసిందిగా కోరారు.

## మాధవధార పరిసర ప్రాంతాలలో

# రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాధవధార :మే 07 ప్రభాతవార్త

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్ లో గల మాధవధార, తేన్నేటి నగర్, కళింగ నగర్, సీతాన్న గార్డెన్స్,లాన్సమ్ గ్రీన్స్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం నాడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్ -2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి కె నాయుడు బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.దీంతో మాధవధార,కనకదుర్గ ఫంక్షన్ హాల్,గాయత్రి విద్యా మందిర్,జనతా గ్యారేజ్,గ్యాస్ గుడౌన్, తేన్నేటి నగర్,మాధవస్వామి గుడి రోడ్డు,కళింగ నగర్,ఎం ఎన్ ఆర్ పార్క్,సాయి రాం పార్లర్ రోడ్డు,లాన్సమ్ గ్రీన్స్ అపార్ట్మెంట్ ప్రాంతాల్లో శుక్రవారం నాడు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.


# సింహాచలం దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు వైయస్సార్ పార్టీ చేయూత



సింహాచలం ప్రభాతవార్త మే 7....

చందనోత్సవం లో జరిగిన దుర్ఘటన లో ప్రాణాలు కోల్పోయిన ఎడ్ల వెంకట్రావు భార్య వెంకటలక్ష్మికి వైయస్సార్ పార్టీ తరఫున భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ చిన్న శ్రీను ఆధ్వర్యంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, వైయస్సార్ జిల్లా అధ్యక్షులు కేకే రాజు రెండు లక్షలు ల రూపాయలు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని, ఈ ప్రభుత్వము ఇచ్చిన 25 లక్షలు కలిపి మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగిలిన 75 లక్షల రూపాయలు కుటుంబాలకు అందజేస్తామని అన్నారు. కేవలము ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ దుర్ఘటన జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు కొలుసు ఈశ్వరరావు, కోపరేటివ్ అధ్యక్షులు కర్రీ స్వామి, బోరా ప్రసాద్ రెడ్డి, పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు, ఎన్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి పాసర్ల ప్రసాద్ రాజీనామా



సింహాచలం ప్రభాతవార్త మే 7...

అడివి వరం సీనియర్ రాజకీయ నాయకులు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ , పాసర్ల ప్రసాద్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలియజేశారు. తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల కి అందజేసినట్లు తెలిపారు. తదుపరి నిర్ణయం కార్యకర్తలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని అన్నారు

## సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలుగా

# బూసి పరమేశ్వరి ఎన్నిక



జగదాంబ మే 7 ప్రభాతవార్త

మే 5,6 తేదీలలో యలమంచిలి లో జరిగిన సిపిఐ అనకాపల్లి జిల్లా 2 వ మహాసభలలో మహిళా సమాఖ్య నాయకురాలు బూసి పరమేశ్వరి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నిక కాబడ్డారు. ఇప్పటికే జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శిగా ఉన్న పరమేశ్వరి కమ్యూనిస్టు పార్టీకి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ స్థానం దక్కడం అభినందనీయమని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సిపిఐ నాయకులు ఎల్లేటి శ్రీనివాస్, ఆనంద్, పరవాడ సిపిఐ సభ్యులు ఎన్ అనూరాధ, జి విజయ లక్ష్మి, కే లక్ష్మీ, జీ తులసి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి



జగదాంబ మే 7 ప్రభాత వార్త

దొండపర్తి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ సమావేశ మందిరంలో అక్కయ్యపాలెం నందగిరి నగర్ శ్రీ వాసవాంబిక ఆర్యవైశ్య సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ వాసవి మాత కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని నిర్వహించారు . ముందుగా గణపతి పూజను ఆచరించి అనంతరం 108 మంది మహిళలు సామూహికంగా కుంకుమ పూజలు భక్తి శ్రద్ధలతో జరిపారు . వాసవి మాత జయంతి ఉత్సవానికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ ప్రసంగిస్తూ సర్వ మంగళ సౌభాగ్యప్రదాయనిగా ఆర్యవైశ్యుల ఇలవేల్పుగా అవతరించినటువంటి శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ఎవరైతే భక్తిశ్రద్ధలతో స్మరిస్తారో వారికి అమ్మవారి యొక్క పరిపూర్ణ కటాక్షం లభించడమే కాకుండా సిరిసంపదలు కలుగుతాయి అని అన్నారు . వాసవి మాత కన్యకా పరమేశ్వరి అమ్మవారి అవతార విశిష్టతను తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లూరు రూప , ఉత్సవ కమిటీ చైర్మన్ జి కృష్ణ , అధ్యక్షులు ఎం సుబ్రహ్మణ్యం , కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు , కోశాధికారి కె నాగేశ్వరరావు , సంస్థ ప్రతినిధులు వై గణేష్ ఎస్ జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు .

# పాండ్రంగి గ్రామంలో ఘనంగా అల్లూరి వర్ధంతి






పద్మనాభం, మే 7 , ప్రభాతవార్త:

మండలంలో పాండ్రంగి గ్రామంలో బుదవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలను పాలకులు, నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి విగ్రహానికి ఎంపీపీ రాంబాబు,వైసీపీ నాయకులు అముజూరి అప్పారావు, అనంతరం టీడీపీ నాయకులు కె.రామరాజు, మహంతి శ్రీను, బి.శ్రీను ,రవిబాబు, అల్లూరి అభిమానులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

# భక్తి శ్రద్ధలతో అనంతపద్మనాభస్వామికి అభిషేకాలు



పద్మనాభం, మే 7 , ప్రభాతవార్త :



పద్మనాభం పుణ్యక్షేత్రంలో గత రెండు రోజుల నుండి జరుగుతున్న అనంతపద్మనాభస్వామి ఆలయ సంప్రోక్షణ మరియు శిఖర ప్రతిష్ఠా మహోత్సవంలో బాగంగా బుధవారం కొండపై అనంతుని ఉత్సవమూర్తులకి, మూలమూర్తికి త్వరలో ప్రతిష్ఠ కానున్న కలశానికి ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో వైదిక బృందం, భక్తులు భక్తి శ్రద్ధలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ముందుగా యాగశాల నుండి అనంతుని ఉత్సవ మూర్తులు, కళశాన్ని తీసుకొచ్చి ఆలయం చుట్టూ అనంతుని నామంతో ప్రదక్షిణలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, సర్పంచ్ తాలాడ పాప, నాయకులు ఎర్రినాయుడు, సత్యనారాయణ, నాగేష, సన్నిబాబు, సుమంతనాయుడు, ప్రకాష్ పాల్గొన్నారు

# బాలల సమస్యల పరిష్కారానికి అంతా కృషి చేయాలి



గాజువాక,మే 07,ప్రభాతవార్త:

బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బాలలపై జరిగే హింస మొదలైన సమస్యల పరిష్కారానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ- బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. చిన్నారులు కూడా జీవితంలో స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని, క్రమశిక్షణ, పట్టుదల, దేశభక్తి అలవర్చుకోవాలని అన్నారు. తొలుత అల్లూరి సీతారామరాజు వర్ధంతి మరియు రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు అంతా పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి. రమణ,గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ , జాతీయ సేవా పథకం అధికారులు ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, వై.అనసూయా దేవి,స్థానిక నాయకులు జగదాంబ, న్యాయవాది జి.కె.వి. రాజు, పెద్ద సంఖ్యలో చిన్నారులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ జోనల్ కమిషనర్గా అయ్యప్ప నాయుడు



భీమునిపట్నం మే 7 ప్రభాతవార్త :

భీమిలి జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు బుధవారం అధికారికంగా విధుల్లో చేరిన సందర్భంగా జనసేన పార్టీ తరఫున 1వ వార్డు అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి ప్రత్యేకంగా ఆమె స్వయంగా జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును సాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేనయువ నాయకుడు పరిమి. ప్రీతమ్, పందిరి.తారకేశ్, ప్రసాద్, హైమ, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్పిసిఎల్ సీనియర్ సెక్యూరిటీ మేనేజర్ కు సమ్మె నోటీసు

గాజువాక,మే 07,ప్రభాతవార్త:



మే 20వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మె సందర్భంగా హెచ్ పి సి ఎల్ సెక్యూరిటీ అధికారి విజయకుమార్ కు జిల్లా ఐ ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి, హెచ్పిసి ఎల్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు భోగవిల్లి నాగభూషణం ఆధ్వర్యంలో బుధవారం సమ్మె నోటీస్ ను అందజేశారు. ఈ సందర్భంగా భూషణం మాట్లాడుతూ కేంద్రంలో అధికారం ఉన్న బిజెపి ప్రభుత్వము, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులపై కర్షకుల పై వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా మే 20 తేదీన దేశవ్యాప్త సమ్మెకు, కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయని అన్నారు. ఇచ్చిన పిలుపుమేరకు విశాఖలో విజయవంతం చేయుటలో భాగంగా విశాఖ రిఫైనరీలో కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలో పాల్గొనటం గురించి, హెచ్పిసిఎల్ సీనియర్ సెక్యూరిటీ మేనేజర్ విజయ కుమార్ కు సమ్మె నోటీస్ అందజేసామని,కార్మికులు పాల్గొని సమ్మె ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నోటీస్ ఇచ్చిన వారిలో సెక్రటరీ ఎస్ తాతబాబు,సంఘం సభ్యులు రాజేష్, పెద్దాడ కుంచారావు, రాజు యాదవ్, మజ్జి సోమనాథ్ తదితరులు ఉన్నారు.

# విశాఖ వాసులకు సరికొత్త ఆకర్షణ సిద్ధం



విశాఖపట్నం మే 7 ప్రభాతవార్త

నగర వాసులను, నగరానికి వచ్చే పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ఒక మరొక ప్రత్యేక ఆకర్షణ సిద్ధమైంది. బీచ్ రోడ్ లో పోలీస్ మెస్ వెనుక భాగంలో సువిశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఎక్స్ పో లో నయాగరా జలపాతం నమూనా ప్రజలను అలరించడానికి సిద్ధమైంది. బుధవారం సాయంత్రం దీనిని నిర్వాహకులు ప్రారంభించారు. 30 అడుగుల ఎత్తు, 181 అడుగుల వెడల్పు కడిగిన నయాగరా జలపాతం నమూనాను ఎగ్జిబిషన్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పైనుంచి వేగంగా పడుతున్న నేటి ప్రవాహం రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో ఎంతగానో ఆకర్షిస్తోంది. వేసవి నేపథ్యంలో విశాఖ వాసులను, నగరానికి వచ్చే పర్యాటకులను, ముఖ్యంగా చిన్నారులను మరింత అలరించే విధంగా దీనిని ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు రాజారెడ్డి తెలిపారు. చిన్నారులను ఎంతగానో ఆకట్టుకునే విభిన్న రైడ్లు మహిళలకు సైతం ఆకర్షించే వస్త్ర ఆభరణాల స్టాల్స్ కుటుంబ సమేతంగా సంతోషాన్ని పంచుకునే వేదికగా రుచికరమైన వంటకాలు తో విశాఖ ఎక్స్ పో నగరవాసులను సాదరంగా ఆహ్వానం పలుకుతోంది.

## హిందూ ధర్మ పరివార్ ఆధ్వర్యంలో

# మాక్ డ్రిల్ అవగాహన సదస్సు



గాజువాక,మే 07,ప్రభాతవార్త :

గాజువాక బీసీ రోడ్ తిప్పల అప్పారావు కళ్యాణ మండపంలో హిందూ ధర్మ పరివార్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా బిజెపి గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు . పహల్గామ్ ఉగ్ర దాడిలో మృతి చెందిన 26 మంది ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదులు అమాయక హిందూ పర్యాటకులను అత్యంత కిరాతకంగా కాల్చి చంపారని అన్నారు. అందుకు బదులుగా ప్రధాని మోడీ నాయకత్వంలో భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ పేరుతో బుధవారం తెల్లవారుజామున 1.44 ని.లకు పాక్ ఆక్రమిత కశ్మీర్ పాకిస్తాన్లో ఉన్న తొమ్మిది ఉగ్రవాద సంస్థలపై మెరుపు దాడులు చేసి ముప్పై మంది ఉగ్రవాదులను హతమార్చారని అన్నారు. ఆపరేషన్ సిధూర్ పై హర్షం వ్యక్తంచేశారు. యుద్ధం వస్తే రాత్రి పూట ప్రజలు అందరూ తమతమ ఇళ్లలో లైట్లను ఆపివేయాలని, నిట్ట నిలువుగా నిలబడకూడదని, తలకు ఏదైనా గుడ్డతో కప్పి ఉంచాలని, పిల్లలను వయసు మీరిన వారికి సహాయం చేయాలని మందులు నిత్యవసర వస్తువులు మందుగానే తీసుకోవాలని,తమను తాము కాపాడుకుంటూ, యితరులకు సహాయం చేయాలని సూచించారు .మాక్ డ్రిల్ చేసారు. అనంతరం గత నెల లంకా మైదానంలో జరిగిన హిందూ మహాసభకు సహకరించిన పలువురు ప్రముఖులను ధాతలను సాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 10 టాపర్ విద్యార్థులకు

# ఉపాధ్యాయులతో సత్కారం



భీమునిపట్నం మే 7ప్రభాతవార్త :

చిట్టివలస జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చదివి 10 వతరగతి పరీక్షలలో మండలంలోనే టాపర్ గా నిలిచిన విద్యార్థునులను ఉపాధ్యాయులు సత్కరించి, వారికి నగదు పారితోషికం అందించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయని రోజామణి అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో 588 మార్కులు సాధించి భీమిలి నియోజక వర్గంలోనే టాపర్ గా నిలిచిన ఏం.వర్షిణి, 578 మార్కులు సాధించిన బి.ఒలివర్, 571 మార్కులు సాధించిన సి. హెచ్.లాస్యలను శాలువలతో సత్కరించి నగదు పారితోషికం, జ్ఞాపికలతోవారిని సత్కరించారు. మండల విద్యాధికారి శివమణి విద్యార్థునులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో భీమిలి మండలానికి విద్యార్థునులు మంచి గుర్తింపు తెచ్చారనీ, బాలికల పాఠశాల10వతరగతి లో మంచి ఉత్తీర్ణతా శాతం సాధించడమే కాకుండా కార్పొరేట్ పాఠశాలలతో సమానంగా ఉత్తీర్ణత సాధించడం అభినందనీయం అని అన్నారు. వర్షిణి తండ్రి బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. లాస్య తండ్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులు చేసినకృషితో పాటు క్రమశిక్షణ మంచి ఫలితాలను సాధించేలా చేశారున్నారు.ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్ రామ లక్ష్మి, సోషల్ టీచర్ పి.వి.లక్ష్మి, ఇంగ్లీషు టీచర్ రాణి తెలుగు టీచర్ సావిత్రి,హిందీ టీచర్ భీమభాయ్, సంధ్య విద్యార్థులను అభినందించారు.




# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**- జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్**

**పాడేరు, మే 7, ప్రభాతవార్త**

జిల్లాలో రహదారులు, భవన నిర్మాణాల అభివృద్ధి పనులను జాప్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పి. ఎ. యు, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, రహదారులు భవనాల శాఖల ఇంజనీరింగ్ అధికారులతో ప్రధాన మంత్రి జన్ మన్, ఆర్టికల్ 275, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురోగతిలో ఉన్న పనులను రానున్న వర్షాకాలంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులపై ఇంజనీరింగ్ విభాగాలు నివేదిస్తే ప్రభుత్వంతో మాట్లాడి బిల్లులు చెల్లింపుకు కృషి చేస్తామన్నారు. రహదారులు, భవన నిర్మాణాలకు నిధులు సమస్య లేదని ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. పనులు జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పెదబయలు మండలం బూసిపుట్టు పిట్టల బొర్ర, అనంతగిరి మండలం కటికి రోడ్డు పనుల ప్రగతిపై ఆరా తీసారు. నీతి ఆయోగ్ నిధులతో అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల భవన నిర్మాణాలకు 12 పనులు మంజూరు చేయడం జరిగిందని వాటిని త్వరగా పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగానికి 56 కిల్లో మీటర్ల బిటి రోడ్లకు సంబంధించి 34 పనులు మంజూరు చేసామన్నారు. రహదారుల నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులకు జిల్లా స్థాయి కమిటీలో ప్రతిపాదనలు పెట్టాలన్నారు. జి.కె. వీధి ఆర్ వి నగర్ మధ్య రహదారి పనులపై రహదారులు భవనాల ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసు కున్నారు. రహదారి పనులను వేగంగా





పూర్తి చేయాలని సూచించారు. చింతూరు డివిజనల్ 14 పనులకు నాలుగు పనులు పూర్తి చేసారని మిగిలిన పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. పి ఐ యు ఇంజనీరింగ్ విభాగానికి రూ.390 కోట్లతో 146 పనులు మంజూరయ్యాయని టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో పిఐయు ఇ ఇ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ కె. వేణు గోపాల్ పంచాయతీ రాజ్ ఇ ఇ కొండయ్య పడాల్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పిడి డా. విద్యాసాగర్, డి.ఇఇలు, ఏ ఇలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి వేడుకలు

**చింతపల్లి మే 7 ప్రభాతవార్త**



మన్యం వీరుడు, అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు 101 వర్ధంతిని చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కోరాబు అనూష దేవి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఒక వ్యక్తి కాదు మహోత్సవ శక్తి అని అతను జరిపిన సాయుధ పోరాట స్వాతంత్ర ఉద్యమ సంగ్రామంలో ఒక ప్రత్యేక అధ్యాయంగా పేర్కొనవచ్చును అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం సిద్ధిస్తుందని ప్రగాఢంగా నమ్మి, తాను నమ్మిన సిద్ధాంతం కొరకు ప్రాణాలర్పించిన మహాయోధుడు అన్నారు. అల్లూరి సీతారామరాజు 1897 జూలైన పాండ్రంగి గ్రామంలో వెంకటరామరాజు సూర్యనారాయణములకు జన్మించారన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి బ్రిటిష్ పాలనను వ్యతిరేకించాడన్నారు. 1924 మే 7న కొయ్యూరు మండల గ్రామ సమీపంలో ఆయనను బ్రిటిష్ వారు పట్టుకొని కాల్చి చంపారన్నారు. ఆయన పోరాట పటిమ ఆ రోజుల్లో బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిందని, అటువంటి మహా వ్యక్తులను స్మరించుకొని నేటి యువత ఆ మార్గంలో నడవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ నాజరవల్లి, మాజీ వైస్ ఎంపీపీ భూసరి కృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ రామారావు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

## మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంతా టీచర్స్ పోస్టులు మినహాయింపు ఇవ్వాలి

**పాడేరు,మే7, ప్రభాతవార్త**



2025 ఏప్రిల్ 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించడం వలన ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరిగిందనీ, మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఆంధ్ర ప్రదేశ్ 5వ షెడ్యూల్డ్ ఏరియాలో 100 ఉపాధ్యాయ రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వలేదనీ,.రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం వల్ల ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందనీ. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో అల్లూరిసీతారామరాజు జిల్లాలో 400 పోస్టులకు గాను ఎస్టీలకు కేవలం 24 పోస్టులుమాత్రమే కేటాయించారనీ ఆదివాసీలకు 6శాతం, ఓపెన్ కేటగిరీలో 94 పోస్టులు కేటాయించడం ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందనీ. ప్రభుత్వం పునర్పరిశీలన చేయాలని డిఎస్సీ సాధన కమిటీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు కు ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా ఎమ్మెల్సీ స్పందిస్తూ సి ఎం,విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పల నరస, ఆర్. జగన్ మోహన్ రావు, ఎల్ సుందరరావు, కుడుముల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాసి ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన

**అరకు రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



అరకులోయ మండలం లో పట్టాసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు విస్తృతంగా జరిగాయి. దీనిలో భాగంగా మండలంలోని రణ జిల్లెడ గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ను పట్టాసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. పట్టాసి ఫౌండేషన్ చైర్మన్ పట్టాసి జగన్నాధరావు ఆదేశాల మేరకు పట్టాసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు మెడికల్ క్యాంపు ల్లో సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు. ఆయా ఉచిత వైద్య శిబిరాల్లో జనరల్ మెడిసిన్ ఎండి డాక్టర్ రవిశంకర్ ఆధ్వర్యంలో బృందం పాల్గొని చక్కని సేవలు అందించారు. ఈ సందర్భంగా పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధి పిపి నారాయణ మాట్లాడుతూ డాక్టర్ రవిశంకర్ బృందం ఏజెన్సీ ప్రాంతం లో మూడు రోజులుగా ఉచిత వైద్య సేవలను అందించి వారి మంచి మనసు చాటుకున్నారు అని కొనియాడారు. పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధులు పట్టాసి చలపతి రావు, సునీల్ కుమార్, పాస్టర్ ఏసుపాదం, జగ్జీవన్రావు, నారాయణ శామ్యూల్ లు ఈ సందర్భంగా డాక్టర్ రవిశంకర్‌ను శాలువతో ఘనంగా సత్కరించారు

## 20న జరిగే రాష్ట్ర వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

**అరకు రూరల్, మే 7, ప్రభాతవార్త**





అంగన్ వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటూ ఈనెల 20న జరగనున్న రాష్ట్రవ్యాప్త సమ్మె ను విజయవంతం చేయాలంటూ ఆల్లూరి జిల్లా అంగన్ వాడీ వర్కర్ల ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక శారదా నికేతన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్ వాడీ ఉద్యోగస్తులకు తీరని అన్యాయం చేస్తున్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయిస్తున్నాయని, కనీస వేతనాలు ఇవ్వలేని పరిస్థితని ఆమె అన్నారు. ముందస్తుగా ఎటువంటి శిక్షణలు ఇవ్వకుండా లేనిపోని యాప్ వర్కర్లతో అంగన్వాడి సిబ్బందిని వేధించుకొని తింటున్నారని, నెలలో 20 రోజులు పలు సమావేశాలు అంటూ పలు శిక్షణ లంటూ కార్యాలయాలు చుట్టూ తిరిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఆమె ప్రభుత్వంపై మండిపడుతున్నారు. అంగన్ వాడి ఉద్యోగులను స్కీమ్ వర్కర్ల కాకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పలు సమస్యలపై ఈనెల 20వ తారీఖున రాష్ట్ర వ్యా ప్త సమ్మె కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్ల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షబారాణి అల్లూరి జిల్లా అంగన్ వాడీ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్య దర్శి భాగ్యలక్ష్మి, అల్లూరి జిల్లా అంగన్ వాడి వర్కర్ల అధ్యక్షురాలు దురియా నాగమ్మ అంగనవాడి వర్కర్లు పాల్గొన్నారు.

## శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ

**- నేటి నుండి మూడు రోజులపాటు ఘనంగా ఉత్సవాలు**

**అరకులోయ, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**



అరకులోయ లో బుధవారం కలియుగ దైవం శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్స వాలకు సంబంధించిన గోడ పత్రికను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర లు ఆలయ ఉత్స వ కమిటీ ల చైర్మన్ లు పెట్టెలి దాసుబాబు, సివేరి బాలకృష్ణ, రెండు కమిటీల నాయకులు కామేష్, అప్పు, చందు పాడి, రామారావు, పైడిరాజు లతో కలిసి ఆవిష్కరించారు. శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్స వాలు నేటి నుండి మూడు రోజులపాటు అత్యంత ఘనంగా జరగనున్నాయి. దీనిలో భాగంగా గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర లు మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో మూడు రోజులపాటు జరగనున్న శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్స వాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆలయానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం పలు ఏర్పాట్లను ఆలయ, ఉత్స వ కమిటీలు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మూడు రోజులపాటు వినోద, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్స వాల్లో భాగంగా నేడు 8 వ తేదీ గురువారం సాయంత్రం శ్రీ వెంకన్న ఆలయ ప్రాంగణంలో వైభవోపేతంగా స్వామి వారి కళ్యాణ మహోత్స వం వేద పండితుల మంత్రార్చనల మధ్య భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరగనున్నట్లు ఈ సందర్భంగా ఆలయ ఉత్స వ కమిటీల చైర్మన్ లు పెట్టెలి దాసుబాబు, సివేరి బాలకృష్ణలు తెలిపారు. అలాగే స్వామి వారి కళ్యాణ మహోత్స వాలు పుట్ట మన్ను సేకరించి ఊరేగింపుగా ఆలయం కు వెళ్లే కార్యక్రమంతో ప్రారంభమయ్యాయని వారు తెలియజేశారు. అంతకుముందు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మత్స్యలింగం, చైర్మన్ దొన్నుదొర లు మొక్కను నాటారు. గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ ఉత్స వ కమిటీల నాయకులు, వైసిపి, టిడిపి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# బ్రిటిష్ వారిని ఎదిరించిన అల్లూరి త్యాగం చిరస్మరణీయం

**- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్**

**పాడేరు,మే 7, ప్రభాతవార్త:**

ప్రజలను బానిసలుగా చూస్తూ, వారిని అనగదొక్కిన బ్రిటిష్ వారిని ఎదిరించటంలో అల్లూరి త్యాగం చిరస్మరనీయమని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అల్లూరి 128 వ వర్ధంతి పురష్కరించుకొని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి కలెక్టర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారనీ, శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ ఉండేవనీ, మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేదనీ, అటువంటి సమయంలో మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాటం చెయ్యాలని అల్లూరి సీతారామ రాజు నిర్ణయించుకున్నాడని తెలిపారు. వారికి తమ హక్కులను వివరించి, వారిలో ధైర్యాన్ని పెంపొందించి, అన్యాయాలను ఎదిరించే విధంగా తయారుచేసాడన్నారు. అల్లూరి సీతారామ రాజుకు మన జిల్లాతో విడదీయరాని అబ్బుబంధం ఉందన్నారు.



ముఖ్యంగా రంపచోడవరం ఏజన్సీ లో చింతపల్లి పోలీస్ స్టేషన్ పై దాడి చేసి రికార్డులు చిమ్మేసి, తుపాకులు ఎత్తుకుపోయి రిజిస్టర్ లో నమోదు చేసి సంతకం పెట్టిన ధైర్య శాలి అన్నారు. అదేవిధంగా కృష్ణదేవిపేట, రాజవొమ్మంగి, అడ్డ తీగల పోలీస్ స్టేషన్లపై దాడి చేశారన్నారు. బ్రిటిష్ వారు అల్లూరిని ఎదుర్కోలేక చివరికి కాల్చి చంపారని చెప్పారు. అటువంటి మహానీయుడు తిరుగాడిన నేలపై మనం జీవిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఆయన పేరుతో ఏర్పడిన జిల్లాలో పని చేయడం సంతృప్తి గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం జె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ట్రైనీ కలెక్టర్, కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్, డి ఆర్ ఓ కె. పద్మలత, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రిటిష్ గుండెల్లో "పితూరి".. మన్యవీరుడు "అల్లూరి"





**కొయ్యూరు, మే 7, ప్రభాతవార్త**

దేశ స్వాతంత్రం కోసం, మన్య ప్రజల బానిస విముక్తి కోసం బ్రిటిష్ పాలకుల గుండెల్లో అల్లూరి సీతారామరాజు ఒక పితూరిలా మారారంటూ పలువురు నేతలు కొనియాడారు. మన్యవీరుడు అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి సందర్భంగా బుధవారం మండలంలోని అల్లూరి నడయాడిన మంప, రాజేంద్రపాలెం గ్రామాలలోని అల్లూరి స్మారక మందిరాల వద్ద అల్లూరి విగ్రహాలకు పూలమాలలు వేసి, నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంప, రాజేంద్రపాలెం గ్రామాలలో వేరువేరుగా జరిగిన కార్యక్రమాల్లో నేతలు మాట్లాడుతూ అల్లూరిని అందరూ ఆదర్శంగా తీసుకొని, చెడును ఎదిరించి, మంచిని సాధించాలన్నారు. వేరువేరుగా జరిగిన కార్యక్ర మాల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఏమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్, ఎంపీపీ బడుగు రమేష్ బాబు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు ఉమామహేశ్వరరావు, ఏపీ ట్రైకర్ డైరెక్టర్ కూడా కృష్ణారావు, బిజెపి జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి, బిజెపి నేతలు గాదె శ్రీనివాస్ నాయుడు, అల్లూరి గిరిజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి, మండల బిజెపి అధ్యక్షుడు సంపరి శివకుమార్, రాజేంద్రపాలెం, మంప సర్పంచులు పీట సింహాచలం, త్రినాధ్ మూర్తి పడాల్,పాడేరు మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ మంగ తల్లి పలువురు జిల్లా రాష్ట్రస్థాయి నేతలు కె.సురేంద్రమోహన్, రాష్ట్ర కార్యదర్శి అనకాపల్లి అధ్యక్షులు పరమేశ్వరరావు, విశాఖపట్నం అధ్యక్షులు పరశురామరాజు, అలాగే టిడిపి నేత అనిశెట్టి చిరంజీవి, పంప అల్లూరి వర్ధంతి వేడుక కమిటీ సభ్యులు శివరామరాజు, అప్పలకొండ, ఆగురు సత్తిబాబు, మంప, రాజేంద్ర పాలెం గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అల్లూరి వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన సింగవరం వేదికగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటును నిర్వాహకులు ఎంవివి ప్రసాద్, అంబటి నూకరాజు, వేణు, జంపా సురేష్ తదితరుల ఆధ్వర్యంలో ప్రారంభించారు.

# చేతిపంపులు త్రాగునీటిలో పురుగులు..

**- త్రాగునీటి పథక నీరు చాలక ఇక్కట్లు..**
**- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు మొర**

**రాజవొమ్మంగి, మే 7, ప్రభాతవార్త**

చెరుకుంపాలెం పంచాయితీ మిరియాలవీధి గ్రామంలో ఉన్న చేతిపంపులు ద్వారా వచ్చే నీరులో పురుగులు ఉంటున్నాయని, చేతిపంపులు మరమ్మతులకు గురైనాయని, సోలార్ త్రాగునీటి పథక నీరు చాలక ఇక్కట్లుకు ఎదుర్కొంటున్నామని గిరిజనులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ కు మొరపెట్టుకొన్నారు. బుధవారం చెరుకుంపాలెం సచివాలయం వద్ద జరిగిన పీసా కమిటీ గ్రామసభ అనంతరం అంబేద్కర్ తో మహిళలు మాట్లాడుతూ ఐదువేల లీటర్లు త్రాగునీటి సామర్థం గల సోలార్ త్రాగునీటి పథకం నీరు కూడా కేవలం 10 కుటుంబాలకు సరిపోతుందని మిగతా 60 కుటుంబాల వారికి నీరు ఉండటం లేదని కుంజం సరిత, మిరియాల చెల్లయ్యమ్మ ఇబ్బందులను వివరించారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ పథకంలో త్రాగునీటి పథకం టెండర్ ఖరారు కావాల్సి ఉందని సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు వివరించారు. చేతిపంపులు వెంటనే మరమ్మతులు చేయించడం జరుగుతుందని ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంప్రసాద్



స్పెషల్ ఆఫీసర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు, ఎంపిటిసి మీనవల్లి సుబ్బారావు, మార్కెట్ కమిటీ మెంబర్ గట్టు మాణిక్యం, పంచాయితీ కార్యదర్శి వరప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాంప్రసాద్, కుంజం చంద్రావతి, మిరియాల బాలు, మిరియాల కృష్ణవేణి, కుంజం సరిత, మిరియాలవీధి గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

# మినీ రైల్వేస్టేషన్‌తో తొలగనున్న ఇబ్బందులు

**- అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి**

**అరకులోయ, మే 7, ప్రభాతవార్త**

అరకులోయ లో రైల్వే రిక్వెస్ట్ స్టాప్ ప్రాంతం వద్ద మినీ రైల్వే స్టేషన్ కు రెండు కోట్ల అరవై లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని, దీంతో త్వరలో స్థానికంగా ఉన్న ఆటో, మోటార్ కార్మికుల ఇబ్బందులకు తొలగనున్నాయని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి అన్నారు. బుధవారం అరకులోయ లో ఎంపీ తనూజ రాణి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ అరకులోయలో మినీ రైల్వే స్టేషన్ నిర్మాణానికి రెండు కోట్ల 60 లక్షల రూపాయలు నిధులను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ విడుదల చేశారని చెప్పారు. స్థానిక ఆటో, మోటార్ కార్మికులు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ద్వారా తన దృష్టికి తీసుకు వచ్చారని ఎంపీ తెలిపారు. ఈ సమస్యపై తాను వెంటనే కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకువెళ్లానని, దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి ఏకంగా మినీ రైల్వే స్టేషన్ ను మంజూరు చేశారని ఎంపీ తెలిపారు. దీంతో స్థానికంగా సుమారు 100 ఆటో, మోటార్ కుటుంబాలు ఉపాధి పొందుతారని చెప్పారు. రైల్వే రిక్వెస్ట్ స్టాప్ వద్ద పాసింజర్ రైలు ఆగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తే, ఏకంగా మినీరైల్వేస్టేషన్ మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆటో, మోటార్ కార్మికుల సమస్యల పై స్పందించిన కేంద్ర రైల్వే



మంత్రి అశ్వినివైష్ణవ్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. కాగా మన్య ప్రాంతంలో ఉన్న రైల్వే సమస్యలను కూడా పరిష్కరించాలని ఈ సందర్భంగా రైల్వే మంత్రిని కోరినట్లు ఏం పి చెప్పారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ అరకలోయ లో ఆటో, మోటార్ కార్మికుల ఇబ్బందులు తొలగేలా కృషి చేసిన అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి కి, అలాగే మినీ రైల్వే స్టేషన్ ను మంజూరు చేసిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కి తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, నియోజకవర్గం వైసీపీ నాయకులు కమిడి అశోక్, కిరణ్ కుమార్, రామారావు, రాజ్ కుమార్, బాలరాజు, ప్రసాదు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు 9 మేకలు మృతి

**డుంబ్రిగుడ, రూరల్, మే 7, ప్రభాతవార్త**



మండలంలోని అరమ పంచాయతీ జుర్రిపాడు గ్రామంలో బుధవారం మేత కోసం అటవీ ప్రాంతంలో తీసుకెళ్లి ఉండడంతో ఉరుములు మెరుపులతో కూడిన పిడుగు పడటంతో సీదరి ఆనంద్‌రావుకు చెందిన మేకలు పిడుగు పాటుకు గురువై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఆ రైతు ఆర్థికంగా తీవ్ర నష్టం కలిగిందని తనకు ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో విప్లవ వీరునికి ఘన నివాళులు

**రాజవొమ్మంగి, మే 7, ప్రభాతవార్త**



రాజవొమ్మంగి అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి కార్యక్రమం ది రాజవొమ్మంగి అల్లూరి ప్రెస్‌క్లబ్ వారు నిర్వహించారు. భాగంగా పాఠశాల ప్రాంగణంలో ఉన్న అల్లూరి కాంస్య విగ్రహానికి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తూపాటి వీర్రాజు, అధ్యక్షులు అరిపాక సూరిబాబు పూలమాలలను వేసి ఘన నివాళులు అర్పించారు. సీతారామరాజు పోరాట స్ఫూర్తి చిరస్మరనీయమని తూపాటి వీర్రాజు అన్నారు. మండల విద్యాధికారి టి. సూరయ్య రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్, ఉదయ్ సీతారామరాజు విగ్రహానికి పూలమాలలను వేశారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి అల్లూరి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు టి వీర్రాజు,అధ్యక్షులు ఎ సూరిబాబు, సభ్యులు బొడారపు శ్రీనివాస్, ఈకా శ్రీనివాస్, కరాసు శ్రీనివాస్, యు లక్ష్మణ్( మెడికల్స్ ), పాపాని బద్రి, ,పోలిన సత్తిబాబు, అప్పన్న, ఆలీఖాన్, పూర్వ విద్యార్థులు, గ్రామ వాసులు శేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు గారి వర్ధంతి సందర్భంగా వారికి కొండపల్లి గ్రామస్తులు పరిశిక వెంకటేశ్వరావు, శాంతి పాప దంపతులచే ప్రతిష్టించబడిన అల్లూరి విగ్రహానికి పరిశిక అప్పన్నబాబు పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీరబోయిన సన్యాసిరావు, పరిశిక. వెంకటేశ్వరావు, శాంతిపాప దంపతులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అల్లూరి యువ సేన సభ్యులు పాల్గొన్నారు.

## మళ్ళీ వాయిదా పడిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం

**రంపచోడవరం, మే 7, ప్రభాతవార్త**

మే నెల 13వ తారీకు న జరగవలసిన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం అనివార్య కారణాలవల్ల వాయిదా అయినదని అదేవిధంగా జూన్ మూడో తారీకు మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు

# ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా నర్సీపట్నంలో భారీ కార్యక్రమం

**- స్పీకర్ అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో ప్రతిజ్ఞ**

**నర్సీపట్నం,మే 7,ప్రభాతవార్త**

భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా నర్సీపట్నంలో బుధవారం ఎన్టీఆర్ స్టేడియం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో భారీ మద్దతు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహం ఎదుట భారత సైన్యానికి సంపూర్ణ మద్దతుగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ, గత రాత్రి ఉగ్రవాదులపై భారత సైన్యం ప్రతీకార దాడులకు పూర్తి మద్దతుగా నిలుస్తున్నట్టు తెలిపారు. పహల్గామ్ లో పర్యాటకులపై జరిగిన దారుణ కాల్పులు, 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడి దేశాన్ని షాక్ కు గురి చేసిందని, అలాంటి దుర్మార్గులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి తగిన శాస్త్రి తప్పదని స్పష్టం చేశారు. ఉగ్రవాద దాడులకు



భారతదేశం ఏ విధంగానూ భయపడదని, దేశ భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలకూ ప్రజలు వెన్నుదన్నుగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీ లవారు, అనివార్గాలవారు మద్దతుగా నిలవాలని స్పీకర్ కోరారు. భారతదేశం ఎప్పుడూ శాంతియుత దేశంగా వ్యవహరిస్తుంది. కానీ అణగారినదిగా చూడటం, దాడులకు పాల్పడటం సరి కాదు అని స్పీకర్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం లో దేశ ప్రజలంతా భారత సైన్యానికి అండగా నిలుస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం వార్డ్ కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, ధనమిరెడ్డి మధు, డబ్బీరు శ్రీకాంత్ వార్డ్ ఇన్చార్జిలు నాగేంద్ర రాజు, చింటూ, నేరెళ్ల రాజేష్, మార్కెట్ రాజా, మహిళలు, యువత ఇతరలు పాల్గొన్నారు.




## అల్లూరి సీతారామరాజుకి బిజెపి నాయకుడు నివాళి

**రోలుగుంట, మే 7, ప్రభాతవార్త**



విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు శత వ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెములో గల అల్లూరి సీతా రామరాజు స్మారక భవనములో రోలు గుంట మండల బీజేపీ మండలధ్యక్షులు పచ్చిగోళ్ళ ఈశ్వరరావు సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతి కార్యక్రమం

**నర్సీపట్నం,మే 7,ప్రభాతవార్త**

నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం యుటిఎఫ్ నర్సీపట్నం డివిజన్ సీనియర్ నాయకులు చిట్టియ్య మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఆయన నడయాడిన ఈ ప్రాంత ప్రజలు ఈ ప్రాంతంలో గల అనేక ప్రజా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. భారత దేశ దాస్య శృంకలాలు చేదించడం కోసం చిన్న వయసులోనే తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహానుభావుడు అల్లూరి సీతారామరాజు అని, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అగ్గిపిడుగు ఆంధ్రుల విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు నర్సీపట్నం కృష్ణదేవిపేట చింతపల్లి, కొయ్యూరు, రాజవొమ్మంగి మొదలగు ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తృతంగా రైతాంగాన్ని సేకరించి ఆనాడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై బ్రిటిష్ వారి మీద పోరాటం చేశారు సాంప్రదాయ ఆయుధాలు తోనే ఆ రోజుల్లో అత్యాధునిక ఆయుధాలు కలిగిన బ్రిటిష్ వారి మీద పోరాటం చేయడం అనేక విజయాలు సాధించడం నేటికీ ఆయన గొప్ప యుద్ధ వ్యూహాలుగా ఈ ప్రాంతంలో చెప్పుకుంటారన్నారు.



అలాంటి మహనీయుడు భౌతికంగా ఎప్పుడో మనకు దూరమైనా ప్రజల అందరి మనసులలో తరతరాలుగా ఆయన పేరు మారుమోగుతూనే ఉంటుంది కనుకనే ఆయన చరిత్ర సువర్ణక్షరాలతో భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ ప్రస్థానంలో లిఖితమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ శ్రీను, రమణ, అల్లూరి అభిమాని ముజాబ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..!

**- మరో వ్యక్తికి తీవ్రగాయాలు**

**నక్కపల్లి, ప్రభాతవార్త**

మండలంలోని వేంపాడు జాతీయ రహదారి పైన బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.! అందించిన వివ



రాలు ఇలా ఉన్నాయి.. కాకినాడ రూరల్ మండలం వలసపాకల గ్రామానికి చెందిన అనసూయ వెంకట అనిల్ (26) తన స్నేహితుడు పింకే తేజలు కలిసి ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం వెళ్లేందుకు బయలుదేరారు. వేంపాడు జంక్షన్ వద్దకు వచ్చేసరికి వారి నడుపుతున్న వాహనం అదుపుతప్పడంతో డివైడర్ ను కొట్టిన సంఘటనలో తీవ్రంగా గాయపడ్డారు. అనిల్‌కు తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నారని తెలిపారు. తేజ

# ఉగ్రవాదుల స్థావరాలపై యుద్ధం చేస్తున్న సైనికులకు సలాం

**మాకవరపాలెం, మే 7, ప్రభాతవార్త**

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి రోజునే పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేయడం శుభ పరిణామం అని టిడిపి సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మండల టిడిపి అధ్యక్షుడు ఆర్ వై పాత్రుడు ఆధ్వర్యంలో మండల టిడిపి



నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాయుడు మాట్లాడుతూ కాశ్మీర్లో విహారయాత్ర కెళ్ళిన సామాన్య జనం పై దాడి చేసి 26 మందిని పొట్టన పెట్టుకున్న పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను ఏరివేత కార్యక్రమానికి మండల ప్రజలు సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. బ్రిటిష్ వారిపై అలుపెరుగని పోరాటం చేసిన మన్యం వీరుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి రోజున ఉగ్రవాదుల స్థావరాలపై మెరుపు దాడి చేసిన భారత సైన్యానికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సెల్యూట్ కొట్టారు. పాకిస్తాన్ స్థావరంగా చేసుకుని సామాన్య ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటున్న ముష్కరులను అంతమొందిచలన్నారు. సీతారామరాజు వర్ధంతి సందర్భంగా మాకవరపాలెం మండల బిజెపి పార్టీ అధ్యక్షులు మర్రి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పాల్గొని సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి కట్టించారు. కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి వబ్బలరెడ్డి గోవింద టిడిపి నాయకులు పోతల రాంబాబు, లాలం రాము, రుత్తల వెంకటేశ్వరరావు (జమిందార్) యర్రంశెట్టి వెంకటరమణ, సిద్ధ బత్తుల శ్రీను, చిటికెల బుచ్చి రాంప్రసాద్, దుబాసి వెంకటగిరి సుర్ల గౌరీ శంకర్రావు, తదితరులు పాల్గొనగా బిజెపి నాయకులు, రాంబాబు,కోడూరు డాక్టర్, తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌కి సమ్మె నోటీసు

**నర్సీపట్నం,మే 07,ప్రభాతవార్త**

ఈనెల20న జరిగే దేశవ్యాప్త సమ్మె నేపథ్యం లో ఏపి మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం నర్సీపట్నం మున్సిపల్ జంపా సురేంద్రకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ మే 20న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేసారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకై, మున్సిపల్ కార్మికులను పర్మినేంట్ చేయాలని, జనాభాకు తగిన పారిశుద్ధ్య కార్మికలను నియమిం



చాలని,మరణించిన కార్మికుల కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించాలన్నారు. కోవిడ్ లో పని చేసిన కార్మికులను తీసుకోవాలని కోరారు. అలాగే ఇంజనీరింగు విభాగం కార్మికులకు ఇతర కార్మికులవలే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ సమస్యలపై మే 20 న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీ ఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, యూనియన్ నాయకలు బోర్రా శ్రీను, రమణ, కుపరాల హేమంత్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి శత జయంతి ఉత్సవాలు

**అనకాపల్లి, మే 7, ప్రభాతవార్త**



పట్టణంలో 1925 లో స్థాపించిన 100 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆలయంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం మహోత్సవాలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారి పల్లకి ఊరేగింపు అమ్మవారి నామ భజన సంకీర్తనలతో, మేళ తాళాములతో వైభవంగా తిరువీధి మహోత్సవం జరిగింది. నిత్య ప్రార్థనలు, గోపూజ, శ్రీ నగరేశ్వర స్వామి శ్రీ జనార్ధన్ స్వామి వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తికి భక్తులచే బియ్యాభిషేకం, శ్రీ అమ్మవారికి లక్ష మల్లెపూలతో అర్చన, సామూహిక లలిత సహస్ర నామ స్తోత్ర పారాయణం, భారీ అన్న సమారాధన, ఆలయం చుట్టూ వెండి రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తో 102 రకాల స్వీట్లు తో ప్రదర్శన జరిగింది, శ్రీ అమ్మవారికి ఊంజల్ సేవ, కోలాటము . ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణకుమార్, కార్యదర్శి, కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, భక్తులు తదిరులు పాల్గొన్నారు

## ఉపాధి హామీ పనులపై ఎండిఓ దెందుకూరు సమీక్ష .!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



మండలంలోని ఉపాధి హామీ పనులపై బుధవారం ఎండిఓ దెందుకూరి సీతారామరాజు టెక్నికల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న పనులు విషయంలో ప్రతిరోజు ఎన్ని దినాలు చేస్తున్నారు. అనుకున్న లక్ష్యాలు సాధిస్తున్నారు లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. అత్యధిక పని దినాలు నమోదు అయ్యేటట్లు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని చీడిక, ఉద్దండపురం, డిఎల్ పురం, అమలాపురం పంచాయతీల్లో ఫారం పాంట్స్ ఏర్పాట్లకు సంబంధించి పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఈ నీటి తొట్టెలను చూసి సంతృప్తి అర్థం చేశారు. ఆయనతోపాటు ఏపీవో భాగ్యలక్ష్మి కార్యదర్శిలు మూర్తి, అప్పలరాజు తదితరులు ఉన్నారు.



## అల్లూరికి ఘనమైన నివాళి..

**గొలుగొండ మే 7 ప్రభాతవార్త**

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి సందర్భంగా ఏఎల్ పురం అల్లూరు పార్కులో అల్లూరి గంటల సమాధుల వద్ద పుష్పగుచ్చాలు ఉంచి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున అధికారులు అధికారికంగా వర్ధంతి నిర్వహించారు. పార్కులో మాజీ పోలీస్ అధికారి కరణం సత్యనారాయణ, ఏ ఎల్ పురం సర్పంచ్ లోచుల సుజాత, సిపిఐ చోద్యం చీడుకొమ్మల్లో ఉన్న అల్లూరి విగ్రహాలకు నివాళులర్పించారు. అల్లూరి పోరాటపాటిమని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకోవాలని యువత ఉద్యమ స్ఫూర్తిని తెలుసుకొని జీవితంలో లక్ష్యాలకు నిర్దేశంగా మార్చుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



## విద్యార్థినులను అభినందించిన హోం మంత్రి "అనిత"

**నక్కపల్లి, ప్రభాతవార్త**

10వ తరగతి ఫలితాల్లో ఊహించిన ఫలితాలు సాధించిన నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బొడ్డు స్వాతి, గాయత్రి లను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అభినందించారు. తన క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో



ఇటువంటి మంచి మార్కులు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సుందరావులను ప్రశంసించారు. ఇప్పటికే బాలికల ఉన్నత పాఠశాలకు మంచి గుర్తింపు ఉందని, అదే స్ఫూర్తిగా భవిష్యత్తులో మరిన్ని ఫలితాలు సాధించాలని హోంమంత్రి అనిత అన్నారు.

## శరభవరంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ

**రోలుగుంట, మే 7, ప్రభాతవార్త**

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం శరభవరం గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి ఈ ఖరీఫ్ లో రైతులు అందరు నవధాన్యాలు వేసి ప్రకృతి వ్యవసాయం చెయ్యాలని, ప్రతి ఒక్క రైతు వివరాలు ఆధార్ నెంబర్,ఖాతా నెంబర్,సర్వే నంబర్,ఫోన్ నెంబర్ మొదలైన



వివరాలను ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు అందజేయాలనీ, నవధాన్యాలు వేసిన రైతు వివరాలు సంబంధించిన ళిళీరిజుతితి,జుబీతి లకు అందజేసి ఇ పంట నమోదు చేసుకోవాలని నర్సీపట్నం డివిజన్ వినీతి ।దిగి చిన్నా,నర్సీపట్నం డివిజన్ మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరావు,జుతితి శ్రావణి తెలియజేసారు.ప్రకృతి వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించిన బెస్ట్ రైతులు రోకల రాజుకి,చేబోలు శ్రీనుకి గ్రామ సభలో గ్రామ చర్పంచ్ దాసరి రాజులమ్మ ఘనంగా సన్మానం కార్యక్రమం చేశారు.మరియు బెస్ట్ రైతుల అనుభవాలను గ్రామ సభకు వచ్చిన రైతులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వినీతి చిన్నా,డివిజన్ లీగి నాగేశ్వరరావు,జుతితి శ్రావణి,వెలుగు దితి రమణి,మండల ఇంచార్జ్ మోదీనాయుడు,నిర్మలా,ఐ. సి.ఆర్.పి లు హాజరైనారు.

## చిరస్మరణీయుడు అల్లూరి : జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు మంజు

**అనకాపల్లి, మే 7, ప్రభాతవార్త**

విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు అన్నారు. బుధవారం తిమ్మరాజు పేట గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం కు నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరంలో అల్లూరి చూపిన తెగువ, పోరాటం



నేటి యువత స్ఫూర్తి గా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గవర కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు బీవీ రమణ, మాజీ సర్పంచ్ సూరి శెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిటిసి, ఉప సర్పంచ్ చేతులమేదుగా పవర్ ట్రాక్టర్లు పంపిణీ

**రోలుగుంట, మే 7, ప్రభాతవార్త**

అనకాపల్లి జిల్లా రోలుగుంటలో కూటమి ప్రభుత్వం అధికారులు వచ్చిన తర్వాత ప్రియతమ నాయకులు చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు ఆధ్వర్యంలో రోలుగుంట ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ నాయకత్వంలో రైతులకు సబ్సిడీపై పవర్ కిల్లర్ ట్రాక్టర్లు ఇవ్వడం జరిగింది. ఈ సబ్సిడీ పై ఇంప్లిమెంట్స్ వ్యవసాయ పనిముట్లు ఇవ్వటం వలన రైతులందరూ



హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోలుగుంట గ్రామానికి చెందిన రైతుకు సబ్సిడీపై పవర్టిల్లర్ ట్రాక్టర్ ను ఈరోజు ఎంపిటిసి రామకృష్ణ అందజేస్తూ మా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు అన్నివిధాలా శ్రేయస్కరంగా ఉందని దానికి నిదర్శనం మా రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అది చూసిన మాకు ఎంతో ఆనందంగా ఉందని తన భావాన్ని తెలియజేశారు.

## విప్లవ వీరులు అల్లూరికి ఘన నివాళులు

**నక్కపల్లి, ప్రభాతవార్త**

స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు శ్రీ అల్లూరి సీతారామరాజు గారి 101 వ వర్ధంతి సందర్భంగా నక్కపల్లి సిఐటియు కార్యాలయం వద్ద ఆయన చిత్ర పటానికి సిపిఎం




జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులోనే బ్రిటిష్ వారు కి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు అల్లూరి అని, అల్లూరి నేటి యువతరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అని కొనియాడారు, ఆయన ఆశయ సాధనకు నేటి యువతరం ముందు కు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ప్రసాద్,వై.అప్పారావు,వై.సత్తిబాబు, ఎస్.శ్రీను,రాజు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

**నక్కపల్లి, ప్రభాతవార్త**

మండలంలోని చిన్న దొడ్డి గళ్ళు గ్రంథాలయంలో పర్యావరణ పై అవగాహన కార్యక్రమాన్ని రిసోర్స్ పర్సన్ ఈ కళ్యాణి బుధవారం నిర్వహించారు వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు పురస్కరించుకుని గ్రంథాలయ అధికారి కే .జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణి విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా





కళ్యాణి పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంచుదాం, నీటిని రక్షిద్దాం, శక్తిని కాపాడుకుందాం, చెట్లను పెంచుదాం, నీటిని పొదుపు చేద్దాం,అలాగే విటమిన్స్ ఏ బి సి డి వలన కలుగు పర్యసనాలు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు వీటి అంశాలు మీద చార్ట్ రూపంలో విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలు సిబ్బంది వి .రమణమ్మ ,వివిధ పాఠశాలల చెందిన 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సి ఐ" రామకృష్ణ"

**నక్కపల్లి, ప్రభాతవార్త**

జాతీయ రహదారిపై ఆటో నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్. రాయవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ లొడ్డు రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం



సాయంత్రం అడ్డురోడ్డు కూడలిలోని తుని, నర్సీపట్నం, యలమంచిలి, రేవుపోలవరం ఆటో స్టాండ్ లోని ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. జిల్లా యస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లు ఆటోలలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించకూడదని అలా ఎక్కిస్తే కేసులు తప్పు అని చెప్పారు. నిబంధనలను దాటి ప్రయాణికులు లెక్కిస్తే ఆ విధంగా ఆటో కనిపించిన డ్రైవర్పై కేసు నమోదు చేస్తామని తెలిపారు. నర్సీపట్నం వెళుతున్న ఆటో కోటఉరట్ల సమీపంలో అధికంగా ప్రయాణికులు ఎక్కించడం వలన ప్రమాదానికి గురైందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రయాణికుల భద్రత దృష్ట్యా పోలీసు శాఖ ముందస్తు చర్యల్లో భాగంగా అవగాహన కల్పిస్తున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు ఎస్సై రమేష్ ఉన్నారు.

## 79వ వార్డు టిడిపి అధ్యక్షుడిగా కరణం జగదీష్



**అగనంపూడి, ప్రభాతవార్త**

79వ వార్డు టిడిపి అధ్యక్షులుగా జగదీష్‌ను ఎన్నుకున్నారు.బుధవారం వార్డులో టిడిపి కార్యకర్తల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు సత్యారావు ఆశీస్సులతో పదవి రావడం సంతోష కరమని,అందర్నీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషిచేస్తానని తెలిపారు.

## అల్లూరికి నివాళులర్పించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి

**రంపచోడవరం, మే 7 ప్రభాతవార్త**



భారతదేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేసి అసువులు బాసిన అల్లూరి సీతా రామరాజునీ దేశ ప్రజలందరూ ఎప్పటికి గుర్తు చేసుకునే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడ వరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి పురస్కరించుకొని అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం మాట్లాడుతూ భారత దేశ స్వతంత్రం కోసం బ్రిటిష్ వారిపై ఈ ప్రాంత గిరిజనులతో పోరాటం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. దేశం కోసం బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు గుర్తుగా జిల్లాకి అల్లూరి సీతారామరాజు జిల్లా అని నామకరణం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. దేశం కోసం పోరాటం చేసి బ్రిటిష్ వారి చేతుల్లో తుపాకి గుండ్లతో అల్లూరి సీతారామరాజు మరణించడం జరిగిందని అదేవిధంగా దేశంలోని ప్రతి భారతీయ పౌరుడు అల్లూరి సీతారామరాజునీ ఎప్పటికీ గుర్తుపెట్టుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి వివిధ కార్యాలయాలకు సంబంధించిన అధికారులు సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డి ఎన్ వి రమణ, డీఈ చైతన్య, ఎస్ టి ఓ పాపారావు, సీనియర్ అకౌంటెంట్ శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ శాఖ సూపరిండెంట్లు బి.కిషోర్, రాజారెడ్డి, ఐటీడీఏ మేనేజర్ బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం..

### - తరలి వచ్చిన ఆర్యవైశ్యులు.. అమ్మవారికి ప్రత్యేక పూజలు

**నక్కపల్లి, ప్రభాతవార్త**





ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన కార్యక్రమాన్ని నక్కపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కక్కిరాల సురేష్ ,కొత్త సందీప్ ల ఆధ్వర్యంలో ఉదయకాలంలో ఓంకారం, సుప్రభాతం అనంతరం అష్టోత్తర శతనామావళి పూజా కార్యక్రమాన్ని ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా చేరుకొని నిర్వహించారు. ముందుగా నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళ్యాణ్ మండపం నుంచి అన్ని వీధిలో అమ్మవారిని ఊరేగించారు. పూజా కార్యక్రమం అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో గౌరవ అధ్యక్షులు మామిడి తాతాజీ, కొత్త సాయిరాం, నున్న పత్తికొండ, గణేష్ ,విశ్వేశ్వరరావు, బాబ్జి, లక్ష్మణ్, సుబ్రమణ్యం, నరసింహమూర్తి, నున్న గుప్త, ప్రముఖ వ్యాపారవేత్త నన్ను వాసు, కొత్త భగవాన్, కొత్త రాము, పచ్చి పులుసు అయ్యప్ప, పచ్చిపులుసు నాగేశ్వరరావు కొత్త సత్యేంద్ర ,పలువురు ఆర్యవైశ్య మహిళలు పాల్గొని ప్రసాదాలు పంపిణీ చేశారు.

## అల్లూరిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

**అనకాపల్లి, మే 7, ప్రభాతవార్త**



విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. వెంకటాపురం గ్రామంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా అల్లూరి చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో నేటి యువత ప్రజా సమస్యలపై పోరాడాలని గని శెట్టి పిలుపునిచ్చారు. స్వాతంత్రం కోసం 27 సంవత్సరాల వయసులోనే ప్రాణాలను పణంగా పెట్టారని బ్రిటిష్ పాలకులను ఎదిరించి సాయుధ పోరాటం చేసిన మన్యం విప్లవ వీరుడు అని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కడియం సూరి గోవిందరావు, బలిరెడ్డి శ్రీనివాసరావు, సుందరపు మురళి రావు, సుందరపు సత్యనారాయణ, చిన్ని రాంబాబు,గొర్లి అర్జున,ఎస్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

## అల్లూరికి జిల్లా పోలీసుల ఘన నివాళి

**అనకాపల్లి, మే 7, ప్రభాతవార్త**



విప్లవ వీరుడు, స్వాతంత్ర్య దీప్తి అల్లూరి సీతారామరాజు గారి 101వ వర్ధంతిని పురస్కరించుకొని, అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఇతర అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాభివందనలు సమర్పించి, మౌనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు మాట్లాడుతూ "స్వాతంత్రం కోసం సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన అల్లూరి, బ్రిటిష్ శాసనాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడి, వారికి చైతన్యం కలిగించిన ఈ మహానుభావుడు భారత స్వాతంత్ర్య పోరాటానికి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. డిఎస్పీ బి.మోహనరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, గఫూర్, ఎస్సైలు ప్రసాద్, శిరీష, అంజిబాబు, విశ్వనాథం, మదీనా వల్లి, సహా ఇతర అధికారులు, సిబ్బంది పుష్పార్చనలు చేశారు.

## ఖరీఫ్ సీజన్ కై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

**కొయ్యూరు మే 7 ప్రభాతవార్త**



మండలంలోని కొండగోకిరి సచివాలయంలో బుధవారం ప్రస్తుత ఖరీఫ్ సీజన్ 2025 కి సంబంధించి మండల వ్యవసాయ అధికారిణి ఉమాదేవి ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారిణి ఉమాదేవి పచ్చిరొట్ట విత్తనాలు, వాటి లాభాలు గురించి రైతులకు వివరించారు. ముఖ్యంగా ఈ విత్తనాలు వల్ల అధిక భూసారం పెంపొందించడమే కాకుండా నేలలో ఉన్నటువంటి సూక్ష్మ, మరియు స్థూల పోషకాల స్థాయిని కూడా పెంచవచ్చునన్నారు. అదేవిధంగా రసాయన ఎరువులుకు ప్రత్యామ్నాయంగా రైతులందరూ కూడా ఈ పచ్చిరొట్ట విత్తనాలను తీసుకోవాలని కోరారు. అధిక దిగుబడులు తద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఉందని రైతులకు సూచించారు. దీనిలో భాగంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ సంబంధించి జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఇవి ఒక ఎకరాకు 10 కేజీలు చొప్పున రైతులు వేసుకోవాలని కూడా వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సత్యనారాయణ, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## దోమలు మందు పిచికారీకి సహకరించాలి: ఎంపిడిఓ

**రాజవొమ్మంగి, మే 7, ప్రభాతవార్త**



దోమలు మందు పిచికారీకి ప్రతీ ఒక్కరూ వైద్య సిబ్బంది సహకరించాలని ఎంపిడిఓ. లోకుల యాదగిరేశ్వరరావు అన్నారు. బుధవారం రాజవొమ్మంగి. పి. హెచ్. సి పరిధిలో గల దాకరాయి గ్రామంలో పిచికారీ జరిగింది. 85 గృహాల్లో గల 208 గదులుల్లో పిచికారీ పూర్తి అయ్యిందని డా. సుష్మ తెలిపారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ రాజు, డా. సుష్మ, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్, ఎం.టి.ఎస్ సోమరాజురెడ్డి, సి హెచ్ ఓ పద్మావతి, ఎంపిహెచ్ఎస్ లు సుధాకర్, లక్ష్మమ్మ, ఏ.ఎన్.ఎం సత్యవతి, సూర్యాకాంతం, హెల్త్ అసిస్టెంట్లు లక్ష్మయ్య, గఫూర్ సత్యనారాయణ, శ్రీనివాస్. ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# 9.80 కోట్లతో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు నిర్మాణం

### - జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

**డుంబ్రిగుడ, రూరల్ 7, ప్రభాతవార్త**



జిల్లాలో 9.80 కోట్ల వ్యయంతో ఐదు ఎకరాల్లో 36 యూనిట్లతో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు నిర్మిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం డుంబ్రిగుడ మండలం అరకు సంతబయలు వద్ద ఐదు ఎకరాల్లో నిర్మిస్తున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎఫ్ ఎస్ సిలు ఏర్పాటుతో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్లో అరకు బ్రాండ్ పేరున కాఫీ, మిరియాలు, పసుపు ,చిరుధ్యాన్యాలు, ఇతర గిరిజన ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎంఎస్ఎం ఇలను ప్రోత్సహిస్తామన్నారు. రూ.500 కోట్లతో పరిశ్రమల పార్కులు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. గొలుగొండ మండలంలో పరిశ్రమల పార్కు ఏర్పాటు చేయడానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ 250 ఎకరాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆర్టీసి చైర్మన్ దొన్ను దొర మాట్లాడుతూ కుటీర పరిశ్రమల ఏర్పాటు తో గిరిజన యువతకు ఆర్థిక పురోగతికి దోహద పడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజక వర్గంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందన్నారు.రానున్న రోజుల్లో అరకు వ్యాలీ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అరకు సర్పంచ్ శారదా సాగర్, స్థానిక నేతలు సుబ్బారావు, మాజ ఎంపిపి దనేరావు, ఎంపిడి ఓ ప్రేమసాగర్, ఎపిఐఐసి అధికారులు పాల్గొన్నారు.

# ఫోరెన్సిక్ ఎవిడెన్స్ దర్యాప్తు అధికారులకు వర్క్‌షాప్

**పాడేరు, మే 7, ప్రభాతవార్త**



నేరం చేసిన నింధితులు ఎట్టి పరిస్థితులలో తప్పించుకోకూడదు అని నేరం చేసిన వారికి తప్పకుండా శిక్షపడేలా చూడాలి అంటే నేరస్థుడు నేరస్థలంలో వదిలిన భౌతిక సాక్ష్యాధారాలను సేకరించు విధానంపై మరియు ధర్యాప్తు చేయు విధానంలో అధునాతన టెక్నాలజీ సహాయంతో సాక్ష్యాలను సేకరించు విధానాలపై మంచి నైపుణ్యం కలిగి ఉండాలనే సదుద్దేశంతో రాష్ట్ర డి.జి.పి.హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఫోరెన్సిక్ వీక్ ఆంధ్రపదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. ఈ నేపధ్యంలో బుదవారం అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్.పి అమిత్ బర్దర్ ఆద్వర్యంలో పోలీసు న్ఫరెన్స్ హాల్ల్ పాడేరులో ఏ.ఎస్.ఆర్ జిల్లా నందు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి ప్రముఖ నిపుణులచే ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మ్యానేజ్మెంట్ పై శిక్షణ నిర్వహించారు. ఈ క్రమంలో నేర స్థలంలో నార్కోటిక్స్, మత్తుపధార్థాలు, వివిధ రకాల విషాలను,సైబర్ నేరాలు, ఆడియో వీడియో, వివిధ పత్రాలు, భౌతిక సాక్ష్యాధారాలు, డి.ఎన్.ఏ., రక్త నామూనాలు, మానవ అవయవాలకు సంబందించిన వాటిని ఏవిధంగా సేకరించాలి, ఏ విధంగా వాటిని ప్యాకింగ్ చేయాలి, ఏ విధంగా భద్రపరిచి ఏ విధమైన ప్రశ్నలతోకూడిన లెటర్ ఇవ్వాలి మొదలగు అంశాలపై ప్రముఖ నిపుణులైన అధ్యాపకులచె పైన తెలిపిన అంశాల గురించి క్షుణ్ణంగా వివరించడంతోపాటు అధికారుల అడిగిన అనుమానాలను నివృత్తి చేసారు. ఈ కార్యక్రమానికి ఏ.ఎస్.పి లు పంకజ్ కుమార్ మీనా, నవ్ జ్యోతి మిశ్రా, డి.ఎస్.పి లు ఎస్.కె.సహహబజ్ అహ్మద్, జి.సాయి ప్రశాంత్, ఇన్స్పెక్టర్లు బి.అప్పలనాయుడు, సంజీవరావు, ముక్తేశ్వరరావు, ఇతర పోలీస్ అధికారులు హాజరయ్యారు.

## జిల్లా ఏవోబీలో ఎన్‌కౌంటర్

### - పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు ఇద్దరు మావోయిస్టులు మృతి?

**పాడేరు/చింతూరు,మే7, ప్రభాతవార్త:**

అల్లూరి జిల్లా పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగటంతో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్టు తెలుస్తోంది.ఈ ఎన్ కౌంటర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఏజెన్సీలో కొనసాగుతున్న కూంబింగ్ మావోయిస్టు కీలక నేత జగన్ అలియాస్ పండన్న మృతి మావోయిస్టు జగన్‌పై రూ.20 లక్షల రివార్డ్ మరో మావోయిస్టు రమేష్ మృతీ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఎన్కౌంటర్ జరిగిన ప్రదేశానికి పోలీస్ బలగాలు తప్పా ఎవరు వెళ్ళ లేని పరిస్థితి ఏ ప్రదేశంలో యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. ఎన్కౌంటర్‌లో మృతి చెందిన ఇద్దరా? లేదా ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది గురువారం పోలీస్‌లు వెల్లడించాల్చి ఉంది. సంఘటనా ప్రదేశంలో రెండు 147 వేపన్స్ లభ్యమైనట్లు తెలుస్తోంది.

## బైక్ ఢీ: ఒక వ్యక్తి మృతి.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**





మండలంలోని చిన్నదొడ్డిగల్లు జాతీయ రహదారిపై అదుపుతప్పి ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు.! అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన నల్ల బారిక శివ (37 మండలం లోని చిన్నదొడ్డిగల్లు జాతీయ రహదారి పక్కనే ఉన్న మామిడికాయల పాకలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి రోడ్డు దాటుతుండగా తుని నుంచి విశాఖపట్నం వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించేందుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బంధువులు ఫిర్యాదు మేరకు ఎస్సై సన్ని బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏ ఎస్ ఆర్ పబ్లిక్స్ స్కూల్‌లో ఘనంగా అల్లూరి వర్ధంతి వేడుక

**అరకులోయ, మే 7, ప్రభాతవార్త**

అరకులోయ అల్లూరి సీతారామరాజు సి.బి ఎస్ ఈ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు 101 వ వర్ధంతి వేడుక ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా ఏఎస్ఆర్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏ ఎస్ఆర్‌సీబీ ఎస్ ఈ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జి వి నరసయ్య మాట్లాడుతూ అల్లూరి ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత అల్లూరి అంకితభావం నుండి ప్రేరణ పొందాలన్నారు. అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడన్నారు. విప్లవ జ్యోతిగా, పోరాట యోధినిగా, మన్యం వీరునిగా అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎన్ శ్రీనివాసరాజు, పి ఆర్ ఓ పి.వి.ఎస్.ఎన్.ఆర్ వర్మ పాల్గొన్నారు.



# మనందరం సివిల్ డ్రెస్ లో ఉన్న సైన్యం - ప్రజల రక్షణ భాద్యత మనదే

### - జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

**పాడేరు, మే 7, ప్రభాతవార్త**




యుద్ధ సమయంలో మనందరం సివిల్ డ్రెస్ లో ఉన్న సైన్యంలా విధులు నిర్వహించి ప్రజలను రక్షించే భాద్యత చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాక్‌డ్రిల్‌పై నిర్వహించిన సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల పెహల్గాంలో జరిగిన దుశ్శన్ఘటన నేపధ్యంలో భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధం నెలకొనే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో భారత ప్రధాని నరేంద్ర మోడీ... యుద్ధం సంభవిస్తే ఎదుర్కొనె విధానాలు, యుద్ధ సమయంలో చేయాల్సిన, చేయకూడని విధులు, రక్షణ భాద్యతలు గూర్చి దేశ వ్యాప్తంగా బుధవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించినట్లు గుర్తు చేసారు. యుద్ధ ప్రాంతాలను మూడు కేటగిరీలలో విభాజించారని, మూడో కేటగిరిలో ఉమ్మడి జిల్లా ప్రధాన కేంద్రం విశాఖపట్నం ఉందని తెలిపారు. యుద్ధం జల, వాయు,భూ మార్గాలలో జరిగే అవకాశం ఉందన్నారు. దానిని ఎదుర్కొనేందుకు, ప్రజలను రక్షించేందుకు అందరూ సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనధికార, ఫేక్ వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వార్తలు ప్రచారం చేసి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయవద్దని కలెక్టర్ కోరారు. అధికార వార్తలను మాత్రమె నమ్మాలని సూచించారు. పంచాయతి శాఖ ద్వారా సరైన సమాచారం సచివాలయ స్థాయి వరకు విస్తరింప జేయాలని సూచించారు. ఇంజినీరింగ్, ఆర్టిసి విభాగాలు ప్రోక్లైనర్లు, జేసిబిలు ఇతర అవసరమైన పరికరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. అదేవిధంగా సోషల్ మీడియాలో వచ్చిన ప్రతి వార్తను చెక్ చేయకుండా ఫార్వార్డ్ చేయొద్దని కోరారు. మనందరం బలంగానే కాదు, ఐక్యంగా ఉండాలని ఎస్పి సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం జె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ట్రైనీ కలెక్టర్, కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్, డి ఆర్ ఓ కె. పద్మలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ రిజిస్ట్రేషన్‌లు వేగంగా పూర్తిచేయాలి

**రాజవొమ్మంగి, మే 7, ప్రభాతవార్త**



అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు మూడు విడతల్లో ప్రభుత్వం అందించే ప్రోత్సాహంకు రైతు వివరాలు రిజిస్ట్రేషన్ పనులను వేగంగా పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి చక్రధర్ సచివాలయ వ్యవసాయ సహాయకులకు సూచించారు. బుధవారం రాజవొమ్మంగి మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది. సుఖీభవ పథకంలో ఒక్కో రైతుకు కేంద్ర ప్రభుత్వం పి. యం. కిసాన్ రూ. 6 వేలు, అన్నదాత సుఖీభవలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 14 వేలు సాగు సహాయం ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో గల 5, 800 రైతులు వివరాలు రిజిస్ట్రేషన్ పూర్తి అవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ. ఓ చక్రధర్, ఏ. ఇ. ఓ భవాని, సచివాలయ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రారంభమైన శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్సవాలు

### - పల్లకిలో ఊరేగింపుగా పుట్టమన్ను

**అరకులోయ, మే 7, ప్రభాతవార్త**



అరకులోయ పట్టణంలో బుధవారం కలియుగ దైవం శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 11వ తేదీ వరకు జరగనున్న స్వామి వారి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు సాయంత్రం ఆలయ ఉత్సవ కమిటీల నాయకులు పుట్ట మన్నును సేకరించి పల్లకిలో ఊరేగింపుగా స్వామి వారి ఆలయానికి తీసుకువచ్చారు. దీంతో శ్రీ వెంకన్న కళ్యాణ మహోత్సవాలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. కాగా నేడు సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు : జిల్లా ఎస్పీ బర్దర్:

**పాడేరు,మే7, ప్రభాతవార్త**

అల్లూరి సీతారామ రాజు జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సూచనల మేరకు, అడిషినల్ ఎస్పి (అడ్మిన్) పర్యవేక్షణలో, వై.రామవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూమకొండ, గంగకొండ అటవీ ప్రాంతాల మధ్యలో పోలీసు పార్టీలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా బుధవారం మధ్యాహ్నం సమయంలో ఆకస్మాత్తుగా మావోయిస్టులు, పోలీసు పార్టీల మీదకి కాల్పులు జరపగా వెంటనే పోలీసు తమ ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు జరిపారని జిల్లా ఎస్పీ అమిత బర్దర్ ఒక రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఈ ఘటనలో సిపిఐ (మావోయిస్ట్) పార్టీకి చెందిన ఇద్దరు పురుషుల మృతిచెందారని తెలిపారు. చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను ఇంకా గుర్తించ వలసి ఉందనీ మిగిలిన మావోయిస్టుల కోసం గాలింపు కొనసాగు తోందన్నారు. ఈ చుట్టు ప్రక్కప్రాంతాలలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినట్లైతే వెంటనే పోలీసువారికి తెలియజేయవలసిందిగా అయన కోరారు. మావోయిస్టులు ఎవరైనా పోలీస్‌ల ఎదుట లొంగిపోవాలి అనుకుంటే అల్లూరి జిల్లా పోలీస్ అందుకు సిద్ధంగా ఉన్నారని ఎస్పీ స్పష్టం చేసారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీవాసవి మాత పుట్టినరోజు వేడుక

**అరకులోయ, మే 7, ప్రభాతవార్త**



అరకలోయ శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో. బుధవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు వేడుక భక్తిశ్రద్ధలతో జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవిమాత పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన సహస్ర కుంకుమార్చనపూజలో ఆర్యవైశ్య మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# చింతూరులో ముగిసిన పోలవరం గ్రామసభ

### - ఫేజ్ 1బి లో పూర్తి ఐన మొత్తం గ్రామసభలు

### - ఊపిరి పీల్చుకుంటున్న నిర్వాసితులు

**చింతూరు, మే 7, ప్రభాతవార్త**



పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న గ్రామాల్లో ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తుంది. ఫేస్ 1 బి లో 32 గ్రామాలు ఉండగా అధికారులు విజయవంతంగా 32 గ్రామాల్లో గ్రామసభలను నేటితో పూర్తి చేశారు. ఫేస్ 1బి లో చివరిది చింతూరు గ్రామసభ బుధవారం విజయవంతంగా ముగిసింది. చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామ సభకు మొత్తం నిర్వశితులు తరలివచ్చారు. గ్రామసభలు పూర్తి అవ్వటంతో అధికారులతో పాటు నిర్వాసితులు కూడా ఊపిరి పీల్చుకున్నట్లు అయింది.బుధవారం చింతూరులో జరిగిన ఈ గ్రామసభ పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చింతూరు మండల కేంద్రంలో 30వ ( ఆఖరి) ఆర్ ఆర్ గ్రామ గ్రామ సభలో మొదట అర్హుల మరియు అనర్హుల జాబితాను అధికారుల, ప్రజా ప్రతినిధులు, మీడియా మిత్రుల, మరియు నిర్వాసితుల సమక్షంలో చదివి వినిపించారు. చింతూరు గ్రామంలో మొత్తం 1808 పిడిఎఫ్ లు ఉండగా 1641 మందిని అర్హులు గాను 167 మందిని అనర్హులుగా గుర్తించారు. చింతూరు లో నివసిస్తూ రెండు జాబితాలో పేర్లు లేని వాళ్ళ నుండి ప్రాజెక్ట్ అధికారి దరఖాస్తులు స్వీకరాంచారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు జాబితాలో పేర్లు లేని వాళ్లను కూడా మాన్యువల్ గా జాబితాలో చేర్చి వారికి కూడా అర్ ఆర్ ప్యాకేజీ అందించాలని ఇప్పటికీ సూచించరు. రెండు జాబితాలో పేర్లు లేని వారిని కచ్చితంగా అర్ ఆర్ ప్యాకేజీ జాబితాలో చేర్చటం జరుగుతుంది అని ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు. ఈ గ్రామ సభతో పోలవరం ప్రాజెక్టు ముంపుకు గురి అవుతున్న ఫేజ్ 1బీ లో ఉన్న 32 గ్రామాలకు విజయవంతంగా ఆర్ఆర్ గ్రామసభలు నిర్వహించడం జరిగినది. మొత్తం ఈ 32 గ్రామాలకు సంబంధించి మొత్తం 13807 పిడిఎఫ్‌లు గాను 12468 మందిని అర్హులుగా మరియు 1339 మందిని అనర్హులుగా గుర్తించడం జరిగినది అని ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు వారు పేర్కొన్నారు. మండలాల వారిగా మొత్తం పిడిఎఫ్ లు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామసభలో తీసుకున్న అభ్యంతరాలను మరో పదిరోజులలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. తదుపరి ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు వారు త్వరలోనే ముంపుకు గురి అవుతూ 41.15 కాంటూరు లో చేర్చాని గ్రామాలను కూడా ఇరిగేషన్ టెక్నికల్ టీం తో సర్వే చేయించి వాటిని కూడా 41.15 కాంటూరు లో చేర్చి ఆ గ్రామాల నిర్వాసితులకు కూడా ఆర్ అర్ ప్యాకేజీ అందించే విధంగా కృషి చేయటం జరుగుతుంది అని ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు వారు పేర్కొన్నారు. ఇన్ని రోజులు గ్రామసభలకు సహకరించిన ప్రజా ప్రతినిధులకు, మీడియా మిత్రులకు మరియు ప్రజలకు ధన్యవాదాలు అని చెప్పినారు. ఈ చింతూరు గ్రామసభ లో చింతూరు సర్పంచ్ కారం కన్నరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బాలకృష్ణారెడ్డి, నజరయ్య, ఆంజనేయులు, తహసీల్దార్ లు చిరంజీవి, శ్రీనివాస్, చింతూరు ఎంపీడీవో, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త
25 Glorious years

## అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభ



కొమరాడ, మే 7, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు 101 వర్ధంతి సభను రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆ సంస్థ జిల్లా కమిటీ సభ్యులు కద్రక వెంకటస్వామి అధ్యక్షతన కొమరాడ మండలం బల్లపాడు గ్రామంలో బుధవారం నిర్వహిం చారు. గిరిజన కళాకారుల గిరిజన నృత్య రూపకాలు డప్పులు డాన్స్‌లతో సభ ప్రారంభమైంది. సభకు విచ్చేసిన ప్రధానవక్త రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ గిరిజనుల తరపున పోరాడిన అల్లూరి సీతారామరాజుని కాంగ్రెస్, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు ఆ రోజుల్లో బందిపోటుగా ముద్ర వేసి అసలైన స్వతంత్ర పోరాటాన్ని మేమే చేసామని వాటికున్న పలుకుబడితో ప్రచారం చేసుకున్నాయని ఇప్పటికీ అదే అబద్ధపు ప్రచారం చేస్తున్నారని అన్నారు. గిరిజనుల అనేక పోరాటాల ఫలితంగా ఆశ్రమ పాఠశాలలు, 1/70 చట్టం, పీసా చట్టం జిసిసి వంటి సంస్థలు ఏర్పడ్డాయి. వీటిని కూడా ఈనాడు పాలక ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయి జీవో నెంబర్ 3 రద్దు అందులో భాగమే అని అన్నారు. రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను నాయుడు,రైతు కూలీ సంఘం నాయకులు మోనంగి భాస్కరరావు, పి.అసిరి, హిమారిక విన్నారావు, చాషిములియా ఆదివాసి సంఘం నాయకులు నిమ్మక కృష్ణమ్మ, కేంద్రుక సుబ్బారావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవ వేడుకలు..

శృంగవరపుకోట, మే 7, ప్రభాతవార్త



మండలంలోని బొడ్డవర గ్రామంలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత ఘనంగా జరిగాయి. ఉదయం ఏడు గంటల నుంచి స్వామి వారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేడుకల్లో గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న పలు గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.స్వామి వారికి అభిషేకాలు ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు దొంతుకుర్తి సాయి కుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఆలయ వార్షికోత్సవ వేడుకలను ప్రతీ ఏటా అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కార్యవర్గ సభ్యులు తెలిపారు.



## పచ్చిరొట్టతో మేలైన లాభాలు

### నేల సారవంతానికి దివ్యౌషధంలా ఉపయుక్తం

గరివిడి మే,7 ప్రభాతవార్త

పచ్చిరొట్ట వలన పంట భూమికి మేలైన లాభాలు సమకూరుతాయని గరివిడి మండల వ్యవసాయ అధికారి వి.శైలజ అన్నారు.రైతులు నేలకు తగినంత సేంద్రియ పదార్థాన్ని అందించేందుకు పచ్చిరొట్టను వాడటం సులువైన ,చౌకైన పద్ధతని ఆమె పేర్కొన్నారు. మండలంలోని గెడ్డపు వలస గ్రామంలో బుధవారం పచ్చి రొట్ట, నవధాన్యాలు విత్తనాలు కిట్లను తయారు చేసి రైతులకు పంపిణీ చేసిన సందర్భంగా ఆమె పచ్చిరొట్ట విత్తనాలు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎరువుల ఖర్చు తగ్గుతుందని, నేల సారవంతం అవుతుందని, పంటకు బలం చేకూరుతుందని, సూర్య రశ్మి తాకిడికి సూక్ష్మ జీవులు చనిపోకుండా నివారించవచ్చని ఆమె వివరించారు. మినుము, జనుము,పిల్లి పెసర,జీలుగు, నవధాన్యాలు వంటి పైర్లు పెంచ వచ్చని పేర్కొన్నారు రైతులు భూమి సారవంతానికి విధిగా పచ్చిరొట్ట ను మడుల్లో ముందుగా వేసుకోవాలన్నారు. అలాగే పూత సమయానికి భూమి లో కలియ దున్నే ఎరువు గా ఉపయోగించు కోవచ్చని స్పష్టీకరించారు.

## వైభవంగా వాసవి కన్యకాపరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలు

గరివిడి, మే,7 ప్రభాతవార్త



వాసవి కన్యకాపరమేశ్వరి మాత జయంతి ఉత్సవాలు స్థానిక వాసవి మాత ఆలయంలో వైభవంగా జరిగాయి. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకొని అభిషేకాలు చేసారు. ఆర్య వైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షులు వివిఎస్ఎస్ఎన్ గుప్తా దంపతులు అమ్మవారికి పంచామృత అభిషేకాలు చేసారు.భక్త జనావళి అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి అనుగ్రహానికి ప్రాప్తులయ్యారు.

## కొత్త కమీషనర్‌కు 6వ వార్డు మహిళల విన్నపాలు



సాలూరు, మే,7 ప్రభాతవార్త

సాలూరు పట్టణ 6వ వార్డు దాసరివీధి,అగురువీధి, కోటవీధి మహిళలు బుధవారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి తమ వార్డులో డ్రైనేజీ సదుపాయం లేక వర్షం పడితే మురుగునీరు ఇళ్లల్లోకి వస్తుందని కమీషనర్ కృష్ణారావుకు విన్నవించారు.అసలు విషయంలోకి వెళితే దుర్గామాత గుడి సమీపంలో పుష్కర వీధిలో ఉన్న గ్రూప్ హౌస్ దగ్గర నుండి మున్సిపల్ 15 ఫైనాన్స్ జనరల్ నిధులతో కొత్తగా కాలువ నిర్మాణం మున్సిపల్ అధికారులు ప్రారంభించారు.దాని వలన 6 వార్డులో ఉన్న స్థానికుల ఇళ్లల్లో ఉన్న మురుగునీరు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారడంతో ఈ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందిస్తూ అక్కడికి రేపు వచ్చి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని ఆ వార్డు మహిళలకు భరోసా కల్పించారు. ఈ సమస్యను కొత్త కమీషనర్ ఎలా పరిష్కరిస్తారో వేచి చూద్దాం. డి ఈ వరప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్య విలువ విద్యావంతులకే తెలుసు-ఆపదలో ఆపద్బాంధవుడు

### గొప్ప మనసును చాటుకుంటున్న గొంప..

శృంగవరపుకోట, మే,7 ప్రభాతవార్త




మంచి భవిష్యత్తు మంచి ఉద్యోగం మంచి సంపాదన ఉండాలంటే ముందు విద్య ఉండాలి.మరి కొందరు వ్యాపారం చేసి సంపాదిస్తారు.అయితే వ్యాపారానికి కూడా కాస్తంత విద్య అవసరం ఉండాలి. ఏదైనా ఉద్యోగ సంపాదనకు వ్యాపార సంపాదనకు ముందు విద్య ఎంతైనా అవసరం. కొంత మంది డబ్బు సంపాదనలో మునిగిపోతారు. పేదల విద్యకు తనవంతు సహాయం అందించడంలో విద్యావంతులు, వ్యాపార వేత్త టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంపక్రిష్ణ ఉన్నారనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇటీవల మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన తెరపల్లి ఈశ్వరరావు కుమార్తె రోషిణి ఎస్.కోట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షల్లో మండలంలోనే రోషిణి ప్రథమ స్థానంలోనే నిలిచింది. రోహిణి ప్రతిభను గుర్తించి గొంప ఆమెకు ఐదు వేల నగదు ప్రోత్సాహంతో పాటు రోహిణి ఏ కార్పోరేట్ కళాశాలలో చదవినా 50శాతం ఫీజును స్వయంగా భరిస్తానని ఆమె కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అలాగే మహిళలకు కుట్టు మిషన్ల ద్వారా శిక్షణ అందించారు. ఉచితంగా పలువురు మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

## బాలల మనోవికాశానికివిజ్ఞాన తరగతులు మేలు : వాణి




రామభద్రపురం, మే,7 ప్రభాతవార్త

రామభద్రపురంలో వేసవి విజ్ఞాన తరగతుల కార్యక్రమంలో భాగంగా ముందుగా విద్యార్థులు గ్రంధాలయంలో పుస్తక పఠనం చేయడం జరిగింది. తదుపరి లైబ్రేరియన్ బి.సత్య వాణి ఆధ్వర్యంలో విద్యార్థినులకు శారీరక ఉల్లాసం పెంచే మ్యూజికల్ చైర్స్ పోటీని నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు మెదడుకు పదును పెట్టే కారమ్స్ , లూడో, వైకుంఠ పాళీ వంటి ఆటలు ఆడించడం జరిగింది.

## రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

### జిల్లాలో పార్టీని సమన్వయంతో నడిపించాలి -టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జునకు సూచించిన చంద్రబాబు -అమరావతిలో చంద్రబాబును కలిసిన నాగార్జున



చీపురుపల్లి, మే,7 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబును విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున బుధవారం అమరావతి సచివాలయంలో కలిశారు. ఇటీవల తనకు ఉమ్మడి విజయనగరం జిల్లా డిసిసిబి అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు చంద్రబాబుకు నాగార్జున కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో రాజకీయ, పరిపాలనకు సంబంధించి పలు అంశాలను నాగార్జునను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పార్టీని సమన్వయంతో నడిపించాలని సూచించారు. ప్రజల కోసం కష్టపడి పని చేయాలని అన్నారు. డీసీసీబీపై పూర్తి అవగాహనా ఏర్పాటు చేసుకొని రైతులకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. గత పాలకులు సహకార సంఘాలలో అనేక అక్రమాలు చేశారన్నారు. రైతులకు ఉపయోగపడేలా డిసిసిబి సేవలను ఉమ్మడి జిల్లాలో విస్తృతం చేయాలన్నారు. కష్టపడి పని చేయాలని మంచి భవిష్యత్తు ఉంటుందని నాగార్జునకు చంద్రబాబు భరోసా ఇచ్చారు.

## రేపు విద్యుత్ సరఫరాకు ఈ గ్రామాల్లో అంతరాయం

గజపతినగరం, మే 7ప్రభాతవార్త

ఈనెల 9వ తేదీ శుక్రవారం గజపతినగరం సబ్‌స్టేషన్ లో మరమ్మత్తు పనులు చేపడుతున్న కారణంగా ఆరోజు(రేపు) ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గజపతినగరం సబ్ స్టేషన్ మీద గల గజపతినగరం, ఎం.వెంకటాపురం, పురిటిపెంట, పిడిశీల, దోలపాలెం ,సీతారాంపురం, శ్రీరంగరాజపురం, మధుపాడ, మరుపల్లి, తమ్మ రాయుడుపేట, ఎం.గుమ్మడం గంగచోళపెంట, పట్రువాడ, కొత్త బగ్గాం, పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడిపేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు బొబ్బిలి ఆపరేషన్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఏ.అనంతరావు బుధవారం తెలిపారు. ఈ గ్రామాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.



## అదనంగా రుణాలు మంజూరు చేయండి

కొమరాడ, మే 7, ప్రభాతవార్త

కొమరాడ మండలానికి ప్రభుత్వం కేటాయించిన బిసి రుణాలకు అదనంగా మరికొన్ని అందివ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్, కొమరాడ మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ఉదయ శేఖర్ పాత్రుడు కోరారు.బుధవారం అమరావతిలో ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణను కలిసి ఈ మేరకు విన్నవించినట్లు శేఖర్ పాత్రుడు తెలిపారు. రుణాల మంజూరుకు ప్రిన్సిపల్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించినట్లు శేఖర్ పాత్రుడు చెప్పారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెర్లాం, మే 7, ప్రభాతవార్త

స్థానిక అడ్డురోడ్ జంక్షన్ దగ్గర మంగళవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఇది. స్థానిక ఎస్సై సాగర్ బాబు కథనం ప్రకారం అడ్డురోడ్ జంక్షన్ దగ్గర మంగళవారం రాత్రి 10 గంటలకు దాటిన సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. అయితే ఆ వ్యక్తి ఎవరిని తెలియ రావడంలేదని అలాగే ఢీకొన్న వాహనం కూడా ఎవరిది అని తెలియడం లేదని ఈ విషయమై దర్యాప్తు చేపట్టామని ఆయన తెలిపారు.ఒకవేళ ఆ వ్యక్తి ని గుర్తించి బంధువులు గానీ కుటుంబీకులు ఎవరైనా వచ్చి తమనీ సంప్రదించవచ్చునని ఆయన వివరించారు.

## గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు

తెర్లాం, మే 7, ప్రభాతవార్త



స్థానిక గ్రంథాలయంలో వేసవిజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి విద్యార్థులకు నీతి కథలు చిట్టి పొట్టి కథలు జాతి పిత నేతల వీరగాథలు కాళిదాసు రచించిన మేఘ సందేశం పలు రకాల నీతి బోధన కథలు చదివించారు. అలాగే క్యారమ్స్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సమావేశంలో బహుమతులు అందజేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు పాఠకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## చామలాపల్లి మాజీ సర్పంచ్ మృతి

వేపాడ, మే 7, ప్రభాతవార్త

మండలంలోని చామలాపల్లి గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్ కుంచి భారతమ్మ బుధవారం సాయంత్రం 4.15 గంటలకు మృతి చెందారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న భారతమ్మ ఇంటివద్దనే చికిత్స పొందుతూ పరిస్థితి క్షీణించడంతో మృతి చెందారు. ఆంధ్రజ్యోతి సీనియర్ పాత్రికేయుడు కుంచి కోటేశ్వరరావు సతీమణి అయిన భారతమ్మ సర్పంచ్‌గా విశేష సేవలు అందించి ఉత్తమ సర్పంచ్ అవార్డును పొందారు.

## స్టూడెంట్ కిట్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు

మెరకముడిదాం, మే 7, ప్రభాతవార్త



మెరకముడిదాం 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్ యొక్క మండల స్టాక్ పాయింట్ అయిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెరకముడిదాం ను విజయనగరం జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు అయిన సీఎమ్ఓ వి ఆదినారాయణ, అసిస్టెంట్ సీఎం ఓ ఎ. రామారావు సందర్శించి ఎంతవరకు వచ్చిన స్టాక్ పాఠ్య పుస్తకాలను, నోటు పుస్తకాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. రూమ్ ప్లాన్ ప్రకారం స్టూడెంట్ కిట్ ఐటమ్స్ వారీగా ఏర్పాట్లు బాగా చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎం చంద్రశేఖర్, టి ధర్మశ్రీ, సి ఆర్ ఎం టి లు, ఎమ్మార్సీ స్టాఫ్, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్ పాల్గొన్నారు.

## నాటుసారా రహిత గ్రామంగా 'పోరాం'



గజపతినగరం, మే 7, ప్రభాతవార్త

సర్కిల్ పరిధిలోని మెంటాడ మండలం పోరం గ్రామాన్ని నాటు సారాయిరహిత గ్రామముగా ప్రకటించినట్లు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జే.జనార్దన్ రావు తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం పోరాం గ్రామంలో ఎంపీపీ కె.సంధ్య ఆధ్వర్యంలో , ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బి.అరుణ కుమారి, వివోఏ కె. కృష్ణవేణి, మహిళా పోలీస్ ఆర్. రాధలతో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించగా కమిటీ ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.గ్రామ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయంతో పోరాం గ్రామాన్ని నాటుసారాయి రహిత గ్రామంగా నిర్ధారించడం జరిగిందన్నారు.

## డైట్ లెక్చరర్‌గా కాళ్ల అప్పారావు మాస్టారు ఎంపిక

నెల్లిమర్ల, మే 7, ప్రభాతవార్త



నెల్లిమర్ల నగర పంచాయితీ జరజాపుపేట గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కాళ్ల అప్పారావు ఇక్కడి వేణుగోపాలపురంలోని ప్రభుత్వ డైట్ కళాశాల లెక్చిరర్ గా (తెలుగు) ఎంపికయ్యారు. అప్పారావు ప్రస్తుతం మండలంలోని మొయిద విజయరాంపురం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 2012 డిఎస్‌సిలో ఉపాధ్యాయుడిగా ఎంపికయిన అప్పారావు తొలుత మెరకముడిదాం మండలం భైరిపురం ఉన్నత పాఠశాలలో చేరారు. ఆ తర్వాత కొద్ది కాలం గరివిడి మండలం కోనూరు పాఠశాలలో పనిచేసి అక్కడ నుంచి మొయిద విజయరాంపురం బదిలీపై వచ్చారు. ఈయన పోస్టు గ్రాడ్యుయేషన్ (ఎకనామిక్స్) కోర్సును భీమవరం డిఎస్ఆర్ కళాశాలలో పూర్తిచేశారు. ఎం.ఇడి,ఫిలాసఫీ కోర్సులను ఆంధ్ర యూనివర్శిటీలోనూ అభ్యసించారు. డైట్ లెక్చరర్ పోస్టునకు ఇటీవల నిర్వహించిన పరీక్షలో మంచి మార్కులు సాదించి లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అదికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన సుమారు 3 సం.కు పైగా డెప్యూటీ పై డైట్ లెక్చరర్ గా కొనసాగనున్నారు. డైట్ లెక్చరర్‌గా అప్పారావు మాస్టారు ఎంపిక కావడం పట్ల మొయిద ఉన్నత పాఠశాల హెచ్ఎం బేతా మహాలక్ష్మి సహోపాధ్యాయు, జరజాపుపేట గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

## అభ్యంతరకర వ్యాఖ్యలపై ఎంపీడీవోకు వినతి పత్రం



మక్కువ మే 7 ప్రభాతవార్త

జిల్లా జాయింట్ కలెక్టర్ సమక్షంలో జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఈనెల రెండవ తేదీన జరిగిన సమీక్ష సమావేశంలో పంచాయతీ కార్యదర్శులపై జిల్లా జాయింట్ కలెక్టర్ చేసిన వ్యాఖ్యలపై పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ద్వారా జిల్లా గ్రామపంచాయతీ అధికారికి పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత కోరుతూ వినతిపత్రం అందజేయడం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు రమేష్, కే సురేష్ మార్పినీ శంకర్, వేణు గోపాల్ సీతామాలక్ష్మి పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి : మాజీ డి సీఎం

సాలూరు,మే 7 ప్రభాతవార్త



భారతదేశ బ్రిటిష్ తెల్లదొరల వలస పాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేసిన అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని మాజీ డిప్యూటీ సీఎం పీడిక.రాజన్నదొర కొనియాడారు. బుధవారం మన్యం విప్లవకారుడు అల్లూరు సీతారామరాజు వర్ధంతి సందర్భంగా డిప్యూటీ సీఎం నివాసం వద్ద అల్లూరి చిత్ర పటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతు బ్రిటిష్ శాసనానికి ఎదు రునిలిచి,ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడని స్పష్టం చేశారు.అలాగే స్వాతంత్ర చరిత్రలో అల్లూరు సీతారామరాజు జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని పేర్కొన్నారు. వైసీపీసర్పంచులు,ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా



పాచిపెంట, మే 7 ప్రభాతవార్త

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తులకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున నలుగురికి 40 వేల రూపాయలుజరిమాన బుధవారం సాలూరు మెజిస్ట్రేట్ జె.ఎఫ్.సి.ఎం.జి హర్షవర్ధన్ విధించినట్లు ఎస్సై వెంకట్ సురేష్ తెలిపారు. వీరు నలుగురు పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలోని వారిని తెలిపారు. అలాగే రెండవ సారి దొరికిన యడల 6 నెలలు జైలు శిక్ష విధించబడుతుంది మెజిస్ట్రేట్ కోర్టు హెచ్చరించారు, అని పాచిపెంట ఎస్సై వెంకట సురేష్ తెలియపరిచినారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



### ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల, మే 7, ప్రభాతవార్త

నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంఎల్ఎ లోకం నాగమాదవి అన్నారు. నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేట 1వ వార్డు ఎస్సికాలనీలో 2.5 లక్షల రూపాయిల 15వ ఆర్థిక సంఘం నిదులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆమె బుధవారం భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీ వాసులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అన్ని సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తామని అన్నారు. సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం, తాగు నీటి సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆమె వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం నెల్లిమర్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుల నుంచి ఆశీర్వాదం అందుకున్నారు. ఈ కార్యక్రమాల్లో నగర పంచాయితీ చైర్ పర్సన్ బంగారు సరోజని, వైస్ చైర్మన్ లు సముద్రపు రామారావు కారుకొండ కృష్ణ, 1వ వార్డ్ కౌన్సిలర్ కింతాడ కళావతి, జనసేన పార్టీ నాయకులు కరుమజ్జి గోవిందరావు, ఎం ఎం నాయుడు, మద్దిల అప్పన్న, మాత మురళీకృష్ణ, అవనాపు మురళీకృష్ణ, జన ప్రసాద్ పాంద్రంకి సత్యనారాయణ, డొంక కృష్ణ, సుంకర ముత్యాలనాయుడు, కాళ్ల మహేష్ రవ్వా నాని, గదల అచ్చం నాయుడు, ఎడ్ల గోవిందరావు అప్పికొండ రవి కుమార్, నగర పంచాయతీ కమిషనర్ ఏ. తారక్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రోటోకాల్ పాటించాలి..

### సర్వసభ్య సమావేశంలో హౌసింగ్ ఉపాధి ఐసిడిఎస్ అధికారులపై మండిపడిన ప్రజా ప్రతినిధులు అధికారులు - పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు అన్న ఎంపీపీ వైస్ ఎంపీపీ

దత్తిరాజేరు, మే 7, ప్రభాతవార్త



విధి నిర్వహణలో ఉన్న మండల అధికారులు ప్రోటోకాల్ పాటించాలని ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు అన్నారు మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలోమండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు ముందుగా వివిధ శాఖ అధికారులు తన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరు కొరకు ఇచ్చిన దరఖాస్తును చెత్త బుట్టలో పడేస్తున్నారని జడ్పిటిసి సభ్యులు రౌతు రాజేశ్వరి హౌసింగ్ ఏ.ఇ పై ఆగ్రహం వ్యక్తం చేశారు గడసాం గ్రామంలో వైసీపీ ప్రభుత్వంలో రజకులకు ఇచ్చిన ఇల్లు స్థలాన్ని బిసి కులానికి చెందిన వ్యక్తి ఆక్రమించి న వారికి ఇల్లు బిల్లు చేశారని వైసీపీ నాయకుడు నేతటి వెంకట్ రమణ ఏ ఇ ని అడగగా పసుపు బిల్ల ఉన్న వారికే ఇల్లు మంజూరు చేసి బిల్లులు చేస్తున్నరన్నారు మిమ్మల్ని తీసుకువచ్చిన వాళ్ళకే పనులు చేస్తారా మిగతా ప్రజాప్రతినిధులకు చేయరా అని ఎంపీపీ ఏ. ఇ ని నిలదీశారు ఉద్యోగంలో పనితీరు మార్చుకోకపోతే మూల్యం తప్పదని హెచ్చరించారు ఉపాధి కూలీలకు గిట్టుబాటు రాలేదని ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించడం లేదని అలాగే చినకాద గ్రామంలో క్షేత్ర సహాయకురాలు అత్యుత్సాహంతో వర్క్ ఐడి లేకుండా ఉపాధి కూలీలతో పనులు జరిపించి మస్టర్లు వేస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకుడు మరార్జీ ఏపీవో పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాన్ని వారం రోజుల్లో మార్చకపోతే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రౌతు రాజేశ్వరి. వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు మిత్తిరెడ్డి రమేష్ నాయుడు మాజీ జెడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు పాల్గొన్నారు.

## సత్యవమ్మ పేరంటాలు తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్



లక్కవరపుకోట, మే 7, ప్రభాతవార్త

మండలము లోని ఎల్ కోట తలారి గ్రామంలో మే 9 శనివారం రోజున నిర్వహించే సత్యవమ్మ పేరంటాలు తీర్థం సందర్భంగా జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌ని నిర్వహి స్తున్నట్లు తీర్థ నిర్వాహకులు గుమ్మడి సత్యన్నారాయణ గుమ్మడి రామకృష్ణలు తెలిపారు ఈ టెస్ట్ ఉదయం 8 గంటల నుంచి మొదలవుతుందని ఈ పోటీలలో గెలుపొందిన వారికీ మొదటి బహుమతి 10 వేలు ముమ్మన రమణ రెండవ బహుమతి 6 వేలు కొట్యాడ ప్రకాష్ రావు జ్ఞాపకార్థం కుమారుడు లోకేష్ మూడవ బహుమతి 5 వేలు కొట్యాడ రాంబాబు నాల్గవ బహుమతి 4500 నాగుబిల్లి అప్పలరాజు 5వ బహుమతి 4000 పల్లా బుజ్జి ఇలా పది బహుమతులు 3వేలు 25000 /2000/ 1500 /1000 మొత్తం బహుమతులు స్పాన్సర్స్ ద్వారా అందజేస్తామని తెలిపారు అలాగే మధ్యాహ్నము ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్నట్లు సత్యన్నారాయణ తెలిపారు అలాగే సాయంత్రం జిల్లా స్థాయి గుర్రపు పంధాలు సాంస్కృతిక కార్యక్రమము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ తలారీ గ్రామం లో సత్యవమ్మ పేరంటాలు ఆలయ ప్రాంగణంలో జరువుతుందని అన్నారు.

## రాయితీపై పశు దాణా పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోళ్ల

లక్కవరపుకోట, మే 7, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం పశువుల ఆరోగ్యం మరియు ఉత్పత్తిని కాపాడటానికి రాయితీ పై పశువులకు నాణ్యమైన దాణా సరఫరా చేయడంలో భాగంగా 50% సబ్సిడీ తో పాడి రైతులకు సరఫరా చేస్తున్న పశువుల దాణా పంపిణి బుధవారం పశువైద్య చికిత్సాలయం, లక్కవరపుకోటలో శృంగవరపుకోట నియోజకవర్గ శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి చేతులమీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రైతును అన్ని రకాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వము అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు అలాగే పాడి రైతులుకు సబ్సిడీపై తక్కువ ధరకి పోషక విలువ్వలతో కూడిన దాణా 50 కిలోల దాణా సంచి ఖరీదు రూ.1110 అయితే సగం ధరకే 555లకె అందిస్తుంది అన్నారు తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి పాడి రైతు ఈ సబ్సిడి దాణా పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ కె గాయత్రీ టీడీపీ నాయకులూ కొట్యాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న అంగన్వాడిల సమ్మె



కురుపాం, మే 7, ప్రభాతవార్త

కార్మికుల హక్కుల పోరాటం కోసం రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 20న అంగన్వాడీలు సమ్మె చేస్తున్నట్లు అంగన్వాడీ కార్యకర్తల జిల్లా అధ్యక్షురాలు పి సరోజ తెలిపారు బుధవారం ఐసిడిఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారికి సమ్మె నోటీసుఅందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము కార్మిక సంఘాలను నేలమట్టం చేయాలని చూస్తుందని దీన్ని వ్యతిరేకిస్తూ సంఘాలన్నీ ఏకమై ఈనెల 20న సమ్మె చేయుటకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలకు ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలను ప్రభుత్వ పరిష్కరించట్లేదని వాటిని వెంటనే పరిష్కరించాలని ఆమె అన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

## అయ్యప్ప చెరువు ఆక్రమణ

దత్తిరాజేరు, మే 7, ప్రభాతవార్త



మండల పరిధిలో గల గడసాం రెవెన్యూ పరిధిలోగల సర్వే నెంబరు. 3/2లో ఎకరా 80 సెంట్లు విస్తీర్ణం గల ప్రభుత్వఅయ్యప్ప చెరువును పోరలి గ్రామానికి చెందిన కరణం నారాయణప్పుడు కరణం దామోదర్ జెసిబి తో తవ్వి ఆక్రమణకు గురి చేస్తున్నారని గడసాం గ్రామానికి చెందిన నేతేటి వెంకటరమణ నేతేటి గడ్డి నాయుడు తాసిల్దార్ కు బుధవారం ఫిర్యాదు చేశారు సుమారు 50 సంవత్సరాలు నుండి మా గ్రామ రైతులు చెరువు చెరువు కింద వరి పంటకు నీరు కట్టుకొని జీవనం సాగిస్తున్నామని ఈరోజు ఈ ఒక్క చెరువును జెసిపి తో తవ్వి గట్టులు ఎత్తితే నీరు పొలంలోకి ఎలాగ వెళ్తుందని రైతులు లబోదిబోమంటున్నారు 2021లో అప్పట్లో ఉన్న కలెక్టర్ తాసిల్దార్ కి ఫిర్యాదు చేసామన్నారు ఇంతవరకు ఆ చెరువు మీదకు ఎవరూ రాలేదని మళ్లీ జెసిబితో తవ్వి ఆక్రమణ చేస్తున్నారు కావున ఎంక్వయిరీ చేసి చేసిన వ్యక్తులపై. తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఘనంగా అల్లూరి 101వ వర్ధంతి



కంచిలి, మే 7 ప్రభాతవార్త

కంచిలి మండలం బూరగాం గ్రామంలో మన్యం వీరుడు, పోరాట యోధుడు, తెలుగు వారి పౌరుషంను ప్రపంచంనకు చాటి చెప్పిన విప్లవ నాయకుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి కార్యక్రమం గ్రామంలో బొట్ట శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంనకు సీనియర్ న్యాయ వాదులు మద్దు సర్వేశ్వరరావు, పిండి వెంకటరావు హాజరై నిలువెత్తు అల్లూరి సీతారామరాజు విగ్రహంనకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ ప్రతినిధి బొడ్డు అప్పారావు, ఎంపీటీసీ ప్రతినిధి మద్దు వెంకటరావు, గణిత అవధాని మద్దు తిరుపతిరావు మాస్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఎంతో ధైర్యంగా బ్రిటిష్ వారు మన మీద చేసిన అకృత్యాల పైన వ్యతిరేకంగా పోరాడిన యుద్ధ పటిమను వివరించారు. ఈ కార్యక్రమంలో మద్దు వెంకటేశ్వరరావు, మద్దిల భీమారావు, కొక్కిరి రాజు, బద్రి ఢిల్లీరావు, పిల్లల లింగరాజు, మద్దిల హేమసుందరరావు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం అంతమొందించడమే దేశ లక్ష్యం

కంచిలి, మే 7 ప్రభాతవార్త



ఉగ్రవాదం అంతమొందించడమే మన భారతదేశం లక్ష్యమని మాజీ సైనికులు, దేశభక్తులు, కంచిలి గ్రామ ప్రజలు అన్నారు. పాకిస్థాన్‌లో భారతదేశం దాడులు చేసి ఉగ్రవాదులను మట్టుపెట్టిన సందర్భంగా బుధవారం కంచిలిలో తెలుగుదేశం పార్టీ నాయకుడు జగదీష్ పట్నాయక్ ఇంటి వద్ద నుండి భారత దేశ పతాకాన్ని ఊరేగిస్తూ రైల్వేస్టేషన్ కూడలి వరకు భారీ ర్యాలీ చేపట్టి నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో స్వచ్ఛందంగా వందలాది మంది ప్రజలు భారతదేశానికి అనుకూలంగా పాకిస్తాన్‌కి వ్యతిరేకంగా అనేక నినాదాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేశభక్తులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, మే 7 ప్రభాతవార్త:

నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో జిల్లా నాయీబ్రాహ్మణుల సంఘ నాయకులు కుప్పిలి వెంకటరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణ, టెక్కలి నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి పలు సమస్యలతో కూడిన వినతి పత్రం మంత్రికి అందజేశారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేక సామాజికభవనం నూతనంగా అన్ని హంగులతో నిర్మించాలని, యువత నేర్చుకునేందుకు సంగీత కళాశాల, దేవాలయ ట్రస్టుబోర్డులో పని చేస్తున్న వారికి ప్రత్యేక గుర్తింపు, బీసీ కార్పొరేషన్ రుణాల్లో ప్రత్యేక కోటా ఇవ్వాలని, రాష్ట్రంలో ఎన్నో ఏళ్ళుగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని మంత్రికి కోరారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ ఇప్పటికే నాయీబ్రాహ్మణులకు కొన్ని సదుపాయాలు కల్పించామని, మిగిలినవి కూడా త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా నాయీబ్రాహ్మణుల ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు, శ్రీకాకుళం పట్టణ అధ్యక్షుడు కుప్పిలి నాగరాజు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సాధకారిక పార్టీ కన్వీనర్ తెలగవలస అప్పన్న, ఇప్పిలి ఈశ్వరరావు, గోరింక శ్రీను, జమ్ము రవికుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో పంటలు అధిక దిగుబడి : వ్యవసాయశాఖాధికారి గోవిందరావు

కోటబొమ్మాళి, మే 7 ప్రభాతవార్త



మట్టినమూనాలు సేకరించి భూసార పరీక్ష నిర్వహించటం ద్వారా పంటలకు సరైన ఎరువులు వాడితే పెట్టుబడులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వచ్చి లాభం పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు అన్నారు. మట్టి నమూనాలు సేకరణలో భాగంగా ఆయన తన సిబ్బందితో కలిసి బుధవారం మండలం తర్లిపేట గ్రామంలో భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలు సేకరించారు. రైతులు తమ భూములలో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఆయన తెలిపారు. వీఏఏ డి.అప్పన్న, రైతులు పాల్గొన్నారు.

## బాలికలు విద్యలో మరింత ముందుకు సాగాలి : ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్



కోటబొమ్మాళి, మే 7 ప్రభాతవార్త

బాలికలు విద్యలో మరింత ముందుకు సాగాలని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్ పేర్కొన్నారు. బుధవారం కోటబొమ్మాళి బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు జరిగిన సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ పాఠశాల నందు పదవ తరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థిని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రుల సమక్షంలో బహుమతి అందుకోబోతుందని తెలియజేశారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ 577 మార్కులు సాధించినందుకు గాను ఆ విద్యార్థినికి ఈ సువర్ణ అవకాశం దక్కనుందని ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాలలో మంచి బోధకులతో పాటు మంచి వసతి సౌకర్యాలున్నాయని ఇక్కడ విద్యార్థినులు మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతున్నారు. కనుక అత్యధిక స్థాయిలో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఈ పాఠశాలలో చేర్పించి వారిని ప్రయోజకులు చేయాలని సూచించారు. ప్రత్యేకంగా ఈ బాలికల పాఠశాల ఏర్పాటుకు తన సొంత స్థలాన్నిచ్చి విశేష కృషి చేసిన స్థలదాత బోయిన గోవిందరాజును ఈ సందర్భంగా ఆయన ప్రశంసలతో ముంచెత్తారు. ఈ పాఠశాల నందు పదవ తరగతి పరీక్షల్లో 500 పైబడి మార్కులు సాధించిన 14 మంది విద్యార్థినులకు స్థలదాత గోవిందరాజు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. 577 మార్కులతో ప్రథమ స్థానంలో డి.మణెమ్మ, 546 మార్కులతో ద్వితీయ స్థానంలో బి.వాగ్దేవి, 536 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన పి.సమీరలను పలువురు అభినందించారు. స్థానిక హెచ్ఎం చిలుకూరి రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కల్లి లక్ష్మణరెడ్డి, కమ్ము కట్టు అప్పలరాజురెడ్డి, దేవాది సింహాద్రమ్మ, మాజీ వైస్ ఎంపీపీ నాగయ్య రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ జీరు గణేష్, కోరాడ గోవిందరావు, తంగుడు కృష్ణస్వామిలతో పాటు పలువురు గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

సీతంపేట, మే 7 ప్రభాతవార్త:



గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక జయక్రిష్ణ స్పష్టం చేశారు. బుధవారం సీతంపేట మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రాగునీరు, రహదారులు విద్య వంటి మౌలిక సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. రానున్న ఐదేళ్లలో నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించడానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. సీతంపేట మండలం మల్లి జిల్లేడుపాడు గ్రామంలో పాఠశాల ప్రహరీ గోడలు నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా శంబం.వాభ గ్రామంలో జల జీవన మిషన్ పథకం కింద వాటర్ షెడ్ నిర్మాణ పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు గర్భాన సత్తిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ సంధ్యారాణి, బిజెపి ఉపాధ్యక్షురాలు జి.రవణమ్మ, ఐటిడిపి కన్వీనర్ ఇ.పవన్, ఏపీవో సాగర్, ఇ.ప్రసాద్, మాజీ ఎంపీపీ మల్లయ్య, రాజేష్, సింహాచలం, రఘు, శ్రీకాంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేట ఎంపీడీవో బాధ్యతలు స్వీకరణ



సీతంపేట, మే 7 ప్రభాతవార్త:

సీతంపేట ఎంపీడీవోగా బిజయో భాను మిస్రో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పొందూరు ఏటగా పని చేసిన ఈయనకు పదోన్నతిపై సీతంపేట ఎంపీడీఓగా ప్రభుత్వం నియమించింది. ఈయనకు ప్రస్తుతం ఇంచార్జ్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న టి.కృష్ణారావు తన ఎంపీడీవో బాధ్యతలను మిస్రోకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో బిజయో భాను మిస్రోకు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతించారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కంచిలి, మే 7 ప్రభాతవార్త:



కంచిలి మండలం నువ్వాగడ పంచాయితీలో 30 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. మాదిన రామారావు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, హరిబాబు, సంజయ్, పండ భాస్కరరావు, బాలు, మోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం : మాజీ ఎంపీపీ కూన ప్రమీల





ఆమదాలవలస, మే 7 ప్రభాతవార్త:

నిస్సహాయిత కుటుంబాలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ భార్య, మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. బుధవారం పొందూరు మండలంలోని తండ్యం గ్రామానికి చెందిన సబ్బి సత్యనారాయణ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 80 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో ఐదు సంవత్సరములో నిస్సహాయ స్థితిలో ఉన్న ఏ కుటుంబానికి లబ్ధి చేకూరలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 11 నెలల్లోనే కోటి రూపాయలు దాటి సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని వివరించారు. వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా సతమతమవుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వివరించారు. అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. నియోజవర్గాన్ని ఎమ్మెల్యే రవికుమార్ అభివృద్ధి బాటలో ముందుకు తీసుకొని వెళ్తున్నారని అన్నారు. ప్రతి గ్రామానికి త్రాగునీరు, సాగునీరు అందించడమే టిడిపి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని వివరించారు. నియోజవర్గంపై పూర్తి పట్టున్న నాయకుడు ఎమ్మెల్యే రవికుమార్ అని అన్నారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ

వీరఘట్టం, మే 7 ప్రభాతవార్త:



మండల కేంద్రం వీరఘట్టంలోని శ్రీ పైడితల్లి అమ్మవారి గ్రామదేవత సన్నిధిలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజి ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. ప్రతి మంగళవారం ఆనవాయితీగా మజ్జిగను పంపిణీ చేస్తుండగా అదనంగా బుధవారం కూడా భక్తులకు మజ్జిగను సరఫరా చేశారు. మండు వేసవి కారణంగా భక్తులు అత్యధికంగా విచ్చేసి మజ్జిగను సేవించారు. ఎక్కువగా మండలంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు కూడా మజ్జిగను సేవించి తమ దాహార్తిని తీర్చుకున్నారు.

## ప్రశాంత కోటబొమ్మాళిలో మహిళ దారుణ హత్య

### -ఉలిక్కి పడ్డ గ్రామస్థులు -అక్రమ సంబంధమే హత్యకు కారణమై ఉండవచ్చు



కోటబొమ్మాళి, మే 7 ప్రభాతవార్త:

ప్రశాంతంగా ఉండే కోటబొమ్మాళి గ్రామంలో మహిళ హత్యతో గ్రామమంతా ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాది. వివరాల్లోకి వెళితే బుధవారం మధ్యాహ్నం హర్షిణి బ్యూటీ పార్లల్, లేడీస్ కార్నర్ నడుపుతున్న నర్సిపురం లక్ష్మి (30)పై తన భర్త తిరుపతిరావు చేతనే హత్యకు గురైంది. సంతబొమ్మాళి మండలం నర్సాపురం గ్రామానికి చెందిన ఈ భర్త భార్యలు స్థానిక విద్యుత్‌నగర్ కాలనీలో నివాసముంటూ కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో ఈ పార్లల్ నిర్వహిస్తున్నారు. సుమారు మూడున్నర గంటల సమయంలో భార్యకు భర్త కత్తితో పీక కోసి మద్యం షాపుకు వెళ్ళాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా లక్ష్మి అప్పటికే మృతి చెంది రక్తం మడుగులో విగతజీవిగా పడి ఉంది. గ్రామస్థుల సమాచారం మేరకు మద్యం దుకాణంలో ఉన్న తిరుపతిరావును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ హత్యకు అక్రమ సంబంధమే కారణమై ఉండవచ్చునని భావిస్తున్నారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన క్ల్యూస్ టీం నిశిత పరిశీలన చేశారు. వీరి ఇరువురు మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. గతంలో కూడా ఒకసారి భార్య లక్ష్మిపై భర్త తిరుపతిరావు దాడిచేసిన ఘటనలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా ఉంది. మృతురాలుకు కుమారుడు, కుమార్తె ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ సిఐ విజయకుమార్, స్థానిక ఎస్ఐలు వి.సత్యన్నారాయణ, రెల్లయ్య, టెక్కలి, సంతబొమ్మాళి ఎస్ఐలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

## సోంపేట, కంచిలిలలో న్యాయ విజ్ఞాన సదస్సులు



కంచిలి, మే 7 ప్రభాతవార్త:

రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ శ్రీకాకుళం వారి ఆదేశాల మేరకు మండల న్యాయ సేవ అధికార సంఘం అధ్యక్షులు మరియు సోంపేట ఆరవ అదనపు జిల్లా జడ్జి కిషోర్‌బాబు అసంఘటిత కార్మికుల కొరకు కంచిలిలో శ్రీఅన్నపూర్ణ రాయి పద్మావతి ఇండస్ట్రీస్ మరియు శ్రీ లక్ష్మీ ఫుడ్ ప్రొడక్ట్స్ సోంపేటలలో రెండు న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటిగా మేడే గురించి తెలియజేశారు. ఇంకా అసంఘటిత కార్మికుల భద్రతా చట్టాన్ని గూర్చి తెలియజేశారు. ప్రతి కార్మికుడు ఇన్సురెన్స్ చేయించుకోవాలని ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినప్పుడు అది ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్మికులు పనిచేసే చోట వారికి కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేయించుకోవాలని, ప్రతి కార్మికుడు తమ హక్కులను తెలుసుకొని వాటికోసం పోరాడాలని తెలియజేశారు. స్త్రీలకు పనిచేసే చోట ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఇంకా అసంఘటిత కార్మికుల భద్రత చట్టాన్ని 2008లో ఏర్పాటు చేశారని తెలియజేస్తూ ఆ చట్టాన్ని గురించి వివరించారు. స్త్రీ కార్మికుల కోసం ప్రత్యేక వసతులను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఇంకా కార్మికుల చట్టాలను గురించి కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె శ్రీనివాస్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ సోంపేట, డి.జగన్నాయకులు ఎడిషనల్ పీపీ సోంపేట, బేసి లక్ష్మీనారాయణ, గవర్నమెంట్ లాయర్, పి.పాపినాయుడు, కంచిలి ఎస్సై, సోంపేట బార్ ప్రెసిడెంట్ జి.శైలేంద్ర పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కళా వెంకట రావుని నాటిక పోటీలకు ఆహ్వానించిన జిసిఏ ప్రతినిధులు

గరివిడి మే,7 ప్రభాతవార్త



ఈ నెల 9,10,11 తేదీల్లో గరివిడిలో నిర్వహించనున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమానికి హాజరు కావాలని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావుకి గరివిడి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులుబుధవారం సాయంత్రం ఆహ్వానిం చారు. ఈ మేరకు నాటిక పోటీల బ్రోచరని అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నాటిక పోటీల నిర్వహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా శాసన మండల6ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్,మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, సీనియర్ టీడీపీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులు రాజు తోపాటు గరివిడి, గుర్ల,చీపురుపల్లి, మేరకముడిదాం మండలాల నాయకులు, పాలకుల కు ఇప్పటికే ఆహ్వానాలు అందించారు.కాగా ఎమ్మెల్యే కిమిడి ని ఆహ్వానించే వారిలో అసోసియేషన్ ప్రతినిధులు కింతాడ రవి విజయ ప్రసాద్,పి.కుమార్,తూట వెంకట రమణ, బడిగంటి సీతారాం,మజ్జి నానాలు ఉన్నారు.

## నాటు సారాపై అవగాహన కార్యక్రమం



కొమరాడ,మే 7 ప్రభాతవాం

విజయనగరం డిప్యూటీ మరియు అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు నవోదయం 2.%వా% కార్యక్రమంలో భాగంగా బుధవారం కొమరాడ మండలం కొండకూనేరు గ్రామం లో నాటుసారాయి తాగడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సును ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ (సీతానగరం)డి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ నాటుసారా అమ్మకాలు నిర్మూలనే ధ్యేయంగా రెవెన్యూ మరియు పోలీసు వారి సహకారంతో నిరంతర నిఘా మరియు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సిబ్బంది, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

గజపతినగరం, మే 7, ప్రభాతవార్త



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశాల మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ డాక్టర్ చిత్రాడ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గజపతినగరం లో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. స్థానిక చంపావతి పాత బ్రిడ్జి నుంచి ప్రారంభమైన ర్యాలీ జాతీయ రహదారి, నాలుగు రోడ్ల జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదగా సాగింది. అనంతరం స్థానిక కాంప్లెక్స్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగ పరిరక్షణ కోసం పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో గజపతినగరం, బండపల్లి , దత్తి రాజేరు, గంట్యాడ మండల పార్టీ అధ్యక్షులు బోని రవితేజ, జి .రాంబాబు, మామిడిపాక బుచ్చిరాజు, బి .మురళి, కరీం ,బంగారు నాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేడు సదరం ధృవపత్రాలు పరిశీలన

ఇచ్ఛాపురం, మే 7 ప్రభాతవార్త

ఎన్టీఆర్ భరోసా దివ్యాంగ పింఛను పొందుతున్న అభ్యర్థులకు సదరం ధృవీకరణపత్రాల పరిశీలన గురువారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామారావు చెప్పారు. కొళిగాం, కీర్తిపురం, అరకభద్ర, కేశుపురం, కేదారిపురం, ధర్మపురం పరిధిలో 143 మంది పింఛనుదారులకు వైకల్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

# శ్రీకాకుళం వార్త



## ఆసరా లేని వృద్ధ దంపతులకు అభయం



నందిగాం, మే 7 ప్రభాతవార్త:

నందిగాం మండలం పెంటూరు గ్రామానికి చెందిన గౌడు కృష్ణారావు, ఎండమ్మ అనే వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ పూట గడవక ఇబ్బంది పడుతున్నారు. వున్న ఒక్కగానొక్క కొడుకు కుర్మారావు ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం వాళ్ళు బుధవారం ఆ వృద్ధ దంపతులకు నెల రోజులకు సరిపడేలా 25కేజీల బియ్యం, 20 రకాల నిత్యావసర వస్తువులు మరియు మందుల ఖర్చు నిమిత్తం 6000 ఆర్థిక సాయం అందించినట్లు అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, అద్దాల వీరభద్రాచారి, బొడ్డు నీలయ్య, బంగారు ధర్మారావు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జ్ఞానభారతిలో ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం

ఇచ్ఛాపురం, మే 7 ప్రభాతవార్త:



స్థానిక జ్ఞానభారతి సిబిఎస్ఈ సీనియర్ సెకండరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం నిర్వహించారు. సెక్రటరీ జోహార్‌ఖాన్ ఆధ్వర్యంలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాలకు హాజరవుతున్న విద్యార్థులతో క్రీడలకు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, హెచ్ఎం రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఏఓ సయ్యద్ సుల్తానా, అలీంఖాన్, కైలాస్ పండా, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూలలో 41 మంది ఎంపిక



ఇచ్ఛాపురం, మే 7 ప్రభాతవార్త:

రత్తకన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 41 మంది ఎంపికయ్యారు. ఫ్యాక్సికాన్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రొబిన్‌కుమార్ పాడి, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జాబ్ డ్రైవ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్‌కుమార్, హెచ్ఆర్ మేనేజర్లు గంగులరెడ్డి, రేష్మా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకంచమ్మతల్లి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

కంచిలి, మే 7 ప్రభాతవార్త:



కంచిలి గ్రామ ప్రజల ఇలవేల్పు శ్రీకంచమ్మ తల్లి గ్రామ దేవత మహోత్సవాలు జూన్ 1వ తేదీ నుండి జరపడానికి కంచిలి గ్రామస్తులు నిర్ణయించారు. ఈ సందర్భంగా పది రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరపడానికి పెద్దలు నిర్ణయించడంతో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కంచిలి గ్రామస్తులు సంబరాలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమం అంటే ఏంటో చూపిస్తున్నాం : సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీలో కోళ్ల

లక్కవరపుకోట, మే 7 ప్రభాతవార్త:



ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం.ప్రభుత్వం ఏర్పడిన ఈ 9నెలల్లో ప్రజా సంక్షేమం దిశగా అడుగులు వేస్తున్నామని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం ఎస్.కోట నియోజకవర్గంలో పలువురికి ఆమె ఎల్ కోటలోని ఆమె క్యాంపు కార్యాలయంలో మొత్తం 5మందికి 4లక్షల రూపాయలకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ చెక్కులు అందుకున్నలబ్ధిదారులకు ఎమ్మెల్యే లలిత కుమారి, ముఖ్యమంత్రి చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తానని మాటిచ్చానని ఇచ్చిన మాట ప్రకారం ఆ మాటను నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాం ప్రసాద్, లాలం అర్జున్ రావు, సర్పంచ్ మాకేన నవిన్, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యం

బాడంగి, మే 7 ప్రభాతవార్త



ఈరోజు బాడంగి మండలం ఎరుకలపాకుల గ్రామంలో టీడీపీ శ్రీ సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 1988 సంవత్సరం నుంచి రాజకీయాలలో ఉంటూ ప్రజలకు సేవలు అందించడమే కాకుండా ఎరుకులపాకల గ్రామంతో పాటు విజయనగరం జిల్లా ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షులు హోదాలోను ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా నేనున్నానంటూ వారికి అన్ని విధాలుగా సహాయపడుతూ ఏ సమస్య వచ్చిన ఫలానా వ్యక్తి వద్దకు వెళ్తే మన సమస్యకు పరిష్కారం మనకు న్యాయం జరుగుతుందని నమ్మకం కలిగించినటువంటి వ్యక్తి పాలవలస గౌరి అన్నారు. రాజకీయంగాను, సామాజికంగాను, ఆధ్యాత్మికంగానూ గొప్ప మనసున్న ఎరుకుల జాతి ఆణి ముత్యం పాలవలస గౌరిని టీటీడీ సమరసత సేవ ఫౌండేషన్ వారు ఎరుకల పాకల పెద్దలు సమక్షంలో సన్మానించారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాల పరిశీలన



గజపతినగరం, మే 7, ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల భవనాలను జిల్లా సమగ్ర శిక్ష (ఎపిసి) ఎడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఏ.రామారావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న గదులను, ప్రధానోపాధ్యాయుల, ఆఫీస్ సిబ్బంది గదులను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్న ఎన్.గంగరాజు హాలు తో పాటు, మిగతా భవనాలను కూడా పరిశీలించారు. క్రీడా మైదానాన్ని కూడా పరిశీలించడం జరిగింది. ఈ భవనాల పరిస్థితిపై ఎంఈఓ ఎస్. విమలమ్మ, ప్రధానోపాధ్యాయులు మీసాల వెంకటేశ్వరరావు లతో చర్చించి మాట్లాడారు. ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ఆకస్మికంగా ఈ భవనాల పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఈ పాత భవనాలు స్థానంలో కొత్త భవనాలు మంజూరు అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.విమలమ్మ, మంత్రి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## బీసీ భవనం మంజూరు చేయండి

కొమరాడ, మే 7, ప్రభాతవార్త



కొమరాడ మండలంలో బీసీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ ఎస్ఎస్విని కోమరాడ మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్, ఆ కార్పొరేషన్ డైరెక్టర్ శేఖర్ పాత్రుడు కోరినట్లు తెలిపారు. బుధవారం గొల్లపూడిలో జరిగిన రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ సమావేశంలో ఈ మేరకు చైర్మన్‌కు పాత్రుడు ప్రతిపాదనలు ఇచ్చినట్లు చెప్పారు. తూర్పు కాపు కార్పొరేషన్ కు ప్రభుత్వం నుంచి ఎక్కువ నిధులు విడుదలకు ప్రభుత్వానికి విన్నవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొమరాడ తో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో పలు మండల కేంద్రాలలో బీసీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు కార్పొరేషన్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయాలని కోరినట్లు ఉదయ శేఖర్ పాత్రుడు చెప్పారు.

# మొక్కల సంరక్షణకు..

ఎంతో మంది మొక్కలు పెంచుకుంటారు. వాటిని ప్రాణం కంటే ఎక్కువగా చూసుకుంటారు. అలాంటిది ఒక్కోసారి రోజుల తరబడి ఇంట్లో లేనప్పుడో లేదంటే సమయం దొరక్క పోవడం వల్లనో వాటి సంరక్షణ విషయంలో శ్రద్ధ చూపక పోవచ్చు. దీనివల్ల అవి వాడిపోతుంటాయి. అయితే అలాంటి వాటికి తిరిగి జీవం పోయాలంటే కొన్ని ఇంటి చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. బియ్యం కడిగిన నీళ్లతో అందాన్ని సంరక్షించుకోవచ్చన్న సంగతి తెలిసిందే! అయితే ఇవే నీటితో మొక్కల్ని తిరిగి పునరుత్తేజితం చేయచ్చంటున్నారు నిపుణులు. ఈ బియ్యం కడిగిన నీటిని ఒక స్ప్రే బాటిల్లో నింపు కొని.. రోజుకోసారి మొక్కలపై, వాటి మొదళ్లపై స్ప్రే చేయాలి. వీటిలో ఉండే స్టార్చ్ మొక్కలకు దివ్యౌషధంలా పనిచేసి వాటికి తిరిగి జీవం పోస్తుంది. వాడిపోయిన మొక్కల్ని పునరుత్తేజితం చేయడంలో అరటి పండు తొక్కలూ సహాయపడతాయి. తొక్కల్ని చిన్న చిన్న ముక్కలు చేసి ఒక గ్లాస్ జార్లో వేయాలి. అందులో లీటరు నీటిని నింపి రాత్రంతా అలాగే వదిలేయాలి. ఉదయాన్నే నీటిని వడకట్టి స్ప్రే బాటిల్లో నింపుకోవాలి. ఈ నీటిని రోజుకోసారి లేదా రెండుసార్లు చొప్పున మొక్కలు, వాటి మొదళ్లపై స్ప్రే చేస్తే సత్ఫలితాలుంటాయి. వీటిలోని పొటాషియం మొక్కల్ని తిరిగి పునరుత్తేజితం చేయడంలో సహకరిస్తుంది.

టేబుల్ స్పూన్ చక్కెర కలిపిన నీళ్లు ఒక స్ప్రే బాటిల్లో నింపి.. మొక్కల ఆకులపై కొద్దిగా స్ప్రే చేయాలి. అయితే ఈ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లపై స్ప్రే చేయకపోవడమే మంచిది! ఎందుకంటే ఇందులోని తియ్యదనం వల్ల కీటకాలు మొక్క ఆరోగ్యాన్ని



మరింత దెబ్బతీస్తాయ! కాబట్టి కొద్ది మోతాదులో స్ప్రే చేస్తే వాటికి తక్షణ శక్తి అందుతుంది.. అవి పునరుత్తేజితమవుతాయి. మొక్కలకు తగినంత సూర్యరశ్మి అందకపోయినా వాటి ఆకులు పాలిపోయినట్లుగా తయారవుతాయి. కాబట్టి వాటిని సూర్యరశ్మి తగిలే చోట ఉంచితే ఫలితం ఉంటుంది. మొక్కల్లో వాడిపోయిన ఆకుల్ని తొలగించడం మంచిది. ఫలితంగా వాటి ప్రభావం ఇతర ఆకులపై, మొక్కపై పడకుండా ఉంటుంది. ఇలా వాడిపోయిన ఆకులు/పువ్వుల్ని తొలగించడం వల్ల కూడా మొక్కల్ని పునరుత్తేజితం చేయచ్చంటు న్నారు నిపుణులు. కుండీ చిన్నగా ఉండి, కొన్ని మొక్కల వేర్లు ఎక్కువగా విస్తరించడం వల్ల వాటికి తగినంత పోషణ అందకపోవచ్చు. ఇలాంటప్పుడూ మొక్కలు వాడిపోతుంటాయి. కాబట్టి పాత కుండీని తొలగించి.. కాస్త పెద్దగా ఉంటే కొత్త కుండీలో మొక్కను తిరిగి నాటితే ఫలితం ఉంటుంది. వీటిలో ఉండే క్లోరైడ్, ఫ్లోరైడ్ మొక్కల ఆరోగ్యానికి ప్రతిఫలంగా మారతాయి. కాబట్టి ప్రత్యేకించి నిల్వ చేసిన వర్షపు నీరు, క్లోరైడ్/ఫ్లోరైడ్ రహిత నీటిని మొక్కలకు ఉపయోగిస్తే అవి వాడిపోకుండా కాపాడుకోవచ్చు.

**చెలి చిట్కా**

యాపిల్ నీళ్లతో శరీరం డీ- హై డ్రేట్ అవదు. శక్తి పెరుగుతుంది. నీరసం, నిస్సత్తువ ఉండదు.

# పారాయణ ఫలం!

అమరావతి నుండి బనారసీ దంపతులు పొట్ట చేత పట్టుకుని పిల్లలతో లండన్ మహానగరం చేరారు. అక్కడ భారతీయ వాతావరణాన్ని తలపించే భోజన వసతి గృహాన్ని తెరుద్దామని. రోజులు అనుకూలించాయి. భారతీయుల నెందరినో ఆకర్షించింది ఆ వసతిగృహం. అన్నిటి



కంటే యజమానురాలయిన ఆజీబాయి అందరినీ ఆపేక్షగా చూచుకునేది. మాతృప్రేమను మరల లండన్‌లో భారతీయులు అనుభవించారు ఆమె సమక్షంలో. ఆమె భర్త మరణించాడు. సవతి కొడుకు ఆమె వద్దకు వచ్చి, ఆ ఇంటిని ఖాళీ చేసి పిల్లలతో సహా వెళ్లిపొమ్మన్నాడు. ఆమె అవాక్కయింది. భయపడింది. గతంలో మహారాష్ట్రకు చెందిన రామచంద్ర తుకారాకం కాకడే, ఆయన భార్యతో సహా ఆ వసతి గృహంలో కొంత కాలం ఉన్నారు. ఆ సమయంలో ఆమె ప్రప్రథమంగా సాయిబాబా చిత్రాన్ని చూసింది. కాకడే చేసే పూజలో ఆమె కూడా పాల్గొనేది. ప్రసాదాలను ఆమె స్వయంగా చేసి ఇచ్చేది. ఆయన చదివే పారాయణ గ్రంథం, సాయి పటం ఇచ్చి పూజా విధానం తెలిపాడు. ఇక ఆమె సాయి భక్తురాలైంది. రోజూ సాయి సచ్చరిత్రను పారాయణం చేసేది. ఇక ఆమెకు తోడు నీడ సాయిబాబాయే అని గ్రహించింది. సాయి మహాసమాధి చెంది 42 సంవత్సరాలు అయింది. లండన్ మహానగరంలో తనకు తన పిల్లలకు నిలువ నీడ లేదని గ్రహించి, ఉన్న అతి కొద్ది ఆస్తిని అమ్మివేసి భారతదేశం వచ్చేద్దామను కున్నది. ఆ రోజు జూలై 7, 1961 సంవత్సరం. ఎవరో ఒక పెద్ద మనిషి వచ్చి 'వసతి గృహ వ్యాపారం చేయాలని ఉన్నదా?' అని ప్రశ్నించాడు. ఆమె ఆశ్చర్యపోయింది. అది తనకు గొంతెమ్మ కోర్కె అని తెలుసుకున్నది. ఆయన తనకు తెలిసిన ఒక వసతి గృహం అమ్మకానికున్నదని, అమ్మువారు తనకు తెలుసునని, ఇష్టమైతే సులభ వాయిదాల మీద చెల్లించటానికి తాను ఏర్పాటు చేస్తానని చెప్పాడు. ఆమె సరే అన్నది. అతను అన్ని ఏర్పాట్లు చేశాడు. ఆ తరువాత ఎప్పుడూ అతను కనపడలేదు. తిరిగి లండన్ మహానగరంలో నిలదొక్కుకు నేటట్లు చేశాడా మహానుభావుడు. ఆ మహనీయుడు ఎవరో కాదని, సాయిబాబాయే అని ఆమె గట్టి నమ్మకం. ఎవరు కాదన గలరు. ఆమె జీవితాంతం సాయి సచ్చరిత్ర పారాయణం చేసి తరించింది. ప్రతిఫలం ఆశించ కుండా చేసే పారాయణ, పూజలు తప్పక అక్కరకు వస్తాయి. మనం కూడా నిత్యం సాయి సచ్చరిత్ర పారాయణ చేద్దాం!

**- ఎం.పి.సాయినాథ్**

# కోడలిలో కూతుర్ని చూడండి!

**వ్యథ**

**మా రోజుల్లో కోడళ్లు అత్తలకు భయపడేవారు. ఇప్పుడు కోడళ్లకు అత్తలు భయపడవలసివస్తోంది. నేను అప్పుడు మా అత్తకు భయపడ్డాను. ఆమె వేధింపులు భరించలేక సతమతం అయ్యాను. అయితే మా అమ్మ, నాన్న ఇతర పెద్దల మాట విని సర్దుకుని సంసారం చేశాను. ఉన్న కొద్ది పొలం పనులు చేసుకుంటూ, పశువులను మేపుకుంటూ పాలు అమ్ముకుని బ్రతుకు సాగించాము. ఉన్నదానితో కష్టపడి ఉన్న ఒక కొడుకుని చదివించి ప్రయోజకుడిని చేశాము. మా అబ్బాయి పేరున్న కాలేజీలో ఎం.బి.ఎ చదివి ఒక పెద్ద కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్నాడు. బాగా చదువుకున్న ఒక పేదింటి అమ్మాయిని కోడలుగా తెచ్చుకున్నాము. ఆమె ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నది.మా అబ్బాయికి నెలకు లక్షా ఇరవైవేలు, కోడలుకు లక్షరూపాయలు జీతం వస్తోంది. ఇద్దరు బెంగుళూరులోనే ఉద్యోగం చేస్తున్నారు. అందరు కలసి ఉందామని భావించి ఊరిలో ఉన్న పొలం అమ్మేసి బెంగుళూరులోనే ఉద్యోగం చేస్తున్నారు. అందరు కలసి ఉందామని భావించి ఊరిలో ఉన్న పొలం అమ్మేసి బెంగుళూరులో స్థలం కొని ఇల్లు కట్టుకున్నాము. మా అబ్బాయికి పెళ్లయి మూడేళ్లు అయింది. ఏడాది క్రితం వారికి ఒక బాబు పుట్టాడు. దానితో మా కోడలు కంపెనీవారి అనుమతి తీసుకుని వర్క్‌ఫ్రం హోం చేస్తోంది. ఇంటిలో ఒక పని కూడా చేయదు. ఏ విషయము పట్టించుకోదు. ఉదయం ఆలస్యంగా నిద్రలేచి స్నానం, టిఫిన్ ముగించుకుని తన గదిలోకి వెళ్లి కంప్యూటర్ ముందు కూర్చుంటుంది. కనీసం బిడ్డకు పాలు కూడా ఇవ్వదు. వాడికి నాన్నమ్మను అయిన నేనే తల్లిపాత్ర పోషిస్తున్నాను. తల్లిపాలు ఇవ్వనందున డబ్బాపాలు పడుతున్నాను. బిడ్డకు పాలు ఇస్తే అందం చెడిపోతుందని ఆపేసింది. అడపాదడపా ఇంటిపనిలో సాయం చేయడం మానేసింది. ఏదైనా సలహా ఇస్తే తిరగబడి సమాధానం చెపుతుంది. ఆమె దృష్టిలో నేను ఒక పనిమనిషిని మాత్రమే. మా అబ్బాయికి కూడా తగిన గౌరవం ఇవ్వదు. వారం క్రితం వారిద్దరి మధ్య మాటామాటా పెరిగింది. మా అబ్బాయి కోపంతో చెంప మీద ఒక దెబ్బ కొట్టాడు. దీనితో ఆమె తిరగబడి తీవ్రంగా హెచ్చరించింది. మొదటిసారి కాబట్టి క్షమిస్తున్నానని, మరొకసారి చేయి చేసుకుంటే కేసుపెట్టి విడాకులు తీసుకుంటానని భయపెట్టింది. ఈ నేపథ్యంలో ఆమెను దారిలో పెట్టే మార్గం చెప్పండి.**

**- ఒక సోదరి, బెంగుళూరు**





**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

అమ్మా! ఇప్పుడు సమాజంలో ఇలాంటి సమస్యలు తరచూ వినిపిస్తున్నాయి. మీలాగే కోడళ్లు తమ మాట వినడం లేదని చాలామంది అత్తలు ఆరోపణలు చేస్తున్నారు. కొందరు కోడళ్లు అహంకారపూరితంగా ప్రవర్తిస్తుండవచ్చు. అయితే కోడళ్లు అందరూ అలా ఉన్నారనడం నిజం కాదు. ఇప్పటి అత్త ఒకప్పటి కోడలే కదా! ఆ రోజు అత్త ఎలా ఉండాలి. ఎలా ఉండకూడదు అని భావించారో ఇప్పుడు, అలా ప్రవర్తించడానికి ప్రయత్నం చేస్తే సగం సమస్యలు తగ్గిపోతాయి. కోడలు అంటే పనిమనిషి కాదు. ఇంటికి వెలుగు, వంశాన్ని ఉద్ధరించే వ్యక్తి అన్నది గుర్తించాలి. ఇప్పటి కోడళ్లలో ఎక్కువ మంది తీరికలేని ఉద్యోగాలు చేస్తున్నారు. స్నేహసంబంధాలు, కుటుంబ సంబంధాలకు దూరం అవుతున్నారు. కొంతమంది అయితే దాంపత్య సుఖాలు అనుభవించలేని స్థితిలో ఉన్నారు. దీనితో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై విసుగు, కోపం, అసహనం ప్రదర్శిస్తున్నారు. కాబట్టి ఆధునిక అత్తలు కోడళ్లపట్ల 'సహానుభూతి'తో ఆలోచించాలి. కోడలిలో కూతురిని చూడాలి. మీ కూతురు అయితే మీరు ఎలా ఆదరిస్తారో అలాగే కోడలిని ఆదరించడం అలవాటు చేసుకోండి. ఒకసారి అందరు కలసి కుటుంబ కౌన్సిలింగ్ తీసుకోండి. సహనం సర్దుబాటు అలవర్చుకోండి.

# దాహం తీర్చే చెరకురసం

ఎండాకాలంలో వీధి చివర, బేకరీల్లో, ఫుడ్‌కోర్టుల్లో కనిపించడమే కాక, ఇంటి ముందుకూ వచ్చేస్తాయి చెరకురసం బండ్లు. అందరూ ఇష్టంగా తాగే చెరకురసంతో తాత్కాలిక శక్తి మాత్రమే లభిస్తుందనుకుంటే పొరబడినట్లే అదనంగా దీని ద్వారా మరెన్నో లాభాలూ ఉన్నాయంటారు. పోషకాహార నిపుణులు. ఈ పానీయంలోని సహజ చెక్కెరలు అలసిన శరీరాన్ని చురుగ్గా మార్చే ఇంధనంలా పనిచేస్తాయి. దీని ద్వారా లభించే విటమిన్‌సితో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇక, ఎ విటమిన్ కణాల వృద్ధికీ కంటిచూపును మెరుగుపర్చేందుకూ తోడ్పడితే, బి కాంప్లెక్స్ విటమిన్లు శరీరం చురుగ్గా పని చేసేలా చూస్తాయి. అదే విధంగా కాల్షియం, మెగ్నీషియం ఇనుము, పొటాషియం వంటి ఖనిజాలు ఎముకలు దంతాల ఆరోగ్యానికీ, కండర వృద్ధికీ దోహదపడతాయి. చెరకు రసంలోని సోడియం శరీరంలో ఫ్లూయిడ్లు సమతూకంలో ఉండేలా చూస్తుంది. ఇందులోని పీచు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. దీని ద్వారా శరీరానికి అందే ఇనుముతో ఎర్ర రక్తకణాల వృద్ధి జరిగి, అలసట, నిస్సత్తువ దూరం అవుతుంది. చల్లగా, తియ్యగా ఉండే చెరకురసం మెదడుకీ సాంత్వన అందించి, ఆందోళననూ తగ్గిస్తుంది. తయారీ దారులు ఇవన్నీ గుర్తించే, ఇప్పుడు అందులోనే బోలెడన్నీ రకాలను తీసుకొచ్చేస్తూ.. ఈ పానీయం రుచిని పెంచేస్తున్నారు. చెరకురసం అనగానే.. బండిమీద అప్పటికప్పుడు తయారు చేసి



ఇస్తారు. దాని రుచిలో ఏమాత్రం తేడా ఉండదు. కానీ ప్పుడేమో ఎందులోనైనా రకరకాల ఫ్లేవర్లు. చెరకురసం కూడా నిమ్మ ద్రాక్ష, పుదీనా, అల్లం, పైనాపిల్, స్ట్రాబెర్రీ, మామిడి, యాపిల్.. ఇలా కోరుకున్న రుచుల్లో, ఆయా రంగుల్లో దొరుకుతోంది. ఇవన్నీ కూడా జ్యూస్‌ల మాదిరి, ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగేలా వచ్చేస్తూ నోరూరిస్తున్నాయి. బయట నుంచి కాకుండా ఇంట్లోనే చెరకురసం స్వయంగా చేసుకునే తాగాలనుకునేవారి కోసం ఆ ముక్కలు కూడా విడిగా దొరుకుతున్నాయి. అంతేనా సులువుగా నీళ్లలో కలుపుకుని తాగేలా పొడి కూడా అందుబాటులో ఉంది. దీంతో పాటు స్క్వాష్ తరహాలో జ్యూస్ కూడా వచ్చిందిప్పుడు. గ్లాసు చల్లని నీటిలో జ్యూస్‌ను నాలుగైదు టేబుల్ స్పూన్లు కలిపితే అప్పటికప్పుడు కమ్మని చెరకు రసం రెడీఅయినట్లే దీంతో పాప్సికిల్స్, ఐస్‌క్రీమ్, సార్బెట్.. వంటివి చేస్తున్నారు. కాబట్టి.. ఇందులోనూ నచ్చిన రకాలను ట్రై చేయొచ్చు.



కేంద్రమంత్రి జితేంద్రసింగ్, ఇస్రో ఛైర్మన్ నారాయణన్‌లతో అంతరిక్ష శాస్త్రవేత్తలు

## భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలపై ఇస్రో సమావేశాలు

**శ్రీహరికోట (తడ), మే 7 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ త్వరలో చేపట్టనున్న కీలక రాకెట్ల ప్రయోగాలపై ఇస్రో ఛైర్మన్ నారాయణన్, శాస్త్రవేత్తలు కేంద్ర అంతరిక్ష శాఖమంత్రి జితేంద్రసింగ్‌తో సమావేశమయ్యారు. భవిష్యత్‌లో జరిగే మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్ మీద మళ్లీ దృష్టి కేంద్రీకరించారు. భారత వ్యోమగాముల సహకారం, ప్రపంచ అంతరిక్ష పరిశోధనలో భారత్‌కు పెరుగుతున్న పాత్ర, ప్రధాని నరేంద్రమోడీ దార్శనికత గురించి ఈ సమావేశంలో త్వరలో శ్రీహరికోట నుంచి చేపట్టనున్న వివిధ రాకెట్ల ప్రయోగాల గురించి కూడా మాట్లాడారు. ఇస్రో ఉపగ్రహాల వలన దేశ రక్షణకు ఏ మాత్రం ఉపయోగపడతాయన్న దాని మీద చర్చించారు. అంతరిక్ష పరిశోధనలో భారతదేశాన్ని భాగస్వామిగా నిలబెట్టడం కోసం బుధవారం నుంచి మూడురోజులు పాటు అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ ఫెడరేషన్‌తో పాటు గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఇస్రో పెద్దలు పేర్కొన్నారు. గత డిసెంబర్‌లో పిఎస్‌ఎల్‌వి రాకెట్ ద్వారా రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలను ప్రయోగించి విజయవంతమైన తర్వాత మళ్లీ స్పేడెక్స్-2ని ఇస్రో ప్రారంభిస్తుందని చెప్పారు. గగన్‌యాన్ ప్రాజెక్టు గురించి వివరిస్తూ 2027 మొదట్లో ఈ ప్రయోగం ఉంటుందని, 400 కిలోమీటర్ల దూరంలోని ఎర్త్ ఆర్బిట్‌లోకి వ్యోమగాములను తీసుకెళ్లి సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చే బృహత్తర కార్యక్రమంగా చెప్పారు. ఈ కార్యక్రమం పదేపదే వాయిదా పడుతోంది. అయితే ఇప్పటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని, ఎప్పటికప్పుడు సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటూ గగన్‌యాన్‌కు సిద్ధపడుతున్నట్లు ఇస్రో వర్గాలు వెల్లడించాయి.

## చర్లపల్లి-బరంపురం మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,మే 7,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల నుంచి ఒరిస్సాలోని బరంపురం మధ్య వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి బరంపురం వెళ్లే నెంబర్ 07027ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9నుంచి జూన్ 27వరకు ప్రతి శుక్రవారం రాత్రి 8.15గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి, శనివారం మధ్యాహ్నం 2.15గంటలకు బరంపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరంపురం నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07028ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 10నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం సాయంత్రం 4.45గంటలకు బరంపురం నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 11-35గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు తెలుగు రాష్ట్రాల్లో నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపాడ, పలస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్లలో నిలుస్తాయి.

# 'యుద్ధం వస్తే ఇలా చేయాలి'

- విజయవంతంగా ఆపరేషన్ అభ్యాస్
- సివిల్ డిఫెన్స్ సామాజిక బాధ్యతలను నిర్వహించింది
- డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా



రైల్వేలో నిర్వహించిన మాక్ డ్రిల్

**గుంతకల్లు రైల్వే,మే 7,ప్రభాతవార్త**
పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాక్‌ల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే, తూర్పు తీర రైల్వే జోన్‌లలో యుద్ధం వస్తే సామాన్య ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై సివిల్ డిఫెన్స్ సామాజిక బాధ్యతలతో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసే క్రమం మాక్ డ్రిల్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. సమాజంలో ప్రకృతి వైపరీత్యాలు,పౌర విపత్తులు సంభవించిన సమయంలో పౌరుల ప్రాణాలను రక్షించడం సామాజిక బాధ్యత అని గుంతకల్లు డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా,అదనపు డిఆర్‌ఎం సుధాకర్,సీనియర్ డిఇటిఆర్‌డి సుదర్శన్‌రెడ్డిలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్, గుంతకల్లు,నాందేడ్,తూర్పు తీర రైల్వే జోన్ పరిధిలోని విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్రాంగణాలలో సివిల్ డిఫెన్స్‌కు చెందిన వందలాది మంది వాలింటర్లు ఆయా రైల్వే స్టేషన్ ప్రాంగణాల ఎదుట నిర్ణీత సమయంలో మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైమానిక దాడులు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో 12సివిల్ డిఫెన్స్ అధికారులు యుద్ధం వస్తే వ్యవహరించవలసిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. యుద్ధసైరన్ మ్రోగగానే ప్రజలు బహిరంగ ప్రదేశాల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని, ప్రభుత్వ సమాచారం నిమిత్తం టివీ,రేడియో యాప్‌లను ఎప్పటికప్పుడు వినియోగించుకోవాలని ఇళ్లలో ఉన్నవారు ఎలక్ట్రానిక్ పరికరాలు,లైట్లు,గ్యాస్ స్టవ్‌లను ఆఫ్ చేసి ఉంచాలని యుద్ధం తరహా అత్యవసర పరిస్థితులను సృష్టించి పోలీసులు, పారా మిలటరీ బలగాల పనితీరును మాక్ డ్రిల్‌లో పరిశీలించి తగు జాగ్రత్తలు, అవగాహన కల్పించారు. యుద్ధం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సివిల్ డిఫెన్స్ వాలింటర్లు ప్రదర్శించిన ప్రదర్శనలు,కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో సివిల్ డిఫెన్స్ జోనల్ కంట్రోలర్ ఉదయనాథ్ కోట్ల, స్థానిక ఎమర్జెన్సీ అధికారి సుదర్శన్‌రెడ్డి,సీనియర్ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా రైల్వే స్టేషన్‌ల మేనేజర్‌లు అధిక సంఖ్యలో వివిధ విభాగాల సిబ్బంది, విద్యార్థులు, స్కౌట్స్‌గైడ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపి ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ మార్గదర్శకాలు జారీ

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 4.0,2024-29 మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. 4.2 లక్షల కోట్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఉద్దేశంగా ఏపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ రూపకల్పన చేశారు. ఈ రంగంలో 10 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన పెట్టుబడులు ఆకర్షించాలని నిర్ణయించారు.దీని వలన పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలువిశాఖ, తిరుపతి , నెల్లూరు, కడప, అనంతపురంలలో ఎలక్ట్రానిక్ మాన్యు ఫ్యాక్చరింగ్ క్లస్టర్స్ ఉత్పత్తికి అనువుగా ఉన్నట్టు అధికారులు స్పష్టం చేశారు.నైపుణ్యమున్న మానవ వనరులు, అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ఈ రంగంలో పెట్టుబడులకు అనుకూలమని వెల్లడించారు. ఏపీలోని లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో పాటు విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉన్నట్టు తెలిపారు. ఈ రంగంలో వచ్చే పెట్టుబడులు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను ఆకర్షించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. కేటగిరీల వారీగా ఈ రంగంలో పెట్టుబడుల ఆధారంగా ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అన్ని కేటగిరీల ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లకు వంద శాతం స్టాంపు డ్యూటీ మినహాయింపు ఇచ్చారు. కల్పించిన ఉద్యోగాల ఆధారంగా ఒక్కో ఉద్యోగికి నెలకు 4 వేల నుంచి 6 వేల వరకూ ఐదేళ్ల పాటు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. అన్ని కేటగిరీల్లోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌ను రూ.1కే సరఫరా చేయాలని నిర్ణయించారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్‌ను కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వైఎస్ఆర్ ఈఎంసీగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 380.5 కోట్ల రూపాయలను బుధవారం మంజూరు చేసింది. ఈ క్లస్టర్ ఏర్పాటు కోసం కేంద్ర ఐటీ శాఖ ఇప్పటికే అనుమతులు మంజూరు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ క్లస్టర్ ను ఏర్పాటు చేయనున్నాయి. అలాగే కొప్పర్తిలోని ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌కు పెట్టుబడులు ఆహ్వానించేలా ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రీన్ కేటగిరీలోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు తనిఖీలు ఉండవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆరెంజ్, రెడ్ కేటగిరీకి ఇది వర్తించదని పరిశ్రమల శాఖ వెల్లడించింది. భూమి లీజును 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పొడిగించుకునే అవకాశం కల్పించటంతో పాటు అవసరమైతే భూమిని కొనుగోలు చేసేందుకూ వీలుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు వంద శాతం స్టాంపు డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించాలని నిర్ణయించినట్టు ప్రభుత్వం తెలిపింది. 20 శాతం మేర పెట్టుబడి రాయితీ కూడా ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఉంటుందని స్పష్టం చేసింది. 250 కోట్లకు మించి పెట్టుబడులు పెట్టే మొబైల్ ఉత్పత్తి పరిశ్రమలకు మెగా స్టేటస్ ఇస్తామన్నారు.

## ఉగ్రవాదులకు తగిన గుణపాఠం ఆపరేషన్ సిందూర

### మంత్రి నారా లోకేశ్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర పేరిట నిర్వహించిన పాకిస్తాన్ ఉగ్రవాద మూకలపై జరిగిన దాడులపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు.పాకిస్తాన్ అండ చూసుకుని చెలరేగిపోతున్న ఉగ్రమూకలను మట్టుబెట్టడమే లక్ష్యంగా మట్టుబెట్టింది. భారత సైన్యం తొలి అడుగేసింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా అర్ధరాత్రి వేళ దాయాది దేశంలోని 9 ఉగ్రస్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేయడాన్ని హర్షిస్తూ ఎక్స్ వేదికగా 54 సెకన్ల వీడియోను ఆయన పోస్ట్ చేశారు.100 పాకిస్థాన్‌లకు సమాధానం చెప్పే మిసైల్.. ఏప్రధాఆన మంత్రి నారా లోకేష్ అన్నారు.,అమరావతి పునఃప్రారంభోత్సవం సందర్భంగా తన ప్రసంగంలోని కొన్ని మాటలు, నరేంద్ర మోదీ ప్రసంగం, భారత సైన్యం ఉగ్రవాదులపై చేసిన దాడులకు సంబంధించిన దృశ్యాలతో కూడిన 54 సెకన్ల నిడివి గల ఓ వీడియోను ఎక్స్ లో షేర్ చేశారు.

## విజయవాడ విద్యుత్ సౌధ వద్ద సిపిఎం ధర్నా

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, ఆదాని, సెకీ, యాక్సిస్ ఒప్పందాలు రద్దు చేయాలని విజయవాడ గుణదల విద్యుత్ సౌధ వద్ద సీపీఎం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు. అదానీ సెకీ ఒప్పందాలు రద్దు చేయాలని అదానీ ఫోటో ఫ్లెక్సీ దగ్ధం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, సిపిఎం నేతలు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. కార్యకర్తలను, నేతలను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కార్యకర్తలు ప్రతిఘటించారు. పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని నినాదాలు చేశారు. విద్యుత్ సౌధ గేటు వద్ద బయటాయించి అవినీతి ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కే శ్రీదేవి ,బోయి సత్యబాబు, బి. రమణ, పి. కృష్ణ, నగర నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ విద్యుత్తు సౌధ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

8-5-25 TERA PAGE 8.qxd:8-5-25 TERA PAGE 8.qxd 1/1/02 5:46 AM Page 1



# సమ్మర్‌లో ఎంజాయ్‌మెంట్ మూవీ 'సింగిల్'


హీరో శ్రీవిష్ణు

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్ లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ పాటలు సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. సింగిల్ మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. అందరికీ నమస్కారం. మీ అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉంది. మే 9న సింగిల్ సినిమా రిలీజ్ కాబోతుంది. మొదటి నుంచి చివరి వరకు ప్రేక్షకుల్ని నవ్వించాలనే ఉద్దేశంతో తీసిన సినిమా ఇది. కొత్త కథ, స్క్రీన్ ప్లే ఉంటుంది. బ్యూటిఫుల్ లవ్ స్టోరీ. ఇంటర్వెల్ క్లైమాక్స్ కొత్తగా ఉంటాయి. అన్ని సన్నివేశాలు కూడా మనల్ని మనం రిలేట్ చేసుకునేలా ఉంటాయి. యంగ్స్టర్స్ అందరికీ చాలా బాగా కనెక్ట్ అవుతుంది. అలాగే ఫ్యామిలీస్ కూడా హ్యాపీగా సినిమా చూడొచ్చు. మేము అనుకున్నది స్క్రీన్ మీదకి చాలా అద్భుతంగా వచ్చింది. ఆడియన్స్ సినిమా చూసి మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. గీతా ఆర్ట్స్‌లో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఎప్పటినుంచో గీతా ఆర్ట్స్‌లో చేయాలి. లక్కీగా ఈ సినిమా కుదిరింది 100 కాన్ఫిడెన్స్ ఉన్న జోనర్ ఇది. ఈ జోనర్‌లో గీత ఆర్ట్స్‌తో చేయడం వెరీ వెరీ హ్యాపీ. డైరెక్టర్ కార్తీక్ రాజుతో నాకు టూ ఇయర్స్ ట్రావెల్ ఉంది. చాలా మంచి టీంతో కలిసి సినిమా చేశాం. సినిమా చూసి అందరూ హ్యాపీగా నవ్వుకుంటారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**డైరెక్టర్ కార్తీక్ రాజు ఈ సినిమా కథ చెప్పినప్పుడు.. ఫైనల్ అవుట్ చూసుకున్నాక మీకు ఎలా అనిపించింది?** కథ చెప్పినప్పుడు చాలా మంచి ఎంట ర్టైనర్ అవుతుందని నమ్మకం కలిగింది. ఫైనల్‌గా సినిమా చూసుకున్న తర్వాత చాలా పెద్ద ఎంటర్టైనర్ అవుతుందని అనిపించింది.

**టైటిల్ సింగల్ అన్నారు.. ఇద్దరు హీరోయిన్స్ ఉన్నారు?** చాలా కొత్త క్లైమాక్స్ ఇది. అందరికీ నచ్చుతుంది. నా క్యారెక్టర్, వెన్నెల కిషోర్ క్యారెక్టర్. ఇద్దరు హీరోయిన్స్ క్యారెక్టర్స్‌ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ నాలుగు క్యారెక్టర్లు కూడా ఆడియన్స్‌కి చాలా నచ్చుతాయి. క్లైమాక్స్ చాలా యూనిక్‌గా ఉంటుంది. అందరిని ఎంటర్టైన్ చేస్తుంది.

**వెన్నెల కిషోర్ క్యారెక్టర్ గురించి?** మా ఇద్దరిలో ఎవరి క్యారెక్టర్ లేకపోయినా ఈ సినిమా లేదు. సినిమా చూసిన తర్వాత అది మీకే అనిపిస్తుంది. కిషోర్ వచ్చిన తర్వాతే ఈ ప్రాజెక్టుని 100 చేస్తున్నామని భావించాం.

**మీరు ఒక క్యారెక్టర్‌కి ఒక క్యారెక్టర్‌కి ట్రాన్స్ఫర్మేషన్ ప్రాసెస్‌ని ఎలా చూస్తారు?** నేను ప్రతి క్యారెక్టర్ నీ ఎంజాయ్ చేస్తాను. డైరెక్టర్‌తోనే ఎక్కువ ట్రావెల్ చేస్తాను. ఆ ట్రావెల్ లోనే 50 వచ్చేస్తుంది. తర్వాత లొకేషన్‌లో ఇంకొంత క్యారెక్టర్ మీద కమాండ్ పెరుగుతుంది.


**మీరు డైలాగ్స్‌లో సపరేట్‌గా ఒక డిక్షన్ సృష్టించుకున్నారు.. దానికోసం ఎలాంటి ప్రాక్టీస్ చేస్తుంటారు?** ముఖ్యంగా యంగ్స్టర్స్ ఆ డైలాగ్ డిక్షన్‌ని చాలా ఎంజాయ్ చేస్తున్నారు. వాళ్ళ కోసం నేను సపరేట్‌గా కేర్ తీసుకుని చేస్తున్నాను.

# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'శుభం'



ప్రముఖ నటి సమంత నిర్మాతగా ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద నిర్మిస్తున్న చిత్రం శుభం. ఈ సినిమాకు ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించారు. ఈ మూవీకి వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ క్రమంలో మంగళవారం నాడు సమంత మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన విశేషాలివే..నటిగా ఓ శుక్రవారం ఎలా ఉంటుందో నాకు అనుభవం ఉంది. కానీ నిర్మాతగా ఇది నాకు మొదటి శుక్రవారం. ఎంతో నర్వెస్‌గా ఉన్నాను. నిర్మాతకు ఎన్ని కష్టాలు ఉంటాయో నాకు ఇప్పుడు అర్థం అవుతోంది. గత వారం రోజులుగా నిద్రలేని రాత్రులే గడుపుతున్నాను. పోస్ట్ ప్రొడక్షన్ టీం, మిక్సింగ్ టీం, ఎడిటింగ్ ఇలా అందరూ నిద్ర లేకుండా పని చేస్తున్నారు. నాకు నా టీం మీద మరింత గౌరవం పెరిగింది. శుభం చిత్రం చాలా బాగా వచ్చింది. మంచి కథ. సినిమాపై నాకు చాలా నమ్మకం ఉంది. నటిగా నేను ఎంతో చూశాను. ఎంతో అభిమానం లభించింది. కానీ ఇంకా ఏదో చేయాలనే తపన, కోరిక మాత్రం ఉంటూ వచ్చింది. నేను తీసుకున్న ఆ బ్రేక్ టైంలో చాలా ఆలోచించాను. హీరోయిన్‌గా నేను ఏ సినిమాలు చేయలేకపోయాను. అసలు ఇక సినిమాల్లో నటిస్తానో కూడా తెలియని సమయంలో నిర్మాతగా మారాలనే ఆలోచన వచ్చింది. నటించకపోతేనేం సినిమాలు నిర్మించొచ్చు కదా అని అనుకున్నాను. కెరీర్ మొదలు పెట్టి దాదాపు 15 ఏళ్లు అయింది. నాకు ఇంత అనుభవం ఉంది కదా అని ప్రొడక్షన్ కంపెనీ స్టార్ట్ చేశాను. ఎలాంటి హడావిడి లేకుండా సినిమాను ప్రారంభించాం. 8 నెలల్లోనే చిత్రాన్ని పూర్తి చేశాం. ఇప్పుడు ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తున్నాం. శుభం అనే టైటిల్ పెట్టడానికి కారణం ఉంది. ఈ చిత్రంలో ఎక్కువగా సీరియల్ గురించి ఉంటుంది.. ఆ సీరియల్‌లో శుభం కార్డ్ ఎప్పుడు పడుతుందా? అని అంతా ఎదురుచూస్తుంటారు. అందుకే ఆ టైటిల్ పెట్టాం. ఇక నా ప్రొడక్షన్ కంపెనీకి ట్రా లా లా అని పెట్టడానికి కూడా కారణం ఉంది. చిన్నప్పుడు బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్ అనే పద్యం ఉండేది. అందుకే ట్రా లా లా అని పెట్టాం. గౌతమ్ మీనన్ నాకు మొదటి ఛాన్స్ ఇచ్చారు. ఆయన తల్చుకుంటే ఆ టైంలో ఏ టాప్ హీరోయిన్ అయినా నటించే వారు. కానీ ఆయన నాలాంటి కొత్త వారికి అవకాశం ఇచ్చారు. నేను కూడా నిర్మాతగా కొత్త వారిని ఎంకరేజ్ చేయాలనే లక్ష్యంతోనే ఉన్నాను. ఎన్నో కలలు కంటూ సినిమా పరిశ్రమలోకి వస్తారు. మా చిత్రం కోసం శ్రియా, శ్రావణి, షాలినీలు ఎంతో కష్టపడ్డారు. నా సినిమాలో నటించిన వారందరినీ చూస్తే నా పాత రోజులన్నీ గుర్తుకు వచ్చాయి. నటిగా ఉన్నప్పుడు నిర్మాత కష్టాలేవీ నాకు అర్థం కాలేదు. ఒక్క రోజు ఒక్క సీన్ అనుకున్నట్టుగా జరగకపోతే ఎంత నష్టం వస్తుంది.. డబ్బు ఎంత వృథా అవుతుందో నాకు ఇప్పుడు తెలిసి వచ్చింది. ఎంతో మంది టైం వేస్ట్ అవుతుందని అర్థమైంది. శుభం చిత్రంలోని కేమియో పాత్రని నేను చేయాల్సింది కాదు. కానీ నిర్మాతగా మొదటి సారిగా నేను ఎవరి దగ్గరకు వెళ్లి ఫేవర్ అడగాలని అనుకోలేదు. అందుకే ఆ పాత్రను నేనే పోషించాను. నేను ఈ మూవీని ఇంకో మూడు, నాలుగు రోజులు మాత్రమే ప్రమోట్ చేయగలను. కానీ ఆ తరువాత ఈ మూవీ భారమంతా ప్రేక్షకుల మీదే ఉంటుంది. శుభం చిత్రానికి ఎంత ఖర్చు పెట్టాలో అంత ఖర్చు పెట్టాం. సినిమా చూస్తే అందరికీ ఆ విషయం అర్థం అవుతుంది. తక్కువ పెట్టలేదు.. అలా అని ఎక్కువ ఖర్చు పెట్టలేదు. ప్రతీ సినిమాకు, కథకు ఎంత కావాలో అంత ఖర్చు పెట్టాల్సి వస్తుంది.

## 'కన్నప్ప' విష్ణు మంచు గ్లోబల్ ప్రమోషన్స్..



డైనమిక్ స్టార్ విష్ణు మంచు తన డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పను ఓ మైలు రాయి చిత్రంగా మలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మార్కెట్‌ను స్టడీ చేస్తూ గ్లోబల్‌గా ప్రమోట్ చేసేందుకు రెడీ అవుతున్నారు. విష్ణు మంచు నటించిన ఈ హిస్టారికల్ మూవీ ప్రమోషన్స్‌ను అమెరికా నుంచి ప్రారంభించబోతున్నారు. కన్నప్పయుఎస్ టూర్ మే 8న న్యూజెర్సీలో ప్రారంభం కానుంది. అక్కడ విష్ణు నార్త్ బ్రున్స్ విక్‌లోని రీగల్ కామర్స్ సెంటర్‌లో అభిమానులతో ముచ్చటించనున్నారు.మే 9న డల్లాస్‌కు బయలుదేరి వెళ్లి సాయంత్రం 7 గంటలకు గెలాక్సీ థియేటర్స్ గ్రాండ్ స్కేప్, ది కాలనీ, టెక్సాస్‌లో ప్రేక్షకులతో సందడి చేయనున్నారు. ఈ పర్యటన మే 10న శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో ముగుస్తుంది. అక్కడ ఆయన ఉదయం 10:30 గంటలకు సినీ లాంజ్ ఫ్రీమాంట్ 7 సినిమాస్‌ను సందర్శిస్తారు. ఈ చిత్రం ఓవర్సీస్ విడుదలను వాసారా చూసుకుంటోంది. అనంతరం ఇండియాకు తిరిగి రానున్న విష్ణు.. దేశంలోని పలు నగరాల్ని చుట్టి రానున్నారు. ఆధ్యాత్మిక తీర్థయాత్రలు, అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడానికి, అన్ని ప్రాంతాల మీడియాతో విష్ణు మంచు ఇంటరాక్ట్ కానున్నారు. కన్నప్ప నుంచి వచ్చిన భక్తి గీతం "శివా శివా శంకరా" విడుదలైనప్పటి నుంచి పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని లవ్ ట్రాక్ కూడా అందరినీ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు అందరి దృష్టి కన్నప్ప ట్రైలర్‌పై ఉందన్న సంగతి తెలిసిందే.

# అందరినీ ఆకట్టుకునే '6జర్నీ'


దర్శకుడు బసీర్

రవి ప్రకాష్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యా రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో పాల్యం శేషమ్మ, బసిరెడ్డి సమర్పణలో అరుణ కుమారి ఫిలింస్ బ్యానర్ పై రూపొందిన చిత్రం 6జర్నీ. బసీర్ ఆలూరి దర్శకత్వంలో పాల్యం రవి ప్రకాష్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సెన్సార్ సహా అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 9న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బసీర్ మాట్లాడుతూ,సినిమా ఇండస్ట్రీలో ఎన్నో కష్టాలు పడ్డాను. ఇది వరకు తెలుగులో సమరం, కన్నడలో మరో చిత్రాన్ని చేశాను. ఇప్పుడు నా మూడో సినిమా 6 జర్నీ అంటూ ఆడియెన్స్ ముందుకు వస్తున్నాను. ఇది ఆరుగురి జీవిత ప్రయాణం. గోవా ట్రిప్‌ను ఎంజాయ్ చేసి సూసైడ్ చేసుకోవాలని అనుకునే ఓ బ్యాచ్ కథే 6జర్నీ. అలాంటి వారి ప్రయాణంలో ఎదురైన పరిస్థితులు ఏంటి? అన్నది ఈ సినిమా కథ. సమీర్, పల్లవి జంట అద్భుతంగా నటించింది. కొత్త అబ్బాయి విలన్‌గా అభిరాం చక్కగా నటించారు. కొత్త మ్యూజిక్ డైరెక్టర్, కొత్త ఫైట్ మాస్టర్ ఇలా అందరూ అద్భుతంగా పని చేశారు. నిర్మాతది మా ఊరే. ఆయనకు సినిమా అంటే చాలా ఇష్టం. ఈ కథ ఆయనకు నచ్చడంతో ప్రాజెక్ట్ ముందుకు వచ్చింది. వర్షాకాలంలో ఈ మూవీ షూటింగ్ చేశాం. షూటింగ్ సమయంలో ఎన్నో కష్టాలు వచ్చాయి. ప్రకృతి మాకు ఎంతో సహకరించింది. ఎన్ని అడ్డంకులు వచ్చినా షూటింగ్ సక్సెస్ ఫుల్‌గా కంప్లీట్ చేశాం. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎస్ సింహా మంచి పాటల్ని ఇచ్చారు. మంచి సంగీతం, మంచి పాటలున్నాయి. ఆల్రెడీ మా పాట యూట్యూబ్‌లో ట్రెండ్‌అవుతున్నాయి. మంచి కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టు కుంటుంది. క్లైమాక్స్ చాలా గొప్పగా ఉంటుంది. శ్రీరాముడు పుట్టిన నేల మీద ఉగ్రవాదులు దాడి చేయడం ఏంటి? ఇక్కడ యువత ఎలా పోరాడాలి అంటూ దేశ భక్తిని రేకెత్తించేలా క్లైమాక్స్‌ను అద్భుతంగా తెరకెక్కించాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు తగ్గట్టుగా క్లైమాక్స్ ఉంటుంది. సినిమా పూర్తిగా టెర్రరిజం మీదే నడుస్తుంది. అనుకున్న బడ్జెట్ కంటే కాస్త ఎక్కువే అయింది. బోర్డర్‌లో సినిమా షూటింగ్, వర్షాకాలం అవ్వడంతో కాస్త బడ్జెట్ పెరిగింది. మళ్లీఅక్టోబర్‌లో ఓసినిమాను చేయబోతోన్నాను.ముంబై బ్యాక్ డ్రాప్‌లో ఆ చిత్రం ఉంటుంది. ఇంకా చర్చలు జరుగుతున్నాయి.

## 'కింగ్‌డమ్' సాంగ్ రీల్ చేయాలంటూ రిక్వెస్ట్, వీడియో వైరల్



తన కొత్త సినిమా 'కింగ్డమ్' రిలీజ్‌కు రెడీఅవుతున్న నేపథ్యంలో మూవీ ప్రమోషన్‌ను డిఫరెంట్‌గా చేస్తున్నారు హీరో విజయ్ దేవరకొండ. ఆయన తాజాగా ముంబై ఇండియన్స్ ప్లేయర్ తిలక్ వర్మతో కలిసి పికిల్ బాల్ మ్యాచ్ ఆడారు. ఈ మ్యాచ్ బెస్ట్ ఆఫ్ త్రీలో తనను ఓడిస్తే ముంబయి ఇండియన్స్ జెర్సీ వేసు కుంటానని తిలక్ వర్మకు విజయ్ దేవరకొండ ఛాలెంజ్ విసిరారు. ఈ పికిల్ బాల్ మ్యాచ్‌లో 21తో విజయ్ టీమ్ గెలుపొందింది. ఈ మ్యాచ్ వీడియోను ముంబై ఇండియన్స్ టీమ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఈ వీడియోకు పెద్ద ఎత్తున నెటిజన్స్, సెలబ్రిటీలు స్పందిస్తున్నారు. విజయ్ కూడా ఈ వీడియోకు స్పందిస్తూ తన కొత్త సినిమా కింగ్డమ్‌లోని హృదయం లోపల సాంగ్‌కు రీల్ చేయాలని తిలక్ వర్మ, రాజంగడ్‌ను కోరారు. హైదరాబాద్‌లో జరిగే ప్లేఆఫ్స్‌కు వస్తానని, ముంబయి టీమ్‌ను సపోర్ట్ చేస్తానని తెలిపారు. వాంఖేడే స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో ముంబై ఇండియన్స్ పోరుకు రెడీ అవుతోంది. కింగ్డమ్ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందిస్తున్నారు. కింగ్డమ్ సినిమా ఈ నెల 30న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా మీద ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి.


రెజీనా నయా లుక్

# '23' ట్రైలర్ లాంచ్

మల్లేశం, 8 ఎ.ఎం. మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుంచి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 23 తో వస్తున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఈ సినిమాని స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. సినిమా మే 16న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో ప్రియదర్శి, ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ చీఫ్ గెస్ట్‌లుగా హాజరైన ఈ వేడుక గ్రాండ్‌గా జరిగింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ వేడుకలో అందరూ కూడా మనసు అంతరాళంలో నుంచి మాట్లాడినట్టుగా అనిపించింది. డైరెక్టర్ రాజ్ వజ్ర సంకల్పంతో సినిమా తీస్తారు. నిలువెత్తు నిజాయితీ ఉన్న డైరెక్టర్ ఆయన. ఆయనలోని నిజాయితీ 23 సినిమాలో పనిచేసిన నటీనటులు టెక్నీషియన్స్ అందరిలోకి ప్రవహించి అందరూ కూడా చాలా నిజాయితీగా ఈ సినిమాకి పనిచేశారు. ఈ సినిమా కోసం పాటలు రాయడానికి సినిమాని చూడటం జరిగింది. సినిమా చూసిన తర్వాత దీనికి పాటలు రాయడం కంటే ఇంత మంచి సినిమాని ఆడియన్స్ లోకి ఎలా తీసుకెళ్లాలి, ఎలా రిలీజ్ చేయాలనే ఆలోచన ఎక్కువైంది. సృజనాత్మకతకి పెద్దపీట వేసే దర్శకుడు రాజ్. ఈ సినిమాలో మంచి సాహిత్యం రాసే అవకాశం దొరికింది. ఈ సినిమాలో నటించిన నటీనటులంతా చాలా సహజంగా పాత్రలలో ఒదిగిపోయారు. అసలు నటిస్తున్నారనే భావనే కలగలేదు. అంతా సహజ సిద్ధంగా ఉంది. ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించబోతుంది. నటనపరంగా మరో స్థాయిలో ఉండబోతుందని నమ్మకం నాకు ఉంది. మల్లేశం సినిమా ప్రియదర్శికి ఎలా నటుడిగా జన్మనిచ్చిందో ఈ సినిమా కూడా ఇందులో నటించిన నటీనటులందరికీ కొత్త జన్మ ఇవ్వాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో మూడు పాటలు రాసే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రాజ్‌కి మరొకసారి ధన్యవాదాలు అన్నారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఐదేళ్ల క్రితం ఇదే వేదిక మీద మల్లేశం ప్రి రిలీజ్ ఈవెంట్ చేశాం. ఈ వేడుకకు నన్ను ఇన్వైట్ చేసిన రాజ్‌కి థాంక్యూ. నా కెరీర్‌కి కొత్త ఊపిరినిచ్చిన వ్యక్తి రాజ్. ఆ కృతజ్ఞతతో ఈ వేడుకకి రావడం జరిగింది. నాకు మల్లేశం లాంటి మంచి సినిమానిచ్చిన రాజ్‌కి ఈ వేదిక మీద హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 23 సినిమా కథ నాకు తెలుసు. ఈ కథని చేయమని రాజ్ నా దగ్గరికి వచ్చారు. కొన్ని వేరే ప్రాజెక్ట్స్ వల్ల నేను చేయడం కుదరలేదు. చాలా గొప్ప సినిమా ఇది. ఇలాంటి గొప్ప ఆలోచన, కథతో ప్రేక్షకులు ముందుకు వస్తున్న రాజ్‌ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. చరిత్రలో ఇలాంటి ప్రశ్నలు అడగడం చాలా అవసరం. రాజుగారు లాంటి డైరెక్టర్ ప్రొడ్యూసర్ ఉండడం తెలుగు సినిమా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. డైరెక్టర్ రాజ్ రాచకొండ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. చాలా స్ట్రాంగ్ టెక్నికల్ టీంతో చేసిన సినిమా 23. మార్క్ మ్యూజిక్ చేశారు. చంద్రబోస్, ఇండస్, రెహమాన్ లాంటి రచయితలు సినిమాకి పాటలు రాశారు. కార్తీక్, చిన్మయి, రమ్య బెహరా, కైలాష్ ఖేర్ లాంటి ప్రముఖ సింగర్స్ పాటలు పాడారు. చిన్న సినిమాల్లో ఇది చాలా పెద్ద సినిమా. థియేటర్ కోసం చాలా శ్రద్ధ తీసుకుని టెక్నికల్‌గా చాలా ఫోకస్‌తో చేసిన సినిమా ఇది. ఇది థియేటర్‌కి పర్ఫెక్ట్ సినిమా. దయచేసి ఈ సినిమాని థియేటర్స్‌లో చూడండి. అక్కడ చూస్తే ఓటిటిలో కూడా ఎంకరేజ్మెంట్ ఉంటుంది. ఇలాంటి సినిమాలు థియేటర్స్‌లో ఆడితే థియేటర్స్ కల్చర్ బావుంటుంది. ఇక్కడ పని చేసిన అందరూ కూడా ఫ్యూచర్లో పెద్ద సినిమాలకి వర్క్ చేస్తారు. ఇలాంటి సినిమాలుని ప్రభుత్వాలు కూడా ఎంకరేజ్ చేయాలని రిక్వెస్ట్ చేశాను. కమర్షియల్ క్యాలి క్యులేషన్స్‌తో చేసిన సినిమా కాదిది. ఇలాంటి సినిమాలను మీడియా కూడా కాస్త ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాకి అందరి సహకారం ఉండాలని కోరుతున్నాను అన్నారు. తన్మై మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నా తొలి సినిమాకే చంద్రబోస్ లిరిక్స్ రాయడం గొప్ప ఆనందాన్నిచ్చింది. ఇందులో ప్రతిపాట మాజర్నీని తెలియ జేస్తుంది. అంత బ్యూటి ఫుల్‌గా లిరిక్స్ రాసిన చంద్రబాబుకి ధన్యవాదాలు.



# ఇండస్ట్రీలో తమన్నా రెండు దశాబ్దాలు పూర్తి..



మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు దాటింది. అయినా కూడా జోరు తగ్గడం లేదు. ఇప్పటి వరకు మిల్కీ బ్యూటీ తమన్నా వరుస సినిమాలతో బిజీ బిజీగానే ఉంది. కొన్నాళ్ల క్రితం మిల్కీ బ్యూటీ తమన్నా పనై పోయింది అంటూ కొందరు కామెంట్ చేశారు. ఆ సమయంలోనే తమన్నా సినిమాలకు గుడ్ బై చెబుతుందేమో అని అంతా అనుకున్నారు. కానీ ఆమె పట్టుదలతో సినిమాల్లో కొనసాగింది. ఆ సమయంలో కాస్త ఆఫర్లు తగ్గినా కూడా వెబ్ సిరీస్‌లు, ఐటెం సాంగ్స్‌తో కెరీర్‌ను నిలబెట్టుకుంది. ఇప్పుడు మరోసారి తమన్నా కెరీర్ పీక్స్‌లో ఉంది. హిందీ, తెలుగు భాషల్లోనే కాకుండా ఇతర భాషల్లో కూడా వరుస సినిమాలు చేస్తోంది. ఇటీవల ఈమె ఓదెల 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో లేడీ అఘోరి పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. శివశక్తి పాత్రతో ఓదెల సినిమాలో అద్భుతమైన నటన కనబర్చిన తమన్నా మరో సారి తన నట విశ్వరూపం చూపించింది. తెలుగులో చాలా రోజుల తర్వాత తమన్నా చేసిన ఓదెల 2 నిరాశ పరచింది. అయినా కూడా ఆమె మరిన్ని సినిమాల్లో నటించేందుకు ఆ సినిమా బూస్ట్‌గా నిలిచింది అనడంలో సందేహం లేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా ఇప్పటికీ ఆమెకు ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలోనూ ఆమె ఫాలోయింగ్ అదే స్థాయిలో ఉంది.ఇన్‌స్టాగ్రామ్‌లో తమన్నాకి దాదాపుగా మూడు కోట్ల మంది ఫాలోవర్స్ ఉంటారు. వారిని ఎంటర్‌టైన్ చేసేందుకు గాను అందాల ఆరబోత ఫోటోలతో రెగ్యులర్‌గా రెచ్చి పోతూనే ఉంటుంది. తాజాగా మరోసారి మిల్కీ బ్యూటీ రెడ్ డ్రెస్‌లో తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగా హీరోయిన్స్ రెడ్ డ్రెస్‌లో చాలా అందంగా కనిపిస్తూ ఉంటారు. తమన్నా ఈ ఫోటోల్లో మరింత అందంగా కనిపిస్తుంది అంటూ అభిమానులు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమెపై అభిమానంను మరింత పెంచే విధంగా ఉన్నాయని, ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20ఏళ్లు అయిందంటే నమ్మశక్యంగా లేదని కొందరు అంటున్నారు. ఈ ఏడాది ఇప్పటికే ఓదెల 2, రైడ్ 2 సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తమన్నా మరో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. కేవలం హీరోయిన్‌గానే నటిస్తాను అనే పట్టింపు లేకుండా వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్‌ను ఈ అమ్మడు స్వాధీనం చేసుకుంటూ దూసుకుపోతుంది.

# టెన్షన్‌గా ప్లే ఆఫ్ రేస్

## మారుతున్న సమీకరణాలు

## ఆ నాలుగు జట్లకే అవకాశాలు

## పాయింట్ల పట్టికలో అనూహ్య పరిణామాలు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 18 లీగ్ మ్యాచ్‌లు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ మెగా క్రికెట్ టోర్నీలో ఇప్పటికే 57 మ్యాచ్ లు పూర్తయ్యాయి. లీగ్ దశలో ఇంకా 14 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. మరోవైపు ప్లే ఆఫ్ రేస్ జట్లలో టెన్షన్ పుట్టిస్తున్నాయి. ప్లే ఆఫ్ రేస్‌కు చేరుకునేందుకు టీములు పట్టుదలతో సతాత చూపిస్తుండటంతో ఐపీఎల్ లీగ్ దశ మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 56 మ్యాచ్‌ల తర్వాత, గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండవ స్థానంలో ఉండగా, పంజాబ్‌కింగ్స్, ముంబై ఇండియన్స్ వరుసగా3,4 స్థానాల్లో ఉన్నాయి. మిగిలిన మూడు జట్లు, లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ప్లే ఆఫ్ రేసులో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో క్రికెట్ దిగ్గజాలు ప్లే ఆఫ్ రేస్‌లో ఏ ఏ జట్లు చేరుకునేఅవకాశాలు ఉన్నాయనేదానిపై తర్జన భర్జనలు పడుతున్నారు. ఈ ఏడు జట్లలో ఈసారి ప్లేఆఫ్స్‌లో ఆడే 4 జట్లను అంచనా వేస్తున్నారు. ఈ అంచనాల ప్రకారం ఈసారి గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్‌కు చేరుకోవడం ఖాయం. మంచి ప్రదర్శన ఇస్తున్న శుభ్‌మాన్ గిల్ జట్టు మిగతా అన్ని జట్లను అధిగమించి ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుందని లెక్కలుకడుతున్నారు. అదేవిధంగా, అక్షర్ పటేల్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కూడాతదుపరిస్థాయికి చేరుకుంటుందని అభిప్రాయపడుతు న్నారు. ఇదే సమయంలో ఈసారి ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బాగారాణించింది. అందువల్ల లీగ్ దశ ముగిసే సమయానికి ప్లే ఆఫ్స్‌కు కూడా చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంలోని పంజాబ్ కింగ్స్ జట్టు మంచి ప్రదర్శన చేస్తోంది. అందువల్ల, ఈసారి పంజాబ్‌ను ప్లే ఆఫ్ రౌండ్‌లో కూడా చూడవచ్చని స్పష్టం చేస్తున్నారు. అదేవిధంగా ముంబై ఇండియన్స్ కూడా నాల్గవ జట్టుగా ప్లే ఆఫ్ రౌండ్‌లో కనిపిస్తుంది. హార్దిక్ పాండ్యా నేతృత్వంలోని ముంబై ఇండియన్స్ జట్టు వరుసగా 6 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అందువల్ల, మిగిలిన మ్యాచ్‌లలో మంచి ప్రదర్శనతో ముంబై ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే పాయింట్ల ఇంత వరకూ టాప్‌లో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ పరిస్థితి పట్టికలో రెండో స్థానంలోకి దిగజారింది. మిగిలిన జుట్లు పట్టుదలను ప్రదర్శించి పాయింట్ల పట్టికలో పై పైకి చేరుకుంటుండటంతో రాయల్ ఛాలెజర్స్ ప్లే ఆఫ్ రేస్‌లో ఎంత వరకూ నిలబడగలుగుతుందనేదానిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి.

# బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లో..

# సింధుకు 16వ స్థానం

## 10వ స్థానంలో నిలిచిన ట్రీసా-గాయత్రి

## పడిపోయిన లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్ జోడీ



**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బిడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో భారత్ జోడీ సాత్విక్-చిరాగ్ 18వ స్థానానికి పడిపోయింది. అదే సమయంలో పివి సింధు 16వ స్థానానికి ఎగబాకింది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ స్విస్ ఓపెన్ తర్వాత ఆటకు దూరంగా ఉన్నప్పటికీ 10వ స్థానంలో నిలిచారు. గాయాల కారణంగా ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ తర్వాత ఆటకు దూరంగా ఉన్న సాత్విక్-సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి తాజాగా విడుదల చేసిన బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ర్యాంకింగ్స్‌లో పెద్ద దెబ్బ తిన్నారు. పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో మాజీ ప్రపంచ నంబర్ 1 సాత్విక్ చిరాగ్ 11వ స్థానం నుండి 18వ స్థానానికి పడిపోయాడు. ఇటీవల జరిగిన సుదిర్మాన్ కప్‌లో భారతదేశం తరపున నాకౌట్ దశకు చేరుకోలేకపోయిన ఏకైక పురుషుల జంట హరిహరన్ అంసకరుణన్ మరియు రూబన్ కుమార్ రెతినసబాపతి 41వ స్థానానికి చేరుకున్నారు. ఇక మహిళల సింగిల్స్‌లో, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, మాజీ ప్రపంచ ఛాంపియన్ పివి సింధు 18వ స్థానం నుండి 16వ స్థానానికి ఎగబాకింది. 29 ఏళ్ల సింధు సుదిర్మాన్ కప్‌లో తన రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. మరోపక్క ఫామ్‌ను కనుగొనడంలో ఇబ్బంది పడుతోంది. ఇక ఇతర భారత్ క్రీడాకారులు మాల్వికా బన్సోద్ (23వ స్థానం), రక్షిత శ్రీ (41వ స్థానం), అనుపమ ఉపాధ్యాయ (42వ స్థానం) మరియు ఆకర్షి కశ్యప్ (47వ స్థానం) టాప్ 50లో ఉన్నారు. కాగా మహిళల డబుల్స్‌లో, ట్రీసా జాలీ మరియు గాయత్రి గోపీచంద్ స్విస్ ఓపెన్ తర్వాత ఆటకు దూరంగా ఉన్నప్పటికీ 10వ స్థానంలో నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో, కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత లక్ష్య సేన్ 18వ స్థానం నుండి 19వ స్థానానికి పడిపోయాడు, ఆసియా క్రీడల కాంస్య పతక విజేత హెచ్ఎస్ ప్రణయ్ 30వ స్థానం నుండి 35వ స్థానానికి పడిపోయాడు. ప్రియషు రాజవత్ 36వ స్థానం నుండి 33వ స్థానానికి ఎగబాకాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత అగ్రశ్రేణి జోడీ ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో 18వ స్థానం నుంచి 19వ స్థానానికి పడిపోయారు.

# మహిళల ట్రై సిరీస్ ఫైనల్‌కు భారత్

## దక్షిణాఫ్రికాపై 23 పరుగుల తేడాతో గెలుపు?



**న్యూఢిల్లీ:** వన్డే ట్రై సిరీస్లో భారత మహిళల జట్టు ఫైనల్ కు దూసుకెళ్లింది. ఈ సిరీస్ లో మూడో విజయాన్ని అందుకొని ఫైనల్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకుంది. శ్రీలంక వేదికగా బుధవారం దక్షిణాఫ్రికా మహిళలతో హోరాహోరీగా సాగిన మ్యాచ్ లో 23 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ జెమీమా రోడ్రిగ్స్ (101 బంతుల్లో 123 పరుగులు, 15 ఫోర్లు, సిక్సర్) మెరుపు సెంచరీకి తోడు బౌలర్లు సమిష్టిగా రాణించడంతో అలవోకంగా గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 314 పరుగులకు పరిమితమైంది. 338 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. లారా గూడాల్ ను 4 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అమన్ జ్యోత్ కౌర్ ఔట్ చేసింది. ఈ దశలో బ్రిట్స్, స్మిత్ రెండో వికెట్ కు 63 పరుగులు జోడించి ఇన్నింగ్స్ ను చక్కదిద్దారు. ఇండియా విజయం ఖాయమన్న దశలో సఫారీ కెప్టెన్ చార్లీ ట్రయాన్ మెరుపులు మెరిపించి కౌర్ సేనను భయపెట్టింది. 43 బంతుల్లోనే 67 పరుగులు చేసి మ్యాచ్ చివరి వరకు పోరాడింది. అయితే కొట్టాల్సిన లక్ష్యం ఎక్కువగా ఉండడంతో విజయానికి 23 పరుగుల దూరంలో ఆగిపోయింది. అంతకు ముందు మొదట బ్యాటింగ్ చేసిన భారత మహిళలు 337 పరుగుల భారీ స్కోర్ చేశారు. ప్రారంభంలోనే రెండు వికెట్లు కోల్పోయినా స్మృతి మందాన, హర్మన్ ప్రీత్ కౌర్ దూకుడుగా బ్యాటింగ్ చేశారు. స్మృతి హాఫ్ సెంచరీ ఔటైన తర్వాత రోడ్రిగ్స్, దీప్తి శర్మ (93) సౌతాఫ్రికా బౌలర్లను దంచి కొట్టారు. దీప్తి 7 పరుగులతో సెంచరీని కోల్పోయింది. ఐదో వికెట్ కు 122 పరుగులు జోడించి జట్టు స్కోర్ ను 337 పరుగులకు చేర్చించారు.

# ఖేలో ఇండియాలో.. మెరిసిన తెలంగాణ

## ఈతలో 3 బంగారు పతకాలు



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2025 స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఈతగాళ్ళు అద్భుతమైన ముద్ర వేశారు. వివిధ విభాగాలలో మూడు బంగారు పతకాలను సాధించారు. పోటీల రెండో రోజున తెలంగాణకు స్విమ్మింగ్‌లో మూడు స్వర్ణాలు సహా సైక్లింగ్‌లో కాంస్యం దక్కింది. బీహార్‌లోని గయా వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్లు తమ సత్తా చాటి పసిడి పతకాలతో అదరగొట్టారు. పురుషుల 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వర్షిత్ ధూలిపూడి 4:38:39 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం కైవసం చేసుకున్నాడు. పురుషుల 100మీటర్ల బ్యాక్ స్ట్రోక్ ఈవెంట్‌లో మైలారి సుహాస్ ప్రీతమ్ 58.73 సెకన్ల టైమింగ్‌తో పసిడి దక్కించుకున్నాడు. ఇక మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో సాగి శ్రీనిత్య 1:06:36 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం ఖాతాలో వేసుకుంది. 1కిలోమీటర్ ట్రాక్ సైక్లింగ్ ఈవెంట్‌లో సాయిచరణ్ యాదవ్ (1:09:56సెకన్ల టైమింగ్) మూడో స్థానంతో కాంస్యం కైవసం చేసుకున్నాడు. మొత్తంగా నాలుగు పతకాలతో తెలంగాణ ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతున్నది. ఇక రాజస్థాన్‌కు చెందిన మయాంక్ చౌదరి తన రెండవ బంగారు పతకాన్ని సాధించాడు. బాలుర 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో టైటిల్‌ను గెలుచుకున్నాడు. అంతకు ముందు రోజు అగ్రస్థానంలో నిలిచిన రాజస్థాన్ మిక్స్‌డ్ జట్టులో అతను కూడా ఉన్నాడు. మయాంక్ 239.2 పాయింట్లు సాధించి చండీగఢ్‌కు చెందిన ధైర్య ప్రషార్ (235.3) కంటే సులభంగా గెలిచాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన యుగ్ ప్రతాప్ సింగ్ రాథోడ్ 214.8 స్కోరుతో కాంస్యం గెలుచుకున్నాడు. కాగా బాలికల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ల ఈవెంట్‌లో మహారాష్ట్రకు చెందిన ప్రాచి గైక్వాడ్ కర్ణాటకకు చెందిన తిలోత్తమ సేన్‌ను ఓడించింది. తన రెండవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పాల్గొన్న ప్రాచి, మునుపటి ఎడిషన్‌లో తాను కాంస్యం గెలిచిన స్థానాన్ని మెరుగుపరుచుకుంది. తిలోత్తమ 455.6 పాయింట్లతో పోలిస్తే మహారాష్ట్ర అమ్మాయి 458.4 పాయింట్లు సాధించింది.

# చెస్ ఛాంపియన్‌షిప్ బరిలో గ్రాండ్ మాస్టర్ నిహాల్



**న్యూఢిల్లీ:** యుఎఇలోని అల్ ఐన్‌లో జరిగే ఆసియా కాంటినెంటల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరిన్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. తొమ్మిది రౌండ్ల ఈవెంట్‌లో టాప్ సీడ్ అయిన ఫామ్‌లో ఉన్న సరిన్, ఈ ఏడాది అక్టోబర్‌లో న్యూఢిల్లీలో జరగనున్న తదుపరి ప్రపంచ చెస్ కప్‌లో బెర్తుతో పాటు, అగ్ర బహుమతి కోసం పోటీపడతాడు. తదుపరి ప్రపంచ చెస్ కప్ కోసం టాప్ 10 స్థానాలు రిజర్వ్ చేయబడిన ఈ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో 18 మంది భారత గ్రాండ్‌మాస్టర్లు పాల్గొంటారు. ఇటీవలే తాష్కెంట్ ఓపెన్ గెలిచిన సరిన్, ఇప్పుడు భారతదేశం నుండి తదుపరి 2700 ఇఎల్ఒ రేటింగ్ ప్లేయర్‌గా అవతరించడానికి సమీపానికి చేరుకున్నాడు. అతడు ప్రతిష్టాత్మక మార్కుకు కేవలం ఏడు పాయింట్లు దూరంలో ఉన్నాడు. ఇరాన్‌కు చెందిన అమీన్ తబతాబాయి, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ యాకుబ్బోవ్ వంటి అనేక మంది ఆసియా దిగ్గజాలు ఉండటంతో ఈ ప్రయాణం ఆటుపోట్లుగా ఉడే అవకాశాలు ఉన్నాయి. ఇక భారత్‌కు చెందిన మరో నాల్గవ సీడ్ మురళీ కార్తికేయన్, లియోన్ ల్యూక్ మెండోంకా, ప్రస్తుత ప్రపంచ జూనియర్ ఛాంపియన్ వి. ప్రణవ్ పోడియం ఫినిషింగ్ కోసం ఇతర ప్రధాన పోటీదారులుగా ఉండే అవకాశం ఉంది.

# 18 ఎయిర్‌పోర్టులు మూసివేత



**ముంబై, మే 7:** పహల్‌గామ్ ఉగ్ర దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్ ఉగ్ర స్థావరాలపై భారత ఆర్మీ విరుచుకుపడింది. పాకిస్థాన్‌లోని తొమ్మిది స్థావరాలపై మెరుపు దాడులు చేసింది భారత సైన్యం. అయితే అంతర్జాతీయ సరిహద్దుకు దగ్గర్లోని ఉగ్రవాదుల స్థావరాలను మాత్రమే భారత్ టార్గెట్ చేసింది. అంతర్జాతీయ సరిహద్దుకు 100కి.మీ దూరంలోని బహవల్‌పూర్‌లో ఉన్న జైష్ ఏ మొహమ్మద్ ప్రధాన కార్యాలయం మురిడ్కే, సాంబా ఎదురుగా సరిహద్దుకు 30 కి.మీ దూరంలో ఉన్న లష్కరే క్యాంప్‌పై దాడి చేసింది. అయితే ఆపరేషన్ సింధూర్‌లో 80 మందికి పైగా ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఆపరేషన్ సింధూర్ కింద భారతదేశం పాకిస్తాన్‌లోని జైష్‌ఎ మొహమ్మద్, లష్కరేఎతోయిబా ప్రధాన కార్యాలయాలను లక్ష్యంగా చేసు కుంది. ఆపరేషన్ సింధూర్‌తో అప్రమత్తమైన పాక్ సరి హద్దుల్లో కాల్పులకు పాల్పడింది. దీంతో అప్రమత్తమైన భారత ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేసింది. కేవలం శ్రీనగర్ మాత్రమే కాదు..సరిహద్దులకు సమీపంలో ఉన్న జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాల ఎయిర్‌పోర్టులను కూడా తాత్కాలికంగా మూసివేశారు. ఈ విమానాశ్రయాల ద్వారా వెళ్లే విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. పాకిస్తాన్‌పై భారతదేశం వైమానిక దాడి చేసిన నేపథ్యంలో ఎయిర్ ఇండియా తన ప్రయాణీకులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. పాకిస్తాన్ పిఓకె లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడుల తర్వాత ఎయిర్ ఇండియా, ఇండిగో ఎయిర్‌లైన్స్, స్పైస్ జెట్ ప్రయాణీకులకు ముఖ్య ప్రకటన చేశాయి.. సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా ఎయిర్‌లైన్స్ ప్రయాణీకులు విమానాశ్రయానికి చేరుకోవటానికి ముందుగానే ఈ ప్రకటన గమనించాలని అభ్యర్థించింది. ఈ మేరకు బికనీర్, శ్రీనగర్, జమ్మూ, అమృత్సర్,లేహ్, చండీగఢ్, ధర్మశాల సహా అనేక నగరాలకు విమానాలు రద్దుచేసినట్టుగా సోషల్ మీడియా పోస్ట్ ద్వారా ప్రకటించారు.

# వాణిజ్యం

# ప్రభుత్వ రుణం దిగిరావాలి..




**న్యూఢిల్లీ, మే 7:** పెరిగిన ప్రభుత్వ రుణం మోస్తరు స్థాయికి దిగిరావాల్సి ఉందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్‌దత్ అన్నారు. తద్వారా వడ్డీ చెల్లింపులు తగ్గుతాయని, అప్పుడే రేటింగ్ అప్‌గ్రేడ్ అవుతుందన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. అనిశ్చితులు పెరిగిపోతున్న నేపథ్యంలో భారత్ ఏదో ఒక నిర్దిష్టమైన మార్గానికి పరిమితం కాకూడదన్నారు. 'మారుతున్న పరిణామాలకు మనం చురుగ్గా స్పందించాలి. నేడు భారత ఆర్థికవ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి సమీపించింది. మిగిలిన ప్రపంచవ్యాప్తంగా ఏం జరుగుతుంద న్నది తెలుసుకునేంత సామర్థ్యం మనకు ఉంది. ఈ దిశగా మనదైన మార్గాన్ని గుర్తించాలి' అని వివరించారు. ప్రభుత్వ రుణం ప్రస్తుత స్థాయి ల నుంచి కచ్చితంగా దిగిరావాలంటూ, అందుకు ద్రవ్య స్థిరీకరణను మార్గంగా పేర్కొన్నారు. దేశ జిడిపిలో పన్నుల వాటా దశాబ్దం క్రితం 16.5 శాతంగా ఉంటే, అది ప్రస్తు తం 18 శాతానికి చేరినట్లు అజయ్‌సేత్ తెలిపారు. ప్రస్తుత ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే, మరో 5-6యేళ్లలో 20 శాతానికి పన్నుల వాటా చేరుకోగలదన్నారు. వ్యయాల గురించి మాట్లాడుతూ, మూలధన వ్యయాలకు అనుకూలంగా తగిన సర్దుబాట్లు జరుగుతున్నట్లు చెప్పారు.

# వివాదంలో యూనియన్ బ్యాంకు

**ముంబై, మే 7:** ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వివాదంలో చిక్కుకుంది. మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు కెవి సుబ్రమణియన్ రాసిన పుస్తకాన్ని 2,00,000 కాపీలను కొనుగోలు చేసేందుకు సుమారు రూ.7.25 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఒక కథనం పేర్కొంది. వారం రోజుల క్రితమే భారత ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సుబ్రమణియన్‌ను అర్థాంతరంగా తొలగించిన విషయం విదితమే. అందుకు ప్రభుత్వం కారణాలను కూడా వివరించలేదు. సుబ్రమణియన్ పదవీకాలం ముగిసేందుకు ఇంకా ఆరు నెలలు ఉండగానే ఈ నిర్ణయం తీసుకుంది. ఇలాంటి సమయంలో యూనియన్ బ్యాంకు సుబ్రమణియన్ రాసిన పుస్తకం కొనుగోలు వ్యవహారం వివాదంగా మారింది. గతేడాది ఆగస్టులో కెవి సుబ్రమణియన్ 'ఇండియా@100' పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ పుస్తకాన్ని కస్టమర్లు, స్థానిక పాఠశాలలు, కాలేజీలు, లైబ్రరీలకు పంపిణీ చేసేందుకు కొనుగోలుచేసింది.దీనికోసం 1,89,450 పేపర్‌బ్యాక్ కాపీలను రూ.350 ధరతో, 10,422 హార్డ్‌కవర్ కాపీలను రూ.597తో ఆర్డర్ చేసింది. దీని కోసం రూ.7.25 కోట్లు ఖర్చు చేసింది. అయితే ఏ ఎంగ్లీష్ పుస్తకమైనా 10వేల కాపీలు అమ్ముడు పోవడం అరుదు.

Union Bank of India

కానీ యూనియన్ బ్యాంకు ఏకంగా 2 లక్షల కాపీలను కొనడం, ఈ పుస్తకం విడుదలకు ముందే ప్రచురించిన రూపా పబ్లికేషన్స్‌కు 50శాతం మొత్తం బ్యాంకు చెల్లించడం వివాదంగా మారింది. యూనియన్ బ్యాంకుకు చెందిన 18 జోనల్ ఆఫీసుల నుంచి 10వేల చొప్పున కాపీలు ఆర్డర్ చేయడం అనేక సందేహాలను రేకెత్తిస్తోంది.

# ఇంట్రాడేలో సెన్సెక్స్, నిఫ్టీలు పైపైకి

**ముంబై, మే 7:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఓ వైపు పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట నిర్వహించిన దాడులు మన మార్కెట్లపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. భారత్ కేవలం ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకోవడంతో పాటు ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో పాక్ ఈ సమస్యను మరింత జఠిలం చేయక పోవచ్చున్న అంచనాలు ఇందుకు తోడయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, డాలర్ బలహీనడడం అమెరికా, చైనాలో వృద్ధి నెమ్మదించడం, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం వంటివి మన మార్కెట్లకు పాజిటివ్ అంశాలుగా మారాయి. ఈ కారణంగానే భారత్ పాక్ ఉద్రిక్తతలు పెద్దగా ప్రభావం చూపలేదు. ఆరంభంలో ఓ నష్టాలు చవిచూసినప్పటికీ.. తర్వాత స్వల్ప శ్రేణిలో కదలాడిన చివరికి లాభాల్లో ముగిశాయి. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ దాడులకు పాల్పడిందన్న వార్తల నేపథ్యంలో సెన్సెక్స్ ఉదయం 79,948.80 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై కాసేపటికే లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 80,844.63 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 105.71 పాయింట్ల నష్టంతో 80,746.78 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 34 పాయింట్ల లాభంతో 24,414.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 41 పైసలు క్షీణించి 84.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీపోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, ఐటీసీ, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు ధర 3,383 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




**పాక్ స్టాక్ మార్కెట్ కుదేల్:** మరోవైపు మన భద్రతా బలగాలు చేపట్టిన దాడుల కారణంగా పాక్ స్టాక్ మార్కెట్ కుదేలైంది. పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ ఇండెక్స్ కరాచీ 100 ఆరంభంలో దాదాపు 6 శాతం నష్టంతో 6,272 పాయింట్లు పతనమైంది. తర్వాత కోలుకుంది. మన మార్కెట్లు ముగిసే సమయానికి 3470 పాయింట్ల నష్టంతో (3.09 శాతం) 110,063 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. పహాల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం భారత్ నుంచి ఎప్పుడైనా ప్రతిఘటన ఎదురుకావొచ్చన్న అంచనాలతో ఇప్పటికే ఆ సూచి దాదాపు 3.7 శాతం మేర నష్టపోయింది. తాజా దాడితో మరో మాస్టర్ స్ట్రోక్ తగిలింది.

# ఐఫోన్లన్నీ ఇక భారత్‌లోనే తయారీ

**న్యూఢిల్లీ, మే 7:** ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో ఉత్పత్తి చేయడం ప్రతి కంపెనీకి ఆర్థికంగా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. తాము అమెరికాలో విక్రయించబోయే అధిక శాతం ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయంటూ టెక్ దిగ్గజం ఆపిల్ ప్రకటించడం ఇందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో తమ మొబైల్ ఫోన్లు అన్నింటినీ భారత్‌లోనే తయారు చేయాలని, సోర్సి ంగ్ చేయాలని ఆపిల్ నిర్ణయించుకుంది. కాబట్టి భారత్‌లో ఇన్వెస్ట్ చేశారంటే విశ్వసనీయతను, సహజత్వాన్ని అఫోర్డబిలిటీని ఎంచుకున్నట్లే' అని భారత్ టెలికం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం దన్నుతో దేశీయంగా టెలికం పరికరాల మార్కెట్ అనేక రెట్లు వృద్ధి చెందిందని ఆయన తెలిపారు. రూ.4వేల కోట్ల పెట్టుబడులనేవి రూ.80వేల కోట్ల విక్రయాలకు, రూ.16వేల కోట్లు విలువ చేసే ఎగుమతులతో పాటు 25వేల ఉద్యోగాల కల్పనకు దోహదపడినట్లు సింధియా చెప్పారు. జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే మెజారిటీ ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయని టెక్ దిగ్గజం ఆపిల్ సిఇఒ టిమ్ కుక్ ఇదివరకే ప్రకటించారు. ఐప్యాడ్, మ్యాక్, ఆపిల్ వాచ్, ఎయిర్‌పాడ్స్ మొదలైనవి వియత్నాంలో తయారైనవి ఉంటాయని పేర్కొన్నారు. ఇతరత్రా దేశాల్లో విక్రయించే ఉత్పత్తులు మాత్రమే అత్యధికంగా చైనాలో తయారవుతాయని పేర్కొన్నారు. చైనా నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై అమెరికా భారీగా టారిఫ్‌లు ప్రకటించిన నేపథ్యంలో కుక్ వ్యాఖ్యలు ఇటీవల ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొంత మినహాయింపులున్నా, వివిధ టారిఫ్‌లను కలిపితే చైనానుంచి ఎగుమతి చేసే తమఉత్పత్తులపై ఏకంగా 145 శాతం సుంకాలు వర్తిస్తాయని కుక్ తెలిపారు.



# ఆ పోస్టులు అస్సలు నమ్మవద్దు..

**న్యూఢిల్లీ, మే 7:** ఇటీవల సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. ఏటీఎంలో బ్యాంకు డెబిట్ కార్డును పెట్టే ముందు రద్దు చేయి బటన్‌ను రెండు సార్లు నొక్కితే మోసాల బారిన పడకుండా ఉండొచ్చని దాని సారాంశం. ఏటీఎంలో లావాదేవీలు నిర్వహించే ముందు మెషీన్‌లోని రద్దు చేయి అనే బటన్ రెండు సార్లు నొక్కితే మంచిదని ఇటీవల సోషల్ మీడియలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. అది రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా విడుదల చేసినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో చాలా మంది వినియోగదారులు దాన్ని నిజమనుకుంటున్నారు. ఏటీఎం వద్దకు వెళ్లినప్పుడు అలాగే చేస్తున్నారు. అసలు ఇది నిజమేనా అనే సందేహాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా పోస్టు నేపథ్యంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) రంగంలోకి దిగింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టును పరిశీలించింది. అనంతరం అది నకిలీ పోస్టుగా తేల్చింది. ఏటీఎం మెషీన్‌లో అలా చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని వెల్లడించింది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆ పోస్టు చేయలేదని కూడా తేల్చి చెప్పింది. సైబర్‌నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏటీఎంవద్ద అపరిచితులను నమ్మవద్దని హెచ్చరించింది. ఆధునిక కాలంలో పెరిగిన సాంకేతికతతో బ్యాంకు లావాదేవీలు చాలా సులువుగా జరుగుతున్నాయి. గతంలో డబ్బులను తీసుకోవాలంటే ఉదయాన్నే బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ లైన్‌లో నిలబడి మన వంతు వచ్చాక డబ్బులను తీసుకునేవాళ్లం. ఈ పని చేయడానికి దాదాపు ఒకపూట సమయం పట్టేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రతిఊరిలోనూ ఏటీఎంలువచ్చేశాయి. ఏ సమయంలోనైనా అక్కడకు వెళ్లి చాలా సులువుగా డబ్బులు తీసుకోవచ్చు.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.